RNI.No. APTEL/2014/57702
Estd.: 2000
www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal




సంపుటి : 10 | సంచిక : 169 | గుంటూరు | ఆదివారం, డిసెంబర్ 01, 2024 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 1.00 | పేజీలు : 12

# ఏపీలో తుఫాన్ ప్రభావంపై చంద్రబాబు సమీక్ష..

- ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్ ప్రభావంపై చంద్రబాబు సమీక్ష
- అధికారులు, జిల్లా కలెక్టర్లతో చర్చించిన ముఖ్యమంత్రి
- అప్రమత్తంగా ఉంటూ ప్రజల్ని అలర్ట్ చేయాలన్నారు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫెయింజల్ తుఫాన్ ప్రభావంపై సమీక్ష చేశారు. కలెక్టర్లు, సీఎంవో, విపత్తు నిర్వహణ శాఖ, రియల్ టైం గవర్నెన్స్ అధికారులతో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. ఈ మేరకు అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి సమన్వయంతో పని చేయాలని అధికారులకు చెప్పారు. తుఫాన్‌పై ధాన్యం రైతులు ఆందోళనగా ఉన్నారని.. సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరవేయాలని ఆదేశించారు. మరోవైపు ఫెయింజల్ తుఫాను ఎఫెక్ట్ తిరుపతి జిల్లాపై పడింది. తిరుమలలో నిన్న రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతోంది. మరోవైపు దట్టంగా కమ్మేసిన మంచు, పెరిగిన చలి కారణంగా.. భక్తులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టీటీడీ సూచించింది. పాపవినాశనం, శ్రీవారి పాదాలు మార్గాలు తాత్కాలికంగా మూసివేశారు. చెట్లు విరిగిపడే ప్రమాదం ఉండటంతో టీటీడీ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. అలాగే, తిరుపతి నగరంలోనూ శుక్రవారం రాత్రి నుంచీ వర్షం కురుస్తోంది. చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సైక్లోన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలు సాయం కోసం 0877 – 2236007 నెంబర్‌ను సంప్రదించవచ్చు. భారీ వర్షంతో తిరుపతి విమానాశ్రయం రన్‌వేపై వరద నీరు చేరింది. దీంతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి వచ్చిన ఇండిగో విమానం.. రన్‌వే వరద నీటితో నిండిపోవడంతో ల్యాండ్ అవ్వలేదు. ఆ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. దీంతో ఇండిగో ఎయిర్‌లైన్స్ 6 విమానాలను ఈరోజు రద్దు చేసింది. వీటిలో బెంగళూరు, వైజాగ్, హైదరాబాద్ సర్వీసులు ఉన్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పొరుగునే ఉన్న నెల్లూరు జిల్లాలో కూడా భారీ వర్షాలు పడతున్నాయ. బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా మారడంతో తీవ్ర వాయుగుండం తుఫానుగా మారింది. ఈ తుఫానుకు ఫెయింజల్ అని వాతావరణ శాఖ పేరు పెట్టింది. ఈ ఫెయింజల్ తుఫాను.. పుదుచ్చేరి, తమిళనాడు తీరాలవైపు బలంగా దూసుకొస్తోంది. మరికొన్ని గంటల్లో తీరాన్ని తాకే అవకాశం ఉంది. ఈ ఫెయింజల్ తుఫాను ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని చెన్నైలో ఇప్పటికే పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాల కారణంగా విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు.




# కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాలు దక్కించుకుందాము

- ఆ మేరకు ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించండి
- ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్ : కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు వీసమెత్తు నష్టం వాటిల్లకుండా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఆదేశించారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలు, రికార్డులు, ఉత్తర్వులు సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను, న్యాయ నిపుణులను అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సాగునీటి పరిస్థితి, కృష్ణా గోదావరి జలాలపై ఉన్న అంతరాష్ట్ర వివాదాలు, నీటి వాటాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల నీటి వాటాలు, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను బ్రజేష్కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయించాల్సి ఉంది. ట్రిబ్యునల్ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభిప్రాయాలను, ఆధారాలను మాత్రమే సేకరించింది. త్వరలోనే ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాల్సి ఉంటుందని, ఆ తర్వాత ట్రిబ్యునల్ నిర్ణయం వెలువడుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణా పరివాహక ప్రాంతానికి సంబంధించి ఇప్పటివరకు ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులు, ఏయే ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్లను ఇప్పటికే ట్రిబ్యునల్కు సమర్పించారు.. జలశక్తి మంత్రిత్వ శాఖకు ఇచ్చిన నివేదికలన్నింటినీ వరుస క్రమంలో సిద్ధంగా ఉంచుకోవాలని, వాటి ఆధారంగా ట్రిబ్యునల్ ఎదుట పకడ్బందీగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు, అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం నదీ పరివాహక ప్రాంతాన్ని బట్టి అదే దామాషా ప్రకారం నీటి కేటాయింపులుండాలి. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా.. ఏపీలో కేవలం 30 శాతం ఉంది. అదే వాదనల ప్రకారం 1005 టీఎంసీల్లో 70 శాతం నీటి వాటా తెలంగాణకు దక్కేలా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ కృష్ణా డెల్టాకు వినియోగిస్తున్నందున, వాటికి బదులుగా నాగార్జునసాగర్ ఎగువన 45 టీఎంసీలు తెలంగాణకు నీటి కేటాయింపులున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ నీటి వాటాను ఎగువన ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకునే ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రజేష్కుమార్ ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ ఇప్పటివరకు పూర్తి చేయనందున, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల నిర్ణయాలను ఎందుకు పట్టించుకోవాలని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ పూర్తయ్యేవరకు గోదావరి, కృష్ణా బోర్డుల జోక్యం ఉండకూడదని సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వివిధ ప్రాజెక్టుల ద్వారా కృష్ణా జలాల్లో కోటాకు మించి ఎక్కువ నీటిని ఏపీ తరలిస్తోందని చర్చ జరిగింది. నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా లెక్కించే టెలీ మెట్రీ విధానంతో దీనికి అడ్డుకట్ట వేసే వీలుందని అధికారులు సీఎంకు వివరించారు. టెలీ మెట్రీ పరికరాలకయ్యే రూ. 12 కోట్లు రెండు రాష్ట్రాలు చెరి సగం చెల్లించాలని అధికారులు సీఎంకు వివరించారు. అవసరమైతే మొత్తం డబ్బులు ముందుగా భరించి టెలీమెట్రీ అమల్లోకి తీసుకురావాలని, ఏపీ ఇచ్చినప్పుడు రీయింబర్స్ చేసుకోవాలని సీఎం సూచించారు. నీటి వినియోగం విషయంలో జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులన్నింటి ద్వారా ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటుందో లెక్కలు తీయాలని ఆదేశించారు. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, బంకంచెర్ల హెడ్ రెగ్యులేటరీ, తెలుగు గంగ, కేసీ కెనాల్, హంద్రీ నివా, గాలేరు నగరి, వెలుగోడు ప్రాజెక్టుల నుంచి ఎంత నీటిని తరలిస్తున్నారనే వివరాలన్నీ రికార్డు చేయాలని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీకి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు అవసరమైన పనులన్నీ తొందరగా చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, నీటి వాటాలకు సంబంధించి సమర్థంగా వాదనలు వినిపించేందుకు 2014 నుంచి ఇప్పటివరకు ఉన్న జీవోలు, తీర్పులే కాకుండా.. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవోలు, మెమోలు, ప్రాజెక్టుల డీపీఆర్లు, అప్పటి నుంచి నీటి వాటాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్రంగా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. వీటి ఆధారంగా అన్ని వేదికలపై తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేలా సమర్థమైన వాదనలు వినిపించాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ వైద్యనాథన్, ఏజీ సుదర్శన్రెడ్డి, అడిషనల్ ఏజీ రజనీకాంత్ రెడ్డి, ప్రభుత్వం తరపు న్యాయవాది ఖుష్ వోరా, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, సీఎం సెక్రెటరీ మాణిక్రాజ్, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇరిగేషన్ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.





## గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీ

- లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ

కొజికోడ్ నవంబర్ 30: ప్రధాని నరేంద్ర మోడీ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. “లోక్ సభలో వేము రాజకీయ సిద్ధాంతాలపై పోరాడుతున్నాము. మేమేమో అనుభూతులు, భావోద్వేగాలు, ప్రేమ వంటి వాటి గురించి మాట్లాడుతున్నాం. కానీ వారేమో విద్వేషం, క్రోధం, విభజన, హింస గురించి మాట్లాడుతున్నారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతోంది. ఇతర భారతీయులకు భిన్నంగా అదానీని మాత్రం ప్రత్యేకంగా చూస్తామని ప్రధాని మోడీ అంటున్నారు'' అని రాహుల్ గాంధీ వాయనాడ్ లో జరిగిన బహిరంగ సభలో తెలిపారు. ‘‘అమెరికా అదానీని ఆరోపిని చేసినప్పటికీ, దోషిగా చేసినప్పటికీ అదేమంత విషయం కాదని మోడీ అంటున్నారు. మన దేశంలో మాత్రం అతడిని దోషిని చేయమంటున్నారు” అని రాహుల్ గాంధీ అన్నారు. లంచం కేసులో అమెరికా ప్రాసిక్యూటర్లు అదానీని దోషిగా తేల్చారు. ఆయనపై కేంద్రం కఠిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. రాహుల్ గాంధీ బిజెపి మీద దాడి చేస్తూ వారి వద్ద డబ్బు, ఇంటెలిజెన్స్ సంస్థలు, సిబిఐ, ఈడి, ఐటి వంటివన్నీ ఉన్నాయి. కానీ మా దగ్గర కేవలం ప్రజల భావోద్వేగాలున్నాయి. మేము బిజెపి సిద్ధాంతాలను ఓడిస్తామన్న విశ్వాసం మాకుంది” అన్నారు. “ప్రియాంక గాంధీ మీ పార్లమెంటు ప్రతినిధి. మీరామెను ఎన్నుకున్నారు.

ప్రజల్లో ఉన్న అభిమానం ప్రియాంక గాంధీని ఎంపీని చేసిందని నేను భావిస్తున్నాను” అంటూ రాహుల్ గాంధీ తెలిపారు.

# అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో గ్యాప్ ఉండొద్దు

- 100 శాతం టార్గెట్ ను రీచ్ కావాలిసిందే
- మూడు నెలల సమయం ఇస్తున్నాం
- పాల సరఫరాను విజయ డెయిరీ మెరుగు పరుచుకోవాలి
- పోషకాహార తెలంగాణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఆరోగ్య లక్ష్మీ పథకంపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్ : అంగన్ వాడీ కేంద్రాలకు చేసే పాల సరఫరాలో ఎటువంటి గ్యాప్స్ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీచేసారు. మారు మూల ప్రాంతాల్లోని అంగన్ వాడీ కేంద్రాలను సకాలంలో పాల సరఫరా జరగాల్సిందేనని స్పష్టం చేసారు. పోషకాహార తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య లక్ష్మీ పథకం పై మంత్రి సీతక్క శనివారం నాడు సచివాలయంలో తన చాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రాలకు జరుగుతున్న పాల సప్లై పై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలసి మంత్రి సీతక్క సమీక్షించారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని అమలు చేస్తుంది. ఇందులో బాగంగా ప్రతి రోజ 200 ఎం ఎల్ పాలను గర్భిణీలు, బాలింతలకు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పంపిణి చేస్తారు. ప్రభుత్వ విజయ డెయిరీ టెట్రా ప్యాకెట్ల అంగన్ వాడీ కేంద్రాలకు సప్లై చేస్తుంది. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 1.67 కోట్ల లీటర్ల సరఫరా కోసం ఆర్డర్ చేయగా...1.56 కోటి లీటర్ల పాలను విజయా డెయిరీ సరఫరా చేయగలిగింది. అంటే 94 శాతం మేర సప్లై చేయగలిగింది. అయితే కొన్ని అంగన్ వాడీ సెంటర్లకు సకాలంలో పాలు సప్లై కాకపోవడం పట్ల మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం కోరినంత మేర పాలు సరఫరా చేయగలరా? లేదా?..అంత సామర్థ్యం ఉందా? లేదా? సరిపోయినంత సప్లై చేసే శక్తి లేకపోతే..మీ ఇండెంట్ ను తగ్గించి ఇతర సంస్థల ద్వారా సప్లై చేసుకోవాలా అని విజయ డెయిరీ ప్రతినిధులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తామని..పాల సరఫరా సంతృప్తికరంగా లేకపోతే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ విజయ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తుందని...అందుకే రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు విజయ డెయిరీ నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామని గుర్తు చేసారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు తమకు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ అంతే ముఖ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేసారు. అందుకే అంగన్ వాడీ కేంద్రాలకు జరిగే పాల సప్లై లో ఏలాంటి గ్యాప్స్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ఆరోగ్య తెలంగాణ, పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని..ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అయ్యే పాల నాణ్యతను స్వయంగా రుచి చూసి మంత్రి సీతక్క పరిశీలించారు. పాల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. ప్రస్తుతం లీటర్ టెట్రా ప్యాక్ ను రూ. 57 కి విజయ డెయిరీ సరఫరా చేస్తుంది. ధరలను సవరించాలని విజయా డెయిరీ ప్రతిపాదించగా..మంత్రి తిరస్కరించారు. మూడు నెలల పాటు ఏలాంటి గ్యాప్స్ లేకుండా పాలను సరఫరా చేసిన తర్వాత మరో సారి సమీక్షించి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసారు మంత్రి సీతక్క.



## తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కొత్త ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం



హైదరాబాద్ నవంబర్ 30 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్సి)కు తెలంగాణ ప్రభుత్వం కొత్త ఛైర్మన్‌ను నియమించింది. ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశంను టిజిపిఎస్సి ఛైర్మన్ గా నియమించింది. ఈ మేరకు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, డిసెంబర్ 3తో ప్రస్తుత ఛైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో ఛైర్మన్ పోస్టుకు నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, వివిధ వర్సిటీల ప్రొఫెసర్లతోపాటు మొత్తం 45 దరఖాస్తులు రాగా.. అందులో బుర్రా వెంకటేశంను సీఎం రేవంత్ రెడ్డి ఎంపిక చేసి చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఆయన నియామక ఫైల్‌ను గవర్నర్‌కు పంపగా ఆమోదించడంతో టిజిపిఎస్సి కొత్త ఛైర్మన్ గా నియమించింది.



## టీడీపీలో చేరబోతున్న తీగల కృష్ణారెడ్డి.. డిసెంబర్ 3న ముహూర్తం ఫిక్స్!

హైదరాబాద్ నవంబర్ 30 : మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత తీగల కృష్ణారెడ్డి టీడీపీలో చేరబోతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఆయన ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 3న ఆ పార్టీ చీఫ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో కృష్ణారెడ్డి టీడీపీలో చేరనున్నారట. ఈ విషయాన్ని ఆయన మీడియాకు వెల్లడించారు. ఏపి ముఖ్యమంత్రి ప్రమాణం చేసిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన చంద్రబాబును మాజీ మంత్రి మల్లారెడ్డితోపాటు ఆయన కలిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. కాగా, 2014లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. కాగా తీగల కృష్ణారెడ్డి తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవి ఇవ్వాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు సమాచారం.

## కెటిఆర్ కు పెద్ద షాక్

**భూకబ్జా కేసులో ప్రధాన అనుచరుడి అరెస్టు!**

సిరిసిల్లా నవంబర్ 30 : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఏ కెటిఆర్ అనుచరుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్లా మున్సిపల్ పరిధిలోని సర్దపూర్ లో కెటిఆర్ ప్రధాన అనుచరుడు బిఆర్ఎస్ కీలక నేత బొల్లి రామ్మోహన్ ను అరెస్టు చేశారు. అతడు అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జాచేసి, చాలా కాలంగా కంకర క్వారీ నిర్వహిస్తున్నాడని అభియోగం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అతడిని శనివారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బొల్లి రామ్మోహన్ సిరిసిల్ల పట్టణ బిఆర్ఎస్ బిసి విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అతడు ఇసుక మాఫియా, భూకబ్జా చేస్తూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నాడని ఆరోపణలున్నాయి. కాగా రామ్మోహన్ అరెస్టు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# సంపాదకీయం

## ప్రమాదంలో దేశ సమగ్రత

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసలో తాజాగా మరో ఏడుగురు మృతి చెందడమే కాకుండా పరిస్థితి మరింత దిగజారింది. ఇటీవలి కాలంలో, కేంద్ర భద్రతా బలగాలు 11 మంది కుకీలను కాల్చి చంపినందుకు ప్రతీకారంగా జిరిబామ్ నుండి ఎనిమిది నెలల వయసున్న చిన్నారులు, రెండున్నరేళ్ల పిల్లలతో సహా ఆరుగురు మెయితీలను అపహరించారు. పోలీసుల కాల్పుల్లో మరో మెయితీ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఒకవైపు హత్యల పరంపర కొనసాగుతుండగానే మంత్రులు, రాజకీయ పార్టీల నేతల ఇళ్లు, కార్యాలయాలు తగలబడుతున్నాయి. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కుటుంబ సభ్యుల నివాసంపైనా దాడి జరిగింది. క్యాబినెట్ మంత్రులు తొంగం బిశ్వజిత్, గోబిందాస్ ఇళ్లకు నిప్పుపెట్టారు. తొమ్మిది మంది బిజెపి ఎమ్మెల్యేలు, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే సహా 14 మంది ఎమ్మెల్యేల ఇళ్లపై దాడి జరిగింది. ఇంఫాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ల బిల్‌బోర్డ్‌లను కూడా మూకలు ధ్వంసం చేశాయి. జిరిబామ్‌లో సి.ఆర్.పి.ఎఫ్ కాల్పుల్లో 11 మంది కుకీలు మరణించిన విషయాన్ని పోలీసులు దాచిపెట్టాలని చూశారు. కానీ పోస్టుమార్టం నివేదిక వాస్తవాన్ని బట్టబయలు చేసింది. రాష్ట్రంలో దాడులు, కాల్పులు నిరంతరం జరుగుతుండటంతో రాజకీయ వాతావరణం కూడా శరవేగంగా దిగజారిపోతోంది. మెయితీ నాయకుడిలా పూర్తిగా పక్షపాత ధోరణిలో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పట్ల మిత్రపక్షాలు, సొంత ఎమ్మెల్యేలు సైతం విశ్వాసం కోల్పోయే పరిస్థితి నెలకొంది. బిజెపి తర్వాత ఫ్రంట్‌లో అతి పెద్ద భాగస్వామిగా వున్న 'నేషనల్ పీపుల్స్ పార్టీ' ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ%ఔ% ఏడుగురు ఎమ్మెల్యేలతో కూడిన ఎన్‌పిపి తన మద్దతు ఉపసంహరించుకుంది. ప్రభుత్వానికి ముప్పు లేకపోయినప్పటికీ బీరేన్ సింగ్ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ రోజురోజుకు తగ్గుతోందని తెలుస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేలు వున్న 'కుకీ పీపుల్స్ ఫ్రంట్' మద్దతు ఉపసంహరించుకున్న ఏడాది తర్వాత మరో పార్టీ కూడా అదే బాటలో నడిచింది. ఇదిలా వుండగా ఎన్‌పిపి నేత, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా మణిపూర్ ముఖ్యమంత్రిని మార్చాలని పట్టుబడుతున్నారు. మణిపూర్ ఘటనను ఈశాన్య రాష్ట్రాలు ఎలా చూస్తున్నాయనడానికిదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ జిరిబామ్ నియోజకవర్గ బిజెపి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో సహా ఎనిమిది మంది రాజీనామా చేశారు. గత నెలలో స్పీకర్ సత్యవ్రత్ సింగ్, విద్యాశాఖ మంత్రి విశ్వజిత్ సింగ్ సహా 19 మంది బిజెపి ఎమ్మెల్యేలు బీరేన్ సింగ్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. ఇంఫాల్‌లో సాధారణ పరిస్థితులు వున్నాయెూ లేవో నిర్ధారించుకోవడానికి మంగళవారం తన నివాసంలో ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఎన్‌డిఎ సమావేశం నుండి 11 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. వీరిలో ఏడుగురు బిజెపికి చెందిన వారు. ఇదంతా చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం, బిజెపి రక్షణగా ఉన్న బీరేన్ సింగ్ కు మద్దతు తగ్గుముఖం పడుతోందన్న విషయం స్పష్టమౌతోంది. ఇదిలా వుండగా గవర్నర్ నివేదిక కోసం ఎదురు చూడకుండా శాంతిభద్రతలు దిగజారడానికి కారణమైన బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని కేంద్రం రద్దు చేయాలని ప్రముఖ న్యాయవాది దుష్యంత్ దవే డిమాండ్ చేశారు. ('ది హిందూ' కథనం). కాబట్టి ముఖ్యమంత్రిని మార్చేందుకు కేంద్రం, బిజెపి సిద్ధంగా ఉండాలి. మణిపూర్ తగలబడిపోతున్నప్పుడు కూడా దాన్ని ఏమాత్రం సమస్యగా భావించని హెూంమంత్రి అమిత్ షా మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల పర్యటనలో ఉన్నారు. అయితే పరిస్థితి విషమించడంతో అమిత్ షా ప్రచారానికి స్వస్తి చెప్పి ఢిల్లీకి హుటాహుటిన వెళ్లాల్సి వచ్చింది. అమిత్ షా రెండు రోజుల పాటు ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి 50 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలను మణిపూర్ పంపాలని నిర్ణయించారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితి నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా వుంది. ముందుగా ఈ విషయాన్ని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియచేయాలి. అందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. సైనిక చర్యతో సమస్య పరిష్కారం కాదన్న విషయాన్ని మోడీ ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. వివాదం ప్రారంభమై ఏడాదిన్నర గడిచినా ప్రధాని రాష్ట్ర పర్యటనకు రాకపోవడం నేరపూరిత నిర్లక్ష్యమే. వివిధ వర్గాల ప్రజలను విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నాలు వేగంగా ప్రారంభించాలి. కాశ్మీర్, పంజాబ్, బాబ్రీ మసీదు సమస్యలు తలెత్తినప్పుడు జాతీయ సమైక్యత కమిటీ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వాలు ప్రయత్నించాయి. అయితే మోడీ ప్రభుత్వం వచ్చాక జాతీయ సమైక్యత కమిటీ గత చరిత్రగా మారింది. పదకొండేళ్లలో ఎన్నో సమస్యలున్నా ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. అధికార బిజెపి, ప్రధాని మోడీ జాతీయ సమైక్యత, దేశ సమగ్రత, ఐక్యత గురించి పైకి చిలక పలుకులు పలుకుతుంటారు. కానీ ఆచరణలో మాత్రం వారు విభజించి పాలించాలన్న వలస పాలకుల వ్యూహాన్ని అనుసరిస్తుంటారు. కేంద్రంలోను, రాష్ట్రాలలోనూ అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు మతం, కులం, జాతి, భాష, ఆహారం ప్రాతిపదికన ప్రజలను విభజిస్తున్నారు. యు.పిలో యోగి ఆదిత్యనాథ్ ఆ నినాదంతోనే రాష్ట్ర ప్రజలను మత ప్రాతిపదికన చీలుస్తున్నారు. మొదట వారిని విభజిస్తారు. దాంతో వారు వినాశనం అంచుకు చేరుకుంటారు. సరిగ్గా మణిపూర్‌లో జరుగుతున్నది ఇదే. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు, క్రిస్టియన్లపై హిందువులు కాలు దువ్వేలా చేస్తున్నది. హిందీ మాట్లాడే వారిని ఇతర భాషలు మాట్లాడే వారిపైకి, శాకాహారులను మాంసాహారారుల పైకి ఎగదోస్తోంది. హర్యానాలో జాట్‌లకు వ్యతిరేకంగా ఇతర జాతులవారిని, బీహార్, యు.పి లో అత్యంత వెనుకబడిన కులాల వారిపైకి యాదవులను ఎగదోయడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. హిందూత్వ వాదులు రాజ్యాంగంగా భావించే మనుస్మృతి ప్రజలను కులాల వారీగా విభజిస్తున్నది. బిజెపి అనుసరిస్తున్న విభజన విధానమే ఈశాన్య రాష్ట్రాలను, ముఖ్యంగా మణిపూర్‌ను అశాంతికి గురిచేస్తున్నది. సంఘ పరివార్ క్రమంగా మెయితీలను వైష్ణవిజం వైపు తిప్పుకుంది. తరువాత సనాతన వాదాన్ని విశ్వసించే హిందూత్వ జాతీయవాదులుగా మార్చింది. తర్వాత క్రైస్తవ కుకీలకు వ్యతిరేకంగా వారిని సమీకరించింది. అరంభీలను సమీకరించి కుకీలపై దాడులకు థెమ్‌కాల్ అనే సాయుధ సమూహాన్ని ప్రోత్సహిస్తోంది. మెజారిటీ మెయితీల మద్దతుతో శాశ్వతంగా అధికారంలో తిష్ట వేయాలన్న ఆలోచనతో బిజెపి ఈ వివాదాన్ని రేపింది. ఇది నేడు దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసే స్థాయికి వెళ్లింది. అందువల్లనే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చేతుల్లో దేశం ఏమాత్రం సురక్షితంగా లేదని సిపిఎం ఎప్పటి నుంచో చెబుతున్నది. సంఘ్ పరివార్ సమాజంలోని ఒక సెక్షన్‌ను శత్రువుల పక్షాన నిలిపి ఐక్యత కోసం పిలుపునిస్తుంది. అంతిమంగా అది విభజనకు, అంతులేని సంఘర్షణకు దారితీస్తుంది. మణిపూర్ ప్రారంభం మాత్రమే. మిజోరంలోని మెయితీలు భయం అంచున జీవనం సాగిస్తున్నారు. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లోనూ బిజెపి ఇదే విధానాన్ని అవలంబిస్తోంది. మిజోరాం, నాగాలాండ్, జార?ండ్ లలో క్రైస్తవులను దువ్వి బంగ్లాదేశ్ ముస్లింలపైకి ఎగదోసేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోంది. ఇటువంటి విచ్ఛిన్నకర ఎజెండాను ఒకవైపు అమలు చేస్తూ మరోవైపు ఈశాన్య రాష్ట్రాల సంబంధాలను మెరుగుపరిచామని మోడీ గొప్పలు చెప్పుకుంటున్నారు. మొత్తంమీద మోడీ పాలన ఈశాన్య రాష్ట్రాలలో రోసిపోయింది.

# నిరుపమానాలు... సరిహద్దు భద్రతా దళ సేవలు

భారత దేశం స్వాతంత్ర్యం సాధించాక, దేశ అంతర్జాతీయ సరిహద్దుల రక్షణ ప్రతి సరిహద్దు రాష్ట్రానికి చెందిన స్థానిక పోలీసుల బాధ్యతగా ఉండేది. అయితే ఈ విషయంలో అంతర్ - రాష్ట్ర సమన్వయం తక్కువగా ఉంది. 1965 ఇండో - పాకిస్తానీ యుద్ధం సమయంలో , పాకిస్తాన్ 9 ఏప్రిల్ 1965న కచ్‌లోని సర్దార్ పోస్ట్, ఛార్ బెట్ మరియు బెరియా బెట్‌లపై దాడి చేసింది. సాయుధ దాడిని ఎదుర్కోవడంలో రాష్ట్ర సాయుధ పోలీసుల అసమర్థతను ఈ దాడి బట్టబయలు చేసింది. యుద్ధం ముగిసిన తర్వాత, భారతదేశం యొక్క అంతర్జాతీయ సరిహద్దులను కాపాడే నిర్దిష్ట ఆదేశంతో ప్రభుత్వం సరిహద్దు భద్రతా దళాన్ని ఏకీకృత కేంద్ర ఏజెన్సీగా సృష్టించింది. ఈ నేపథ్యంలో1965, 1 డిసెంబర్ న భారత సరిహద్దుల భద్రతను నిర్ధారించడం కోసం ఏర్పడింది. ప్రపంచంలోని అతిపెద్ద సరిహద్దు బలగాలలో ఒకటైన భారత బి. ఎస్. ఎఫ్. దేశం కోసం 6000 కి.మీ కంటే ఎక్కువ అంతర్జాతీయ సరిహద్దుకు బాధ్యత వహిస్తుంది. ఈ ఏజెన్సీ ప్రధానంగా...సరిహద్దులు దాటిన నేరాలను నిరోధించడం, భారత భూభాగంలోకి అనధికారికంగా ప్రవేశించనీయ కుండా చేయడం, సరిహద్దులో స్మగ్లింగ్ మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించడం, చొరబాటు నిరోధక విధులు, సరిహద్దుల మధ్య నిఘా సేకరణ, సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించడం లక్ష్యాలు. భారత సైనికులు ఇరవై నాలుగు గంటలు సరిహద్దుల్లో దేశానికి కాపలా కాస్తూ ఎడారి ఎండల్ని, మంచుకొండల మంచును, నిరంతరం కురిసే వర్షాలను లెక్క చేయకుండా దేశ రక్షణలో ప్రాణ త్యాగానికైనా సిద్ధపడి ఉండడం వల్ల మాత్రమే మనం శాంతి యుతంగా జీవించ గలుగు తున్నాం. తమ కుటుంబాలకు దూరంగా మంచు కొండల్లో, ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తూ దేశాన్ని కంటికి రెప్పలా కాపలా కాస్తూ, కేవలం దేశరక్షణకే పరిమితం కాకుండా వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల రక్షణలోనూ ముందుంటున్న మన సైనికుల రుణాన్ని ఏ విధంగా తీర్చుకోవడం సాధ్యం..భారతీయ సైన్యం చరిత్ర కొన్ని వేల సంవత్సరాలకు పైబడిందే. మహాభారత కాలాల్లో కురుక్షేత్ర సంగ్రామంలో లక్షలాది మంది యుద్ధంలో పాల్గొన్నారు. రధాలు, గుర్రాలు, ఏనుగులపై నుంచి యుద్ధం సాగించడమే కాకుండా నేలపై నుంచి కూడా యుద్ధం చేసారు. అప్పట్లో విశ్వశాంతి, ధర్మ పరిరక్షణల కోసం అనేక యుద్ధాలు జరిగాయి. క్రమక్రమంగా రాజ్య విస్తరణ కాంక్షతో, నాగరికత పెరిగే కొద్దీ వాయవ్య దిశగా హిందూకుష్ పర్వతాల ద్వారా చొరబాట్లు పెరిగాయి. ఎన్నో శతాబ్దాల పాటు అక్కడ పర్యవేక్షణ లేదు. ఆ తరువాత చొరబాట్లకు అనేక మార్గాలు ఏర్పడ్డాయి. వీటిని ఎదుర్కొనేందుకు ఆయా ప్రదేశాల రాజ్యాధినేతలు యుద్ధాలు చేయాల్సి




వచ్చేది. స్వదేశీ తెగల్లోని సైన్యం ప్రధాన ఆయుధాలు విల్లు, బాణాలు. ఆనాటి యుద్ధ కారణాలు పరిమితంగా ఉండేవి. మనుగడ, చొరబాట్లకు సంబంధించినవే ఎక్కువ. భారతీయ రాజకీయ చరిత్రలో చెపుకోదగ్గ తొలి చొరబాటు క్రీ.పూ.327 లో అలెగ్జాండర్ అధ్వర్యంలో గ్రీకులది.ప్రాచీన భారతీయ సాహిత్యంలో రాజకీయాల్లో యుద్ధాల ప్రస్తావనలు ప్రముఖంగా కనిపిస్తాయి. చంద్రగుప్త మౌర్యులు కాలంలోని సైన్యాన్ని ఈ సందర్భముగా ప్రస్తావనార్హం. కళింగ, మౌర్యుల గుప్తుల కాలం లో మన దేశానికి నిలయంగా ప్రపంచ గుర్తింపు లభించినది. ఈ విధంగా రాజ్యాల రక్షణ కోసం సైన్యము సైనిక అవసరాలు కలిగాయి. స్వాతంత్ర్యం సాధించుకున్నాక, స్వతంత్ర రాజ్యమైన కాశ్మీర్ మహారాజు ఇటు భారత దేశంలో లేదా అటు పాకిస్తాన్‌లో విలీనానికి అంగీకరించలేదు. మహారాజు భారత ప్రభుత్వాన్ని శరణు కోరి భారత దేశంలో కాశ్మీర్‌ను విలీనం చేయడానికి అంగీకరించి ఒప్పందం చేసాడు. అప్పుడు భారత ప్రభుత్వం జనరల్ తిమ్మయ్య నేతృత్వంలో సైన్యాన్ని పంపి పాకిస్తాన్ సైన్యాన్ని కాశ్మీర్ నుండి వెళ్ళగొట్టే చర్యలుచేపట్టింది. తర్వాత... బ్రిటీష్, ఫ్రెంచ్ సైన్యాలు భారత దేశాన్ని విడిచి వెళ్ళినా, పోర్చుగీసు సైన్యం విడిచి వెళ్ళక గోవా, డామన్ దయ్యులను తన ఆధీనంలో ఉంచుకుంది. భారత ప్రభుత్వం ఆపరేషన్ విజయ్ పేరుతో సైన్యాన్ని పంపగా, పోర్చుగల్ దేశం భారతదేశంతో సంధికి ఒప్పుకొని అన్ని ప్రాంతాలను విడిచి వెళ్ళేందుకు అంగీకరించింది.చైనాతో 1962లో జరిగిన యుద్ధంలో సైన్యం అంతులేని సాహసాలు ప్రదర్శించారు. కాశ్మీర్ ప్రజలు పాకిస్తాన్ కు మద్దతు ఇస్తారు అన్న అపోహలతో 1965లో పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ తన సైన్యాన్ని పంపి కాశ్మీర్‌ను కొంత మేరకు ఆక్రమించు కున్నాడు. భారత తానేమిటో చూపెట్టింది. 1971లో తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్) లో జరిగిన తిరుగు బాటుతో దాదాపు కోటి మంది శరణార్థులు భారత దేశానికి రావడంతో భారత్-పాక్ యుద్ధం మొదలయింది. తన బలగాలన్నిటినీ పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుత పాకిస్తాన్) వైపే గురి పెట్టగలిగింది. భారత సైన్యం జనరల్ అరోరా నేతృత్వంలో పాక్ సైన్యాన్ని లాహెూర్ వరకు తరిమి కొట్టి 90వేల యుద్ధ ఖైదీలను పట్టుకొంది. పాక్ ఓటమిని అంగీకరించడంతో ఈ యుద్ధం ముగిసింది. 1999లో పాకిస్తాన్ తన సైన్యాన్ని పంపి తీవ్రవాదులతో కలసి బటాలిక్, ద్రాస్, టైగర్ హిల్‌లను ఆక్రమించు కోవడం, కార్గిల్ యుద్ధం జరుగుతున్న ప్రాంతాల కున్న పరిమితులవల్ల 30వేల మంది మాత్రమే పాల్గొన్నారు. సైన్యం అనేక కీలక పర్వతాలలో, చెక్ పోస్టుల వద్ద ఉన్న తీవ్రవాదులను సమర్థవంతంగా ఎదుర్కొని రెండు నెలల్లో అన్నింటినీ స్వాధీనం చేసుకుంది. ఇలా భారత సరిహద్దు లలో సైన్యం అంతులేని ధైర్య సాహసాలు ప్రదర్శిస్తు, సకల త్యాగాలకు సిద్ధపడి, ప్రాణాలను పణంగా పెట్టి అనుక్షణ అప్రమత్తులై దేశ రక్షణ చేస్తున్నారు.

1990వ దశకంలో, వాస్తవానికి భారతదేశం యొక్క బాహ్య సరిహద్దులను రక్షించే బాధ్యతను స్వీకరించినప్పటికీ , జమ్మూ మరియు కాశ్మీర్, పంజాబ్ మరియు ఈశాన్య ఏడు రాష్ట్రాలలో తిరుగుబాటు నిరోధక మరియు తీవ్రవాద వ్యతిరేక కార్యకలా పాలలో బిఎస్‌ఎఫ్.కు బాధ్యతలు అప్పగించ బడ్డాయి. పంజాబ్‌లో ఉన్నప్పుడు, బ్లూ స్టార్, బ్లాక్ థండర్ వంటి కార్య కలాపాలలో పాల్గొంది. జమ్మూ కాశ్మీర్‌లో, మొదట్లో తీవ్రవాద దాడులతో నష్టపోయి నప్పటికీ, తరువాత విజయాలు సాధించింది. 2001 ఆగస్టు 2003లో జరిగిన భారత పార్లమెంటు దాడికి ప్రధాన సూత్రధారి మరియు అతని డిప్యూటీ కమాండర్‌తో పాటు జైష్-ఎ-మహ్మద్ చీఫ్ మరియు ఘాజీ బాబాను చంపిన ఘనత కూడా బి ఎస్ ఎఫ్ కు ఉంది. నక్సల్ హింసను ఎదుర్కోవడానికి మధ్య భారతదేశంలో బి యస్ ఎఫ్ కొన్ని యూనిట్లు కూడా మోహరించ బడ్డాయి. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఇటీవలే సరిహద్దు భద్రతా దళం అధికారాల పరిధిని పెంచింది.


రామ కిష్టయ్య సంగన భట్ల...

ఈ మేరకు అధికారులకు అరెస్టు, సెర్చ్, స్వాధీనం చేసుకునే అధికారాలను ఇచ్చింది. ఈ అధికార పరిధి అంతర్జాతీయ సరిహద్దులను కాపాడే పశ్చిమ బెంగాల్, పంజాబ్, అసోం మూడు రాష్ట్రాలలో బిఎస్‌ఎఫ్ తన విస్తరించబడిన అధికారాలను అమలు చేయడానికి జూలై 2014 కంటే ముందటి నోటిఫికేషన్ షెడ్యూల్‌ను సవరిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది.

# దాన ధర్మాలకు ఉద్దిష్టమైనది కార్తీక అమావాస్య



కార్తీక మాసం అమావాస్యను అఘన అమావాస్య, భౌమవతి అమావాస్య అంటారు. హిందూ పంచాంగం ప్రకారం కార్తీక బహుళ అమావాస్యతో కార్తీక మాసం పూర్తవుతుంది. హిందూ సంప్రదాయంలో ఇది అత్యంత పవిత్రమైనదిగా భావించ బడుతుంది. ఈ రోజు పూర్వీకులను స్మరించు కోవడం, దేవతలకు పూజలు చేయడం ముఖ్యమైన ఆచారం. కార్తీక అమావాస్య విశ్వాసాల ప్రకారం, ఈ రోజు నిర్వహించే పూజలు, దానధర్మాలు భక్తులకు ఆధ్యాత్మిక శ్రేయస్సును అందిస్తాయి.ఈ రోజున పితృదేవతలకు తర్పణం చేయడం అత్యంత ముఖ్యమైన పూజగా భావిస్తారు. పూర్వీకులకు తర్పణం అందించడం ద్వారా వారి ఆశీర్వాదం లభిస్తుందని నమ్మకం. ఈ పూజ ద్వారా పితృ ఋణం నుంచి విముక్తి పొందవచ్చని శాస్త్రాలు పేర్కొంటాయి.కార్తీక అమావాస్య రోజున శివుడు, విష్ణువు, లక్ష్మీదేవి వంటి దేవతలను పూజించడం ప్రత్యేకమైనదిగా భావిస్తారు. శివలింగానికి కార్తీక దీపం వెలిగించడం, విష్ణుమూర్తిని పూజించడం ద్వారా ఆధ్యాత్మిక క్షేమం లభిస్తుందని విశ్వాసం.ఈ రోజున పేదలకు ఆహారం, బట్టలు, ఇతర వస్తువులు దానం చేయడం పుణ్య కార్యంగా భావించ బడుతుంది. దానం వల్ల కర్మ ఫలితాలు మంచిగా ఉంటాయని హిందూ ధర్మంలో పేర్కొన్నారు.కొంతమంది భక్తులు ఉపవాసం ఉండి, ఆధ్యాత్మిక శ్రద్ధతో పూజలు నిర్వహిస్తారు. ఉపవాసం ద్వారా శరీర శుద్ధి, మనస్సు ప్రశాంతత లభిస్తాయని విశ్వాసం.భక్తులు కార్తీక అమావాస్య ఉదయం లేవగానే గంగ, గోదావరి, కృష్ణ వంటి పవిత్ర నదుల్లో స్నానం చేయడం మంచి ఫలితాలను అందిస్తుందని నమ్ముతారు. పవిత్ర స్నానం వల్ల శారీరక, ఆధ్యాత్మిక శుద్ధి కలుగుతుందని విశ్వాసం.భక్తులు ఇంట్లోనే లేదా దేవాలయాలకు వెళ్లి శివుడు, విష్ణువు, లక్ష్మీదేవి వంటి దేవతలను పూజిస్తారు. పూజలో దీపారాధన, నైవేద్యం సమర్పించడం విశేష ఫలితాలను అందిస్తుందని నమ్మకం.పితృదేవతలకు తర్పణం చేయడం ద్వారా వారి ఆశీర్వాదం పొందవచ్చని భావించబడుతుంది. ఈ తర్పణం నదీ తీరాల వద్ద లేదా ఇంట్లోనే చేయవచ్చు.భక్తులు పేదలకు అన్నదానం, వస్త్రదానం చేయడం ద్వారా పుణ్యం సంపాదిస్తారు. దీనివల్ల కర్మఫలాలు శ్రేయస్సు కదిలిస్తాయని నమ్మకం.సాయంత్రం సమయంలో ఇంటి వద్ద లేదా దేవాలయాలలో దీపాలు వెలిగించడం ఎంతో విశేషం. దీపాలు వెలిగించడం ద్వారా చీకటి తొలగిపోవడం, ఆధ్యాత్మిక జ్ఞానం ప్రసాదించడం అనగా భావిస్తారు.కార్తీక అమావాస్య రోజున భక్తులు ఉపవాసం ఉంటారు. ఉపవాసంతో పాటు సాంప్రదాయ పూజలు చేస్తారు. శివుని పూజలో బిల్వ దళాలు సమర్పించడం, దీపం వెలిగించడం ముఖ్యమైన ఆచారం. ఉపవాసం శారీరక ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా, మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని నమ్మకం.పురాణాల ప్రకారం, కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతికరమైనది. కార్తీక అమావాస్య రోజున శివుడు భక్తులకు అనుగ్రహం చేస్తాడని విశ్వాసం. అంతేగాక, కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం వల్ల బ్రహ్మాండ శక్తుల అనుగ్రహం లభిస్తుందని చెబుతారు.కార్తీక అమావాస్య రోజున పూజలు, తర్పణం, దానాలు చేయడం వల్ల పాప విముక్తి లభిస్తుందని, పితృదేవతల కృపతో కుటుంబానికి శ్రేయస్సు కలుగుతుందని నమ్మకం. దీపారాధన ద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరిగి, జ్ఞానం వెలుగుతుంది. ఆధ్యాత్మికమైన దీపారాధన, పితృ తర్పణం ద్వారా జీవితంలో సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం.

# నివురు కప్పిన నిప్పు హెచ్ఐవి - ఏయిడ్స్

1981, 05 జూన్‌న తొలిసారి అమెరికాలో ఐదు హెచ్ఐవి - ఏయిడ్స్ కేసులను గుర్తించడం, 1986లో చెన్నైలో తొలి హెచ్ఐవి - ఏయిడ్స్ కేసు భారత్‌లో బయట పడడంతో ప్రపంచ దృష్టి ప్రాణాంతక హెచ్ఐవి - ఏయిడ్స్ వ్యాధిపై పడింది. "హ్యూమన్ ఇమ్యూనో డెఫిసియెన్సీ వైరస్ (హెచ్ఐవి)" సోకడం వల్ల వచ్చే "అక్వైర్డ్ ఇమ్యూనో డెఫిసియన్సీ సిండ్రోమ్ (ఏఐడిఎస్-ఏయిడ్స్)" అనే ప్రమాదకర, ప్రాణాంతక వ్యాధి వస్తుంది. దీనినే "అర్జిత వ్యాధినిరోధకత లోపంతో బహువ్యాధి లక్షణం" లేదా ఏయిడ్స్‌గా అర్థం చేసుకోవాలి. నేడు ప్రపంచవ్యాప్తంగా 39.9 మిలియన్ల హెచ్ఐవి - ఏయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉండగా, 40 మిలియన్లకు పైగా మరణించారు. 2023లోనే 1.3 మిలియన్లకు హెచ్ఐవి సోకగా, 6.3 లక్షల మంది హెచ్ఐవి - ఏయిడ్స్ కారణాలతో మరణించారు. 2023లో హెచ్ఐవి సోకిన 86% మందికి తమ ఆరోగ్య పరిస్థితులు తెలుసు అని, 77% మంది "ఆంటీ-రెట్రోవైరల్ థెరపీ" తీసుకుంటున్నారని, 72% మంది వైరల్ లోడ్‌ను తగ్గించుకున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. 2030 నాటికి హెచ్ఐవి - ఏయిడ్స్ వ్యాధిని అంతం చేయడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూఎన్ఏఐడిఎస్ సంస్థలు కలిసి కృషి చేస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకర హెచ్ఐవి - ఏయిడ్స్ వ్యాధి పట్ల ప్రపంచ మానవాళికి అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 01 డిసెంబర్ రోజున "ప్రపంచ ఐయిడ్స్ దినం" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ ఏయిడ్స్ దినం-2024 థీమ్‌గా "టేక్ రైట్ పాత్ : మై హెల్త్, మై రైట్" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. హెచ్ఐవి - ఏయిడ్స్ వ్యాప్తికి కారణాలు, వ్యాధి లక్షణాలు: హెచ్ఐవి అనే వైరస్ సోకడానికి పలు కారణాలు ఉన్నాయి. అసురక్షిత లైంగిక సంబంధాలు పెట్టుకోవడం, స్టెరిలైజ్ చేయని సూది మందులు తీసుకోవడం, రక్త మార్పిడికి ముందు రక్త పరీక్షలు చేయకపోవడం, హెచ్ఐవి సోకిన తల్లి గర్భం దాల్చినా/ప్రసవించినా/రొమ్ము పాలు తాగినా శిశువుకు ఈ వైరస్ సోకుతుంది. లైంగిక సంబంధాలతో సోకడం వల్ల దీనిని "సెక్చువల్లీ ట్రాన్స్‌మిటెడ్ డిసీజ్(ఎస్‌టిడి)"గా కూడా వర్గీకరిస్తారు. వేశ్యలు, అపరిచితులతో అక్రమ లైంగిక సంబంధాలు ప్రమాదకరం. హెచ్ఐవి వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకడానికి రక్తం, సెమెన్, వజీనల్ ద్రవాలు, తల్లి రొమ్ము పాలు, నోరు, ఆనస్, పెన్నిస్, తెగిన చర్మం, రెక్టా ద్రవాలు వాహకాలుగా పని చేస్తాయి. భారత్‌లో అసురక్షిత లైంగిక సంబంధాల వల్ల 85.5%, తల్లి నుంచి శిశువుకు 5.9%, స్వలింగ సంపర్కం వల్ల 1.4%, రక్తమార్పిడి వల్ల 1.1%, అపరిశుభ్ర సూదుల వల్ల 1.3% మందికి వైరస్ సోకుతున్నది. హెచ్ఐవి - ఏయిడ్స్ సోకిన వ్యక్తుల్లో బరువు తగ్గడం, జ్వరం, రాత్రులు చెమట పట్టడం, అలసట, కడుపు నొప్పి, దగ్గు, ఆకలి నశించడం, డయేరియా, వాంతులు, నాలుక తెల్లవారడం, ఒళ్లు నొప్పులు, దురద, మింగడం ఇబ్బంది కావడంతో నొప్పి లాంటి పలు రోగ లక్షణాలు కనిపిస్తాయి. తొలి దశలో గుర్తించడం మంచిది:

హెచ్ఐవి సోకిన వ్యక్తుల రక్తంలో టి-కణాలు నశించడం వల్ల రోగనిరోధకశక్తి తగ్గడంతో రోగాలను తట్టుకునే శక్తి పడిపోతుంది. హెచ్ఐవి సోకిన వ్యక్తులు కొందరు సామాన్య జీవితాలను గడుపుతుంటారు. తొలి దశలో (2,3 మాసాల్లో) గుర్తించి సరైన చికిత్స తీసుకున్నట్లయితే ప్రాణాపాయం తగ్గి అధిక కాలం పాటు ఆరోగ్యంగా బతకవచ్చు లేదా మంచి ఉపశమనం పొందవచ్చు. హెచ్ఐవి సోకిన వారికి సరైన వైద్యం అందకపోయిన యెడల అది ముదిరి ఏయిడ్స్ వ్యాధిగా మారి, ప్రాణాంతకం అవుతుంది. హెచ్ఐవిని గుర్తించడానికి ఆంటిజెన్/ఆంటీ బాడీ పరీక్షలు, ఆంటీ బాడీ పరీక్షలు లేదా న్యూక్లిక్ ఆసిడ్ పరీక్షలు చేస్తారు. నేడు హెచ్ఐవి - ఏయిడ్స్‌కు పూర్తి చికిత్స లేకపోయినా, దాని తీవ్రతను పూర్తిగా తగ్గించడానికి చికిత్సలు ఉన్నాయి.

హెచ్ఐవి - ఏయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు:

హెచ్చఐవి సోకిన వ్యక్తితో ఆరోగ్యవంతులు అక్రమ లైంగిక సంబంధాలు పెట్టుకోవడం వల్ల ఈ వైరస్ సులభంగా వ్యాపిస్తుంది కాబట్టి ఇలాంటి సంబంధాలకు దూరంగా ఉంటూ లేదా కండోమ్స్ వాడితే వ్యాధి వ్యాప్తి కట్టడి చేయబడుతుంది.ల

శుభ్రం చేయని సిరంజ్‌లను వాడరాదు. డిస్పోజబుల్ సిరంజెస్ వాడడం ఉత్తమం. హెచ్ఐవి సోకిన మహిళలు గర్భం దాల్చడం ప్రమాదకరం కావచ్చు లేదా గర్భిణులు తగు వైద్యుల సూచనలతో ప్రసవించాలి. ఎలాంటి ఔషధాలు లేదా చికిత్సలు లేని హెచ్ఐవి - ఏయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి, ఆచరణాత్మకంగా జీవనశైలిని మార్చుకొనడం మాత్రమే మన చేతిలో ఉన్నది. "రోగానికి చికిత్స కన్న రోగం రాకుండా చూసుకోవడం మిన్న" అని గమనించి మన ఆరోగ్యాలను కాపాడుకుందాం, హెచ్ఐవి - ఏయిడ్స్ కానరాని ప్రపంచాన్ని ఏర్పరచుకుందాం. నిశ్శబ్దాన్ని వీడుదాం - హెచ్ఐవి-ఐయిడ్స్ గూర్చి చర్చిద్దాం.

# సెకితో సౌర విద్యుత్ ఒప్పందం నష్టదాయకం

అదాని గ్రూపుకు చెందిన రాజస్థాన్‌లోని ప్రాజెక్టుల నుండి ఏడాదికి 7000 మెగావాట్ల (17,000 మిలియన్ యూనిట్లకు మించకుండా) సౌర విద్యుత్ కొనుగోలుకు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీలు భారత సౌర విద్యుత్ సంస్థ (సెకి)తో చేసుకున్న 25 ఏళ్ళ ఒప్పందం (పవర్ సప్లై అగ్రిమెంట్ పిఎస్‌ఎ) అనేక విధాలుగా నష్టదాయకమైనది. మోడి ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో భాగంగా, మధ్య దళారిగా సెకి టెండర్లలో పేర్కొంటున్న షరతులు తమకు కావలసిన పెట్టుబడిదారీ సంస్థలకు ఎంపిక చేయడానికి వీలుగా తొత్తడం చేస్తున్నది. సౌర విద్యుత్ పరికరాలను తయారు చేసే సామర్థ్యం ఉన్న (ఉత్పత్తి చేయకపోయినా) సంస్థలే ఎంపికయ్యేలా టెండరు షరతులను రూపొందించింది. దీనితో, అలాంటి సామర్థ్యం లేని సంస్థలు టెండర్లు వేయడానికి వీలు లేకుండా పోయింది. నిజమైన పోటీకి తావు లేకుండా పోయింది. తొలుత పేర్కొన్న రేటును అదాని గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఈఎల్), అజూర్ పవర్ ఇండియా లిమిటెడ్ (ఎపిఐఎల్) యూనిట్‌కు రూ.2.93 నుంచి రూ.2.42కు తగ్గించాక, సెకి వాటిని ఎంపిక చేసింది. దీనికి తోడు మధ్య దళారిగా సెకికి యూనిట్‌కు ఏడు పైసలు చొప్పున కొనుగోలు సంస్థలు (ఎపి డిస్కాంలు) చెల్లించాలి. డిస్కాములే నిజమైన పోటీకి, అత్యధికంగా సంస్థలు పాల్గొనేందుకు వీలు కల్పించే షరతులతో నేరుగా టెండర్లు పిలిచి, అతి తక్కువ రేట్లను పేర్కొన్న సంస్థలను ఎంపిక చేస్తే పలు విధాలుగా ప్రయోజనకరంగా ఉండేది. సెకికి యూనిట్‌కు చెల్లించాల్సిన కమిషన్ 7 పైసలు చొప్పున భారీ మొత్తం ఆదా అయ్యేది. అంటే, ఏడాదికి రూ.119 కోట్ల చొప్పున 25 ఏళ్ళలో రూ.2975 కోట్ల మేరకు ఆదా అయ్యేది. సెకి పై రెండు సంస్థలను ఎంపిక చేసిన నాటికి పోటీ బిడ్డింగు ద్వారా తేలిన సౌర విద్యుత్ రేట్లు చాలా తక్కువగా ఉన్నాయి. యూనిట్‌కు రూ.1.99 వరకు ఆ రేట్లు తగ్గాయి. ఆ విధంగా చూస్తే, యూనిట్‌కు 50 పైసల చొప్పున (సెకి కమిషన్‌తో కలుపుకుని) 17000 మి.యూ కు ఏడాదికి రూ.850 కోట్ల చొప్పున 25 ఏళ్ళలో రూ.21,250 కోట్ల మేరకు డిస్కాంలకు కొనుగోలు వ్యయం తగ్గేది. పోటీ బిడ్డింగులో తేలిన తక్కువ చార్జీలను బట్టి ఈ మొత్తంలో కొంత మార్పు ఉండవచ్చు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎపిఈఆర్‌సి) వివరాలను వెల్లడించకుండా, బహిరంగా విచారణ జరపకుండా ఇచ్చిన ఆమోదంతో, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కాంలు సెకితో 2021 డిసెంబరు మొదటి తేదీన పిఎస్‌ఎ చేసుకున్నాయి. ఒకేసారి 7000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకోవటం అసాధారణం. సెకితో తాము చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) ప్రపంచంలోనే అతి పెద్దది అని అదాని కంపెనీ 2021 డిసెంబరు 14న ప్రకటించింది. 2025 సెప్టెంబరు, 2026 సెప్టెంబరుల నుండి 3000 మె.వా చొప్పున, 2027 సెప్టెబరు నుండి మరో 1000 మె.వా. చొప్పున ఈ సౌర విద్యుత్ కొనుగోలుకు ఎపి డిస్కాంలు, రాష్ట్ర ప్రభుత్వం సెకితో పిపిఎ చేసుకున్నాయి. ఆ మేరకు సరఫరా ప్రారంభమయ్యే నాటికి అంత సౌర విద్యుత్ రాష్ట్రానికి అవసరం లేదు. అనేక సంవత్సరాలుగా మిగులు విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాలని (ఉత్పత్తి తగ్గించాలని) థర్మల్ విద్యుత్ ప్లాంట్లను ఆదేశించటం, అలా ఉత్పత్తి చేయని విద్యుత్‌కు స్థిర చార్జీలను చెల్లించటం, మరోపక్క పీక్ కొరతను తీర్చటానికి మార్కెట్లో చాలా అధిక ధరలకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ళు చేస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. విద్యుత్ డిమాండు పెరుగుదల, విద్యుత్ లభ్యత, మిగులు, పీక్ సమయాలలో కొరత అంచనాల ప్రకారం చూస్తే వచ్చే మూడేళ్ళలో కూడా ఇలాంటి నష్టదాయక పరిస్థితి కొనసాగుతుందని స్పష్టం అవుతుంది. అంటే, అదాని సౌర విద్యుత్‌ను కొనేందుకు డిస్కాంలు ఏ మేరకు థర్మల్ విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాల్సి వస్తే ఆ మేరకు నివారించదగిన స్థిర చార్జీలను చెల్లించాల్సి వస్తుంది. అవన్నీ ఎఫ్‌పిపిసిఎ రూపంలో వినియోగదారులపై పడతాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని బ్యాక్ డౌన్ చేయాల్సిన మేరకు ఎపి జెన్‌కో, ఎపిపిడిసిఎల్ వంటి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఎన్‌టిపిసి వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలే సాంకేతికపరంగా, ఆర్థికంగా నష్టపోతాయి. ఏటేటా డిమాండు పెరుగుదల, విద్యుత్ లభ్యత, అదనంగా చేర్చాల్సిన విద్యుత్ సామర్థ్యాన్ని వాస్తవికంగా అంచనా వేసుకుని, హెచ్చుతగ్గులుండే డిమాండును తీర్చేందుకు సాంకేతికంగా సాధ్యమైన మేరకు విద్యుత్ మిశ్రమం (థర్మల్, జల విద్యుత్, పునరుత్పత్తి అయ్యే సౌర, పవన విద్యుత్ వంటి వాటి మిశ్రమం) సమ తూకంలో ఉండేటట్లు పిపిఎలు చేసుకోవాలి. దానివల్ల మిగులు విద్యుత్ సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్లు చూసేందుకు వీలవుతుంది. వినియోగదారులపై భారాలు కూడా ఆ మేరకు తగ్గుతాయి. ఒకేసారి 7000 మె.వా. సౌర విద్యుత్‌కు పిఎస్‌ఎ చేసుకోవటం వల్ల అదనపు భారాలు పెరుగుతాయి. ప్రతి సంవత్సరం సౌర విద్యుత్ ఏ మేరకు అవసరమౌతుందో వాస్తవిక అంచనాలు వేసుకుని, ఆ మేరకు లభ్యమయ్యే విధంగా పిపిఎలు చేసుకుని అనవసర భారాలను నివారించుకునే అవకాశాలను సెకితో చేసుకున్న ఒప్పందం వల్ల డిస్కాములు కోల్పోయాయి.




లింగాల మండలం నుంచి రైతు పండుగ భారీ బహిరంగ సభకు రైతు సోదరులతో కలిసి వెళుతున్న లింగాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగేశ్వర్ రావు , టౌన్ ప్రెసిడెంట్ పూజారి బుడ్డయ్య గారు,శ్రీశైలం,వెంకటయ్య,నాగయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్ గౌడ్, రవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు



కార్తీక పౌర్ణమి పూజలు- గూడెం ఈ రోజు అనగా 30/11/2024 శనివారం రోజున గూడెం గ్రామం, దండేపల్లి మండలం, మంచిర్యాల డిస్ట్రిక్ట్ లో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం లో ఆఖరి కార్తీక మాసం అయినందున ఈ రోజు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలూ మరియు పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ రోజు కార్తీక మాసం ఆఖరి రోజు అవడంతో భక్తులు బారులు తీరి,సత్యదేవుని ఆశీషులు అందుకున్నారు

## రాజ్యాంగ హక్కులను సాధించాలి మండల తహసిల్దార్ ఎం శ్రీనివాస్




రాయపర్తి నవంబర్ 30( వుదయం ప్రతినిధి): భారత రాజ్యాంగంలోని హక్కులను అవకాశాలను ప్రతి పౌరుడు హక్కుగా పొందాలని స్థానిక తహశీల్దార్ ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని మైలారం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన పౌర హక్కుల సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల తహసిల్దార్ ఎం శ్రీనివాస్ పాల్గొని అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ కులాలు షెడ్యూలు తెగలు అన్ని శాఖల అధికారులు వారి అభివృద్ధి గ్రామ అభివృద్ధికి గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న మా దృష్టికి వస్తే వెంటనే పరిష్కార మార్గం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి లు కొయ్యాడ చంద్రమోహన్, సంధ్య, పంచాయతీ కార్యదర్శి విజేందర్, ఎస్సీ జిల్లా ఉపాధ్యక్షులు గబ్బెట బాబు, ల ఉల్లెంగల యాదగిరి, చిర శ్రీధర్ బచ్చలి యాకయ్య, కారోబార్ ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తాహాసిల్దార్..



దమ్మపేట (వుదయం ప్రతినిధి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాదమ్మపేట మండలం అంకంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను దమ్మపేట మండల తహసిల్దార్ సిహెచ్.నరేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల ఆవరణను, క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని,ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భోజన మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అలానే వంటశాల,పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులు ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా తప్పనిసరిగా పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి శారదకు, పీఈటి నాగమణికి సూచించారు. ఈ పర్యటన ఆయన వెంట ఆర్ఐ.వీరాస్వామి ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రైతు పండగ సభకు తరలిన నాయకులు



నర్సాపూర్ నవంబర్ 30 (వుదయం ప్రతినిధి) నేడు నర్సాపూర్ నియోజకవర్గం నుండి మహబూబ్ నగర్ ''రైతు పండుగ''బహిరంగ సభకు తరలి వెళ్తున్న వాహనాన్ని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి రాజి రెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని, రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఒక్క ఏడాదిలోనే అన్నదాతల సంక్షేమానికి రూ.54,280 కోట్లు ఖర్చు చేసిన ప్రజా ప్రభుత్వం. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తూ, సన్న ధాన్యానికి క్వింటల్ కు 500 రూపాయలు బోనస్ అందజేయడంతో రైతుల మోములో వెలుగులు నిండాయని అన్నారు. అదేవిదంగా సంక్రాంతి నుండి రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు 7500 పెట్టుబడి సహాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని త్వరలోనే నెరవేరబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ అన్ని బ్లాక్,మండల పార్టీ అధ్యక్షులు,సీనియర్ నాయకులు,మాజీ, జడ్పీటిసి,మాజీ ఎంపీపీలు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, Nsui నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

# ఫుడ్ పాయిజన్ ఘటనలపై స్పందించని ప్రభుత్వం

## - విద్యార్థి సంఘాల నిరసన




పెద్దపల్లి మండల,,నవంబర్30(వుదయం ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైందని యూ.ఎస్.ఎఫ్.ఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రామగల్ల సురేష్ తెలిపారు.వారన్నారు, "తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు, ఆత్మహత్యలు విద్యార్థుల జీవనానికి ప్రమాదకరంగా మారాయి.

అయితే, ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఇవి ప్రత్యక్షంగా ప్రభుత్వ హత్యలుగా పరిగణించవచ్చు."మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం వల్ల నాసిరకమైన ఆహారం పాఠశాలలకు చేరుతుందని, ఇది విద్యార్థుల మరణాలకు కారణమవుతుందని తెలిపారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వ సంబంధం ఉండడం వల్ల విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బంద్ చేపట్టామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, సాగర్, అజయ్, రవి, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశలకు పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి

**జాబ్ చార్ట్ ప్రకారమే పనులు చేయించాలి.**

**బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు.**



నర్సంపేట ,నవంబర్30(వుదయం ప్రతినిధి): . ఆశ వర్కర్లకి గత సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న లెప్రసి సర్వే , పల్స్ పోలియో టిబి సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (బి ఆర్ టి యు అనుబంధ) సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా డి మ్ హెచ్ ఓ సాంబశివరావు కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోనె యువరాజు ఆశా వర్కర్ల అధ్యక్షురాలు కలువాల లలిత మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ఇవ్వకుండానే మళ్లీ సర్వే చేయాలని చెప్పడం సరికాదని సర్వే కు ఉపయోగించే రిజిస్టర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్ లో లేని పనులను ఆశ వర్కర్లచే వైద్యాధికారులు చేపిస్తున్నారని తక్షణమే వాటిని నిలిపివేయాలని సబ్ సెంటర్ డ్యూటీలు ఆశాల పరిధిలో లేకపోయినా ఒకవైపు డ్యూటీలు వేసి మరోవైపు సర్వేలు చేయాలని ఫీల్డ్ లో ఉండాలని చెప్పటం వల్ల మానసిక పని ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. సబ్ సెంటర్ డ్యూటీ లు తమ పరిధిలోకి రాదని తేల్చి చెప్పిన ఆశా వర్కర్లకు జీతాలు చేయడం లేదని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఇది ఇలానే మళ్లీ పునరావతమైతే డి ఎం హెచ్ ఓ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనిత, సంధ్య, మల్లీశ్వరి, శమ, సాలమ్మ, సునీత, మంజుల, రేఖా తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థుల భోజన పదార్థాలను పరిశీలించిన ఎంపీడీవో



కమలాపూర్ నవంబర్ 30 (వుదయం ప్రతినిధి) హన్మకొండ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు శనివారం కమలాపూర్ మండలం లోని మోడల్ స్కూల్ లోని మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేయబడినటువంటి ఆహార పదార్థాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె.బాబు పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా నాణ్యమైన ఆహారము పిల్లలకు అందించాలని సూచించడం జరిగింది తదనంతరము బాలికల వసతి గృహాన్ని పరిశీలించడం జరిగింది. హాస్టల్ కు సంబంధించిన విద్యార్థులకు మెనో ప్రకారము భోజనాన్ని అందజేస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు తప్పనిసరిగా మెనూ ప్రకారం పరిశుభ్రమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని సిబ్బందిని ఆదేశించడం జరిగింది. విద్యార్థులు నివసించే గదులు గాని, పరిసర ప్రాంతాలు గాని శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించడం జరిగింది. ఈ సందర్శనలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత గారు, బాలికల హాస్టల్ ఇన్చార్జ్ కేజీబీవీ ప్రిన్సిపల్ అర్చన కేర్ టేకర్ సుమలత ఏఎన్ఎం రజిత పాల్గొన్నారు

## యువ వికాసం పేరుతో దగా చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 30(వుదయం ప్రతినిధి) గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో యువ వికాసం పేరుతో విద్యార్ధులను దగా చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినాల్లోబాగంగా శనివారం ముత్తారం మండలంలో నిరసన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ వికాసం పేరుతో ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఇస్తామని, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఎటు పోయిందని ఆయన ప్రశ్నించారు. ఐదు లక్షల కాదు ఐదు రూపాయలు ఇవ్వకుండా కాంగ్రెస్ పాలకులు సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోప్రజలకు ఏం చేశారని విజయోత్సవాలు చేసుకుంటాండ్లో సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీల్లో మహిళలను, రైతులను, నిరుపేదలను మోసం చేసినట్లే విద్యార్దులను, యువతను దగా చేశారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. యువ వికాసంలో రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క ఇంటర్నేషనల్ స్కూల్‌కు శంఖుస్థాపన చేశారా అని ప్రశ్నించారు. మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా 420హామీలకు రూపకల్పన చేశామని గొప్పలు చెప్పుకునే మంథని ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ఏ ఒక్క పథకం అమలు చేయలేదని అన్నారు. పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందుకేనా విజయోత్సవ సంబరాలు నిర్వహించుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, రౌడీలుగా చిత్రీకరించడం అలవాటుగా మారిందని, అలాంటి కేసులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై కాంగ్రెస్ ప్రజావంచన దినాలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదలకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, ఇప్పటి వరకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయని ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నయవంచన ప్రభుత్వంపై పోరాటం చేసి మెడలు వంచాలని, లగచర్ల, నిర్మల్‌లో ప్రజలు తిరుగుబాటు చేయడం మూలంగానే ప్రభుత్వం తగ్గిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆరెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలో తూకాల మోసాలను అరికట్టాలి

**గుజ్జు దేవేందర్. అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి.**




కొత్తగూడ నవంబర్ 30(వుదయం ప్రతినిధి ):కొనుగోలు కేంద్రాలలో తూకాల మోసాలను అరికట్టాలని అఖిలభారత రైతుకూలీ సంఘం ఏఐకేఎంఎస్ కొత్తగూడ మండల కార్యవర్గం ఆధ్వర్యంలో మండలంలోని ముస్మీ, ఎదుల్లపల్లి, గోవిందాపురం, పొగుళ్లపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతినిధి బృందంగా సందర్శించారు.ఈ సందర్భంగా గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకాల పేరుతో, తేమ, మట్టి తాలు పేరుతో 40 కేజీలు కాకుండా అదనంగా 800 గ్రాములనుండి కిలోన్నర వరకు రైతుల వద్ద నుండి తీసుకోవడం సరైనది కాదని కాంట అయినా ధాన్యముకు మూడు రోజుల వ్యవధిలో డబ్బులు వేసే విధంగా చూడాలని దానితో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం ప్రకారంగా బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలి లారీలను బస్తాలను టార్పిన్ కవర్స్, విద్యుత్ సదుపాయం, మంచిని సౌకర్యం, లను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని వారు డిమాండ్ చేశారు. మిల్లు యాజమాన్యాలు కూడా నూక పేరుతో రైతుల వద్ద నుండి అదనంగా తీసుకునే విధానాన్ని అరికట్టాలని వారు అన్నారు.బస్తాలకు ముద్రలు వేసే బాధ్యతను రైతులు కాకుండా అన్ని కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బూర్కా వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి యుగంధర్, సహాయ కార్యదర్శి, గజ్జి సోమన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి శ్రీశైలం, భారత కార్మిక సంఘాల సమైక్య ఏరియా కమిటీ కార్యదర్శి పసునూరి.రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## వంట వండేటప్పుడు మెరుగైన జాగ్రత్తలు తీసుకోవాలి.!

## - రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వరరావు



హనుమకొండ, నవంబర్ 30(వుదయం జిల్లా ప్రతినిధి) : నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ విశ్వేశ్వరరావు హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలలోని పరిస్థితులను అధ్యయనం చేయుటకు వచ్చారు.

అధ్యయనంలో భాగంగా కలెక్టరేట్లో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను అధికారులను వసతి గృహాలలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.వసతి గృహాలలో పిల్లలకు శుభ్రంగాను, పదార్థాలను నిల్వ ఉండే పరిస్థితులను, తాగునీరు, వంట వండేటప్పుడు తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా మెరుగ్గా ఉండటానికి ఏ చర్యలు తీసుకోవాలని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంట మొత్తం చాలా వసతి గృహాలలో కట్టెల పొయ్యి మీదనే చేస్తున్నట్లు, ప్రత్యేకమైన వంటగదిని ఏర్పాటు చేయాలని, వంట గ్యాస్ సౌకర్యాన్ని కల్పించాలని అధికారులు సూచించారు. కలెక్టర్ వసతిగృహాలలోని పరిస్థితులను విద్యా కమిషన్ మెంబర్ కు సవివరంగా వివరించారు. హాస్టల్స్ లోని ఫుడ్ కమిటీలలో విద్యార్థులను కూడా మెంబర్గా నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రామిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మురళీధర్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీలత,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమ కళ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కస్తూరిబాలో ఆకస్మిక తనిఖీ.



ధర్మసాగర్ ,నవంబర్30(వుదయం ప్రతినిధి): ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామ శివారులోని కస్తూర్బా హాస్టల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పెట్టే ఆహార నాణ్యతను పరిశీలించారు. వంట గదిలలో ఏ విధంగా ఆహారాన్ని తయారు చేస్తున్నారు . పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. హాస్టల్ చుట్టూ ఉన్న చెట్లను అన్నింటిని తీపించాలని అది తీయకపోయినట్లయితే పాములు, తేళ్లు వస్తాయని అధికారులను ఆదేశించి, మెయిన్ రోడ్డు నుండి హాస్టల్ వరకు సిసి రోడ్డును మంజూరు చేశారు.ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం, భద్రత, విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, కస్తూర్బా హెచ్ఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని విద్యార్థి సంఘాల బంద్




నకిరేకల్ నవంబర్ 30 (ప్రుదయం ప్రతినిధి ): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్, సంక్షేమ హాస్టల్స్ ల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, నాసిరకం వంట సరుకులు వాడటం మూలంగా రాష్ట్ర వ్యాప్తంగా అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, విద్యాశాఖ కు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన ప్రభుత్వ పాఠశాలల బంద్ పిలులో భాగంగా పి డి స్ యూ, యస్ ఫ్ ఐ ఆధ్వర్యంలో నకిరేకల్ శనివారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా బాధ్యులు అంబటి చిరంజీవి, పి డి స్ యూ డివిజన్ కార్యదర్శి ముస్క రవీందర్ లు మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమం పై శ్రద్ధ లేదని అన్నారు. మధ్య దళారులకు కాంట్రాక్ట్ లు ఇవ్వడం మూలంగా నాసిరకం వంట సరుకులు సరఫరా చేస్తున్నారని, దీనితో విద్యార్థులకు ఫుడ్ ఫాయిజన్ అయ్యి అస్వస్థతకు గురవుతున్నారని అన్నారు. ప్రపంచ ఆరోగ్య, ఆకలి సూచిక ప్రకారం ప్రతి విద్యార్థికి 26 వందల క్యాలరీలు శక్తిని అందించే ఆహారం అందించాలని తెలిపినప్పటికి పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్నారని అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ను నిర్వీర్య పరిచే కుట్రలో భాగమే పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, మెనూ పాటించాలని, ప్రతినెల మెస్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు పిట్టల అనిల్, సతీష్, రమేష్ ఎస్ ఎఫ్ ఐ నాయకులు కత్తుల గోపిచంద్, రాజు, దొడ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

## – జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నాగర్ కర్నూల్ నవంబర్ 30(ప్రుదయం ప్రతినిధి) విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రావు పదవీ విరమణ సందర్భంగా శనివారం నాగర్ కర్నూల్ పట్టణంలోని వేలమ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ... జిల్లా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ అధికారిగా శ్రీధర్ రావు తనకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతో పనిచేశా రని, అధికారులు, డిఈలు,ఎఈలు సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారన్నారు. జిల్లాలో ప్రభుత్వం విధించిన విధి విధానాల ప్రకారం మిషన్ భగీరథ ద్వారా జిల్లాలో ఇంటింటికి సరఫరా చేసే తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు, పరిష్కరిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించరని కలెక్టర్ తెలిపారు. ఎప్పుడు పిలిచిన వెంటనే స్పందిస్తూ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ఇంటికి పంపిణీ చేసే త్రాగునీటి సరఫరాలో తలెత్తి సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారని, ఈఈ శ్రీధర్ రావు సేవలను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంసించారు.

అదనపు కలెక్టర్ కే సీతారామారావు మాట్లాడుతూ....ఉద్యోగ జీవితంలో 34 సంవత్సరాల నుండి అంకితభావంతో వివిధ హెూదాలలో పనిచేశారని, ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ కే సీతారామారావు, జిల్లా అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ జీవి రమేష్, జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్ రావు, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, జిల్లా క్రీడల అధికారి సీతారాం నాయక్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ లు ఈఈ శ్రీధర్ రావును ఘనంగా సన్మానించారు. వివిధ శాఖల అధికారులు, మిషన్ భగీర డిఈలు, ఎఈలు,సిబ్బంది, ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు యూనిఫామ్ అందించిన కార్పొరేటర్. బోగి సువర్ణ సురేష్



వరంగల్ వెస్ట్, నవంబర్ 30(ప్రుదయం విలేఖరి): 37వ డివిజన్ పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ సిబ్బందికి కార్పొరేషన్ నుండీ వచ్చిన యూనిఫామ్ ప్రతి ఒక్కరికి 2జతలను స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ చేతుల మీదుగా తూర్పు కోట కార్పొరేటర్ కార్యాలయం ముందు శనివారం రోజు సిబ్బందికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ అన్ని కాలాలకు తట్టుకొని మున్సిపల్ సిబ్బంది వారు విధి నిర్వహణలో ప్రజలకు సేవచేస్తున్నారని వారికి ప్రభుత్వం నుండీ మహిళలకు 2చేరలు, పురుషులకు 2జతల బట్టలు యూనిఫామ్ అందిస్తుందని. త్వరలో చలిని తట్టుకొని పని చేయుటకు స్వేటర్స్, వర్షాన్ని తట్టుకొనుటకు రెన్ కోర్టులు , గ్లౌస్లు, అయిలు, షూస్,పనిమట్లు అందిస్తారని. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పనులు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రవిరాజా,కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు బోయిని దూడయ్య, వీరన్న, సంగరాబోయిన చందర్,ఆరసం రాంబాబు,బంగారి శ్రీనివాస్,కేశవరాజు,ప్రతాప్, సుధాకర్, రాజమల్లు, శ్రీనివాస్, లతో పాటు జవాన్ల్ మైదం హరినాద్, రూపరాణి, దశరథ్, శ్యామ్ లతో పాటు 35మందీ సిబ్బంది పాల్గొన్నారు.

# కొనసాగుతున్న కులగణన ఆన్ లైన్ ప్రక్రియ

నడికూడ, నవంబర్ 30 (ప్రుదయం ప్రతినిధి): నడికూడ మండలంలోని అన్ని గ్రామాలలో పూర్తి అయిన కులగణన సర్వే వివరాలను ఆన్లైన్ చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సీఐఎస్ఎస్ కంప్యూట ర్ కేంద్రంలో సర్వే డాటా నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, ఇప్పటివరకు 32 శాతం పూర్తి అయిందని తెలిపారు. ఆన్ లైన్ ప్రక్రియను సీపీవో సత్యనారాయణరెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్ర మంలో ఎంపీవో చేతన్ కుమార్, ఎన్యుమ రేటర్స్, సూపర్వైజర్లు, ఎంపిఎస్వో, తదితరు లు పాల్గొన్నారు.

# దేశ భద్రత బీజేపీ తోనే సాధ్యం

**బిజెపి రాష్ట్ర నాయకుడు కూనూరు సంజయ్ దాస్**

**చిట్యాలలో విసతృ%శీ%గా బీజేపీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం**



నల్లగొండ నవంబర్ 30(ప్రుదయం ప్రతినిధి): బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమం ముగింపు దశలో భాగంగా చిట్యాలలో బిజెపి రాష్ట్ర నాయకుడు కూనూరు సంజయ్ దాస్ గౌడ్,నియోజకవర్గ లీగల్ సెల్ ఇంచార్జి గుండాల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా సభ్యత్వలను నమోదు చేపించిన్నారు.

. బిజెపి జిల్లా కార్యదర్శి బోడిగే అశోక్, సీనియర్ నాయకులు కన్నెబోయిన మహాలింగం యాదవ్ ముఖ్య అతిధిగా హాజరైనారు. దేశ భద్రత బిజెపితోనే సాధ్యం అన్నారు.. ప్రధాని మోడీ దేశాన్ని అభివృద్ధి పదంలో నడుపుతున్నారని నాయకులు అన్నారు. శనివారం 200 సభ్యత్వాలు చేసినారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి రాజు చారి, నారబోయిన నర్సింహా యాదవ్, బాస్పాజు రాము తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా




వరంగల్ వెస్ట్, నవంబర్ 30(ప్రుదయం విలేఖరి): వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ( ఈవీఎంల)ను భద్రపరిచిన గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఇంచార్జి ఆదనవు కలెక్టర్ విజయలక్ష్మి తో కలసి శనివారం తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాములను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితునికి ఆర్థిక సహాయం



ధర్మపురి నవంబర్ 30(ప్రుదయం విలేకరి): మండలంలోని నేరెళ్ళ గ్రామానికి చెందిన ఈధునూరి. వేణుగోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారి ఆర్థిక పరిస్థితిని గ్రామ నాయకులు కసారపు. బాలగౌడ్ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి నాణ్యమైన చికిత్స అందించాలని తెలిపారు. ఆర్థిక సహాయం కింద 10 వేల రూపాయలను మండల నాయకుల తరపున 10 వేల రూపాయలను మొత్తంగా 20 వేల రూపాయలను వేణుగోపాల్ కుటుంబానికి మండల నాయకులు సంఘనబట్ల దినేష్ , చిలుముల. లక్ష్మణ్,నాయకులు,కార్యకర్తలు ద్వార శనివారం రోజున ధర్మపురి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

# రక్తదాత ఫోటోగ్రాఫర్ సాయి కుటుంబానికి 26 వేల 500 వందల ఆర్థిక సాయం

**యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ పెరిక కుల సంఘం కొత్తూరు ఆధ్వర్యంలో.**



ఖానాపురం ,నవంబర్30(ప్రుదయం ప్రతినిధి): మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన నా మిత్రుడు రక్తదాత కంతం సాయి (ఫోటోగ్రాఫర్) ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మృతుని చిత్రపటానికి పూలమాలవేసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి మృతుని కుటుంబానికి బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ స్విమ్మర్ కన్నె రాజు పెరిక కుల సంఘం కొత్తూరు వారి ఆధ్వర్యంలో వాట్సప్ ద్వారా దాతల సహాయంతో సేకరించిన అమౌంట్ 26వేల 500 వందల రూపాయలను మృతుని కుటుంబానికి అందజేసినట్లు కానిస్టేబుల్ సిమ్మర్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం కొత్తూరు సభ్యులు తమ్మిశెట్టి జంపయ్య, కానుగంటి వెంకటేశ్వర్లు, గోపు హరి, గోపు రమేష్, కానుగంటి సురేష్, కానుగంటి రవి, తమ్మిశెట్టి సురేష్, నరెడ్ల రవి, తోట చిన్న బిక్షపతి, తోట శీను, తోట రాజు, తోట అనిల్, తోట శ్రావణ్, గోసుల సతీష్, నాలం రాజు, అరే సంపత్, సాయిరాం, మహేష్, శ్రీనివాస్, చిరంజీవి, ప్రసన్న కుమార్, వహీద్ అహ్మద్, రాకేష్,సుజాత, ఓంకారేశ్వరి, సుమలత, మాధవి, రామకృష్ణ, కామేశ్వర్, సందీప్, విశ్వనాథ, అనిల్ కుమార్, రాజ్ కుమార్, హరీష్ కుమార్, రమేష్,అశోక్, నవీన్ కుమార్, సంతోష్, వీరన్న, సత్యనారాయణ, రజనీకాంత్, రవీందర్, పోచగౌడ్, ప్రవీణ్, రహీం, నాగరాజు, జోసెఫ్, మల్లికార్జున్, వంశీధర్ రెడ్డి, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, గజ్జెల సుమన్, అలువల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ, అడ్వకేట్ యాద రవికుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి-ఏఐటీయూసీ, డిమాండ్




అశ్వరావుపేట (ప్రుదయం ప్రతినిధి): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లిఖార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మధ్యానం అశ్వారావుపేట సీపీఐ పార్టీ ఆఫీస్(సయ్యద్ మియాజానీ భవన్ ) లో జరిగిన పట్టణ ఏఐటీయూసీ ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ను కార్పొరేట్ బహుళ జాతి ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్తం చేయాలని చేస్తున్న ప్రయత్నాలను పోరాటాల ద్వారా తిప్పి కొడతామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ముప్పై లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలను కాపాడుకుంటూ మరిన్ని సంక్షేమ పథకాలను సాధించటానికి నిర్మాణ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ప్రైవేటీకరణ ప్రయత్నాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత 3 నెలలుగా సంక్షేమ బోర్డు పథకాలకు ధరకాస్తు చేయనీయకుండ మీసేవ పోర్టల్ ఆన్లైన్ బంద్ చేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది అని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భావన నిర్మాణ కార్మికులను ఏకం చేసేందుకు,కార్మికులను పోరాటాలకు సిద్ధం చేసేందుకు డిసెంబర్ 4,5 తేదీలలో చ్చంద్ర రాజేశ్వరరావు భావన పాల్వంచ నందు జరిగే భవన నిర్మాణ కార్మికుల రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ,ఏఐటీయూసీ నాయకులు జలాల్,దోమల అనిల్,అబ్బాస్,జక్కం బలరాం, ఎస్ కె రిజ్వానా,విజయ్ కాంత్ పాల్గొన్నారు...

# పీఎం సూర్య గార్ ముఫ్త్ బిజిలి త్రీ కిలో వాట్ సోలార్ ప్లాంట్ ప్రారంభం



సంగెం ,నవంబర్30(ప్రుదయం ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 17 డివిజన్ పరిధి గాడెపెల్లి గ్రామానికి చెందిన బత్తిని కుమారస్వామి అరుణ ఇంటి వద్ద శనివారం త్రీ కిలో వాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిషిక ఎనర్జీ సిస్టమ్స్ ఎండి వడ్లకొండ రమేష్, హెచ్ఆర్ జోత్స్నా, వరంగల్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్స్ బత్తిని ప్రశాంత్ గౌడ్, గుగులోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు

# షైన్ హైస్కూల్ విద్యార్థులు చారిత్రాక ప్రదేశాల సందర్శన

వరంగల్ వెస్ట్, నవంబర్ 30(ప్రుదయం విలేఖరి): షైన్ హైస్కూల్, శివనగర్ క్యాంపస్ విద్యార్థులు, షైన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ కుమార్, కరస్పాండెంట్ రామ ప్రోత్సాహంతో, ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయుల నేతృత్వంలో చారిత్రక ఫోర్ట్ వరంగల్ను సందర్శించారు. కీర్తి తోరణాలు, కోట నిర్మాణ కళ, కాకతీయ రాజవంశపు వైభవం గురించి ప్రత్యక్ష అవగాహన పొందిన విద్యార్థులు ఈ యాత్రను మధుర జ్ఞాపకంగా గుర్తించుకున్నారు. "వాస్తవ అనుభవాలతో పాఠ్యాంశాలను అనుసంధానించడంలో ఇలాంటి యాత్రలు కీలకం," అని ప్రిన్సిపాల్ మానస పేర్కొన్నారు.



# ఇంటిగ్రేటెడ్ తో డోర్నకల్ కు మహార్దశ

- దశాబ్దాలుగా భూమి లేదని ఈ ప్రాంతం నిర్వీర్యం
- పాలకుల సవితి ప్రేమ..? విద్యా వైద్యానికి దూరం
- స్థానిక నాయకుల దాహం..! ప్రజలకు శాపం!
- ప్రభుత్వ భూమి వెలికి తీసే నాయకుడే లేడాయే?
- తరుగుతున్న జనాభా.. కరుగుతున్న గొప్పతనం
- దేశ పుటలోకెక్కిన డోర్నకల్.. అభివృద్ధికి వెంపర్లు







మహబూబాబాద్ జిల్లా డోర్నకల్/( వుదయం ప్రతినిధి) డోర్నకల్: గతం గణం.. ప్రస్తుతం శూన్యం అన్న చందంగా డోర్నకల్ పరిస్థితి తయారైంది. ఈ ప్రాంతాన్ని పాలించిన పాలకుల సవతి ప్రేమకు? నిర్వీర్యంగా మారింది. ఇందుకు కారణం ప్రభుత్వ భూమి లేదని చెప్పడం. ఈ సాకుతో ప్రజా అవసరాలకు అనుగుణంగా వచ్చిన ప్రతిదీ పక్క మండలాలకు తరలించారు. నియోజకవర్గ కేంద్రంలో ఉండవలసిన సౌలతలు ఏ ఒక్కటి ఇక్కడ కనబడవు. విద్య,వైద్యం అందని ద్రాక్షగానే మిగిలాయి. సరైన పాఠశాలలు,కళాశాలలు లేకపోవడం దూర ప్రాంతాల్లో ఖరీదైన చదువును చదువుకునే సోమత లేక మధ్యలోనే ఆపేస్తున్నారు. ఉపాధి దొరకక హైదరాబాదు లాంటి మహా నగరాలకు వలస వెళుతున్నారు. అలాగే వైద్య సేవలు మరింత దారుణం. ఈ మధ్య కాలంలో కదిలినా మెదిలినా గుండెపోటులు, వివిధ జబ్బులు సంభవిస్తున్నాయి. స్థానికంగా పెద్ద ఆస్పత్రులు లేకపోవడం రాత్రివేళ అస్వస్థకు గురైతే బాధితుల బాధలు వర్ణనాతీతం. పెద్ద ఆస్పత్రికి వెళ్లే లోపు ప్రాణాలు విడిచిన సందర్భాలు ఉన్నాయి. విద్య,వైద్య పరంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజల ప్రధాన డిమాండ్.

స్థానిక నాయకుల అలసత్వం.. ప్రజలకు శాపం!

కొన్ని ఏండ్లుగా ప్రజల చేత ఎన్నుకోబడుతున్న స్థానిక నాయకుల అలసత్వం.. ఇక్కడి ప్రజలకు శాపంగా మారిందనే ఆపవాదు ఉంది. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన పాలకులను స్థానిక లీడర్లు ఒప్పించి,మెప్పించి అభివృద్ధి వరచడంలో విఫలమయ్యారు.

విద్యాలయాలు రాత్రికి రాత్రే తరలిన మౌనం దాల్చారని ఆరోపణలు ఉన్నాయి. డోర్నకల్ కు వాస్తు లేదని చెప్పడం తప్పు.. అభివృద్ధి చెయ్యకపోవడం గమనార్హం.

ప్రభుత్వ భూమి అభివృద్ధికి ఆటంకం!

తాతల కాలం నుంచి ఒకే మాట ప్రభుత్వ భూమి లేదనడం. అధికారులు ఎవరొచ్చినా డోర్నకల్ ఏరియాలో పుడమి లేదని,ఉన్న సమస్యల్లో ఉన్నట్లు ప్రజాప్రతినిధులకు చెబుతారు. దీంతో పాలకులు చేసేదేమీ లేదని చేతులెత్తేస్తున్నారు. అభివృద్ధి పక్కకు వెళ్ళిపోతుంది. ఈ తంతు ఏండ్ల తరబడి జరుగుతూనే ఉంది. అసలు స్థానిక నాయకులు ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలని ఆకాంక్షిస్తే ఏ ప్రాంతంలో ఏ సర్వేలో ప్రభుత్వ భూమి లభ్యతను విశ్లేషించి ఉన్నట్లయితే వెలికి తీసే ప్రయత్నం చేయాలి. ఎకరాల కొద్ది భూమి రికార్డులో ఉన్నట్లు మాట్లాడుకుంటున్నారు.

దేశ పుటలోకెక్కిన డోర్నకల్.. అభివృద్ధికి వెంపర్లు

బండ్లు ఓడలు.. ఓడలు బండ్లయిన చందంగా మారింది. డోర్నకల్ క్రీడలకు,వ్యాయామశాలలకు పేరుగాంచింది. ఎంతో మంది ప్రభుత్వ బడుల్లో, రైల్వే పాఠశాలలో విద్యనభ్యసించి గొప్ప స్థాయిలో ఉన్నారు. క్రీడల్లో రాణించి కొలువులు సాధించిన వారు అనేకం. రైల్వే పరంగా,చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా దేశంలో గుర్తింపు పొందాయి. నాడు రైల్వే ఉద్యోగులతో కళకళలాడిన ఈ ప్రాంతం నేడు వెలవెలబోతుంది. అటు బిషప్ పాఠశాల, కళాశాలలు,వసతి గృహాల్లో వేలాది మంది పిల్లలతో ఆహ్లాదకరంగా ఉండేది. అలాంటి ఈ ప్రాంతం క్రమేపి కనుమరుగవుతూ వస్తుంది. నాటి నుంచి కొందరు పాలకుల నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమనే అపవాదు బలంగా వినిపిస్తోంది. ఇప్పటికైనా అభివృద్ధిని పట్టాలెక్కించాలని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతో మహర్దశ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు చూపుతో నెలకొల్పుతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు భావితరాలకు నాణ్యమైన విద్యాబాండగారలుగా మారలున్నాయి. డోర్నకల్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి ఉమ్మడి కురవి మండలంలో స్థల పరిశీలన,శంకుస్థాపనకు వడివడిగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఏకలవ్య,గురుకుల, ఆశ్రమ పాఠశాల,కళాశాలలు ఉన్నాయి. ఇన్నాళ్లు సరైన విద్యా,వైద్యానికి నోచుకోని డోర్నకల్ ప్రజలకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నెలకొల్పి ఆకాంక్షలు నెరవేర్చాలని కోరుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు స్థల పరిశీలన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డోర్నకల్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నెలకోల్పుటకు అనుమతులు ఇచ్చారు. దాదాపు 30 ఎకరాలు భూమి అవసరం పడుతుంది. డోర్నకల్ మండల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుటకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని తొలి ప్రాధాన్యతగా రెవిన్యూ అధికారిని వాకబ్ చేశాను. అవసరమైన ప్రభుత్వ భూమి లేదన్నారం. త్వరితగతిన శంకుస్థాపన చేయవలసి ఉంది కనుక స్థలపరిశీల జరుగుతుంది. జిల్లా కలెక్టర్ పర్వేక్షిస్తున్నారు. డోర్నకల్ లో ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే ఏర్పాటుకు కృషి చేస్తాను.

– ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే రామచంద్రనాయక్

డోర్నకల్ లో ప్రభుత్వ భూమి లేదు

ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటుకు ఒకే చోట దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండాలి. డోర్నకల్ మండల వ్యాప్తంగా ఒకే చోట పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేదు. కన్నెగుండ్ల గ్రామంలో శివారు ప్రాంతంలో కొంత వరకు ప్రభుత్వ స్థలం ఉన్నట్టు తెలిసింది.

## జీఎంపీఎస్ మండల కమిటీ ఎన్నిక



పెద్దవంగర, నవంబర్ 30 (వుదయం ప్రతినిధి):జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొమ్మనబోయిన యాకయ్య ఆధ్వర్యంలో గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం గౌరవ అధ్యక్షులుగా రాసాల సమ్మయ్య యాదవ్, అధ్యక్షులుగా కేశబోయిన మల్లయ్య యాదవ్, ఉపాధ్యక్షులు గా కందుల శ్రీశైలం యాదవ్ , పాక అనీల్ కుమార్ యాదవ్, ప్రధానకార్యదర్శి గా కందుల బుచ్చన్న యాదవ్, కోశాధికారి గా కుమ్మరి రామ్మూర్తి యాదవ్,ముఖ్యసలహాదారులు కసరబోయిన కుమారస్వామి, కూకట్ల వీరన్న,ఎరసాని రామ్మూర్తి, ఆవుల మహేష్, భారీ విక్రమ్,సలహాదారులు నిమ్మల వీరన్న, ఊడుగుల రమేష్,పల్లె కొమురయ్య, ఉడుత వెంకన్న, నక్కలబోయిన రవి ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు మాట్లాడుతూ.. తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.

## ఎండపల్లి మండల నూతన ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గా చెన్న కుమారస్వామి



ఎండపల్లి, నవంబర్ 30(వుదయం విలేఖరి):ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు దుమాల గంగారం, ఎన్నికల ఇన్చార్జి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకెనపెల్లి సతీష్ ల ఆధ్వర్యంలో శనివారం నూతన ఎండపల్లి మండల ఎంఆర్పిఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీకి మండల అధ్యక్షులు గా చెన్న కుమారస్వామి ఉపాధ్యక్షులు గా మామిడిపల్లి సంతోష్,గౌరవ అధ్యక్షులుగా చొప్పదండి బుచ్చి లింగయ్య, ముఖ్య సలహా దారుగా మంతెన లక్ష్మణ్ ,అధికార ప్రతినిధులుగా ఆరెల్లి మహేష్ ఉప్పులేటి మారుతి, ప్రధాన కార్యదర్శి గా వడ్కా పురం అశోక్, కార్యదర్శులుగా కనుకుట్ల రఘు వర్ధన్ ఎనగందుల సంతోష్ మంతెన సురేష్ సంయుక్త కార్యదర్శిగా బోయిని పవన్ కళ్యాణ్ కార్యవర్గ సభ్యులుగా దూడ వంశీ చెన్న ప్రేమ్ సాగర్ లను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని నూతన అధ్యక్షులు చెన్న కుమార స్వామి తెలిపారు.

## అక్రమ వ్యర్తల డంపింగ్ పై చర్యలు చేపడతాం...

: మేయర్ నీలాగోపాల్ రెడ్డి



కుత్బుల్లాపూర్, నవంబర్ 30,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని, కమిషనర్ సాబేర్ అలిని మర్యాద పూర్వకంగా కలిసిన బాచుపల్లి హిల్ కౌంటీ విల్లా ఓనర్స్ మ్యూచువలి ఎయిడెడ్ కో ఆపరేటెడ్ సొసైటీ సభ్యులు డంపింగ్ యార్డ్ అక్రమ వ్యర్థాల నిలువ చర్యలను అరికట్టగలరని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్, కమీషనర్ సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారానికి గల తగు చర్యలు త్వరలోనే చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందజేత

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హైదరాబాద్,నవంబర్30(వుదయం ప్రతినిధి): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల–వరంగల్–ఖమ్మం–విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల కోల్పోయిన వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూములలో చెట్లు, బోర్లు, పైప్‌లు ఉన్నట్లయితే సంబంధిత ఫొటోలు తీసుకొని ప్రక్క భూమి రైతు వద్ద సంతకం తీసుకొని తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, నిర్ధేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా త్వరగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

## ఆర్ కే పి లో ఘనంగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ జన్మదిన వేడుకలు





రామకృష్ణాపూర్ /నవంబర్ 30 (వుదయం ప్రతినిధి)చెన్నూర్ ఎంఎల్ఏ డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామి 67వ జన్మదినం సందర్భంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,పలు కుల వృత్తి దారుల సంఘాల గౌరవ అధ్యక్షులు గాండ్ల సమ్మయ్య,మందమర్రి మండల మాజీ ఎంపిపి మహంకాళి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్ చేసి,మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం సుమారు 50 పేద మహిళలకి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

. బడుగు బలహీనర్గాల ఆశా జ్యోతి,పేదల పెన్నిధి అయినా చెన్నూర్ ఎంఎల్ఏ డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి భవిష్యత్తులో ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో ఘనంగా జరుపుకోవాలని కోరుకుంటూన్నామన్నారు. పుట్టినరోజు వేడుకలకు హాజరైన కుల వృత్తి దారుల సంఘాల నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నిర్మూలనే మన లక్ష్యం

**2027 సంవత్సరం వరకల్లా కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చాలి**

**జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి**

**డాక్టర్ కె.వి స్వరాజ్యలక్ష్మి**




నాగర్ కర్నూల్ నవంబర్ 30(వుదయం ప్రతినిధి)కుష్టు వ్యాధి నిర్మూలనలో వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ కే.వి స్వరాజ్యలక్ష్మి సిబ్బందికి సూచించారు శనివారం నాడు జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూఈనెల 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే ఉద్యమంగా సర్వే చేయాలని తెలియజేశారు. దీనికోసం ఇప్పటికే కార్యాచరణ సూక్ష్మ ప్రణాళికలను సిద్ధం చేశామని ,900 బృందాలను సిద్ధం చేశామని తెలియజేశారు. కావున ప్రజలు కూడా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కుష్టు వ్యాధిని ఆరంభంలోనే గుర్తించి కేవలం 6 నుంచి 12 నెలల వరకు సంపూర్ణ చికిత్స తీసుకుంటే సులభంగా తగ్గిపోతుంది. ఈ చికిత్స అన్ని ప్రభుత్వఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో వున్నాయి మరియు ఉచితంగా లభిస్తాయి. కావున ప్రజలు తమ శరీరంపై స్పర్శ లేని తెలుపు లేదా రాగి రంగులో మచ్చలు కనిపిస్తే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం, వెంకట దాస్, డాక్టర్ తారా సింగ్, డాక్టర్ భీమా నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవికుమార్,డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణ మనోహర్ , డాక్టర్ ప్రదీప్, డి పి ఎం ఓ,సుకుమార్ రెడ్డి, మధుమోహన్ ల

, వెంకటయ్య వైద్యాధికారులు మరియు లిప్రెసి నోడల్ పర్సన్స్, పర్యవేక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అభ్యాస్ విద్యాలయంలో మాదిరి ఎన్నికల ప్రక్రియ

### పాల్గొన్న విద్యార్థిని,విద్యార్థులు



మేళ్లచెరువు/ హుజూర్నగర్ నవంబర్ 30 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో అబ్యాన్ విద్యాలయంలోవిద్యార్ధులు శనివారం మాదిరి ఎన్నికల నమూనా ప్రక్రియను సందడిగా జరుపుకున్నారు. ఎన్నికల అవగాహన కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తరగతి గదులను పోలింగ్ కేంద్రాలుగా చేశారు. వాటిలో బ్యాలెట్ బాక్స్ లు ఏర్పాటు చేశారు. పోలింగ్ అధికారులుగా కొందరు విద్యార్థులు భాద్యతలు నిర్వహించారు. మరికొంత విద్యార్థులు ఓటర్లుగా ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ,ఫలితాల ప్రకటన, అభ్యర్థుల ప్రమాణ స్వీకారం తదితర అంశాలన్నింటిని గుర్తు చేసుకొని విద్యార్థులు పాఠశాలలో ఎన్నికల సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యాస్ విద్యాలయం చైర్మన్ ముడెం శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాలలో భాగంగా శివాలయంలో ప్రత్యేక పూజలు

మేళ్లచెరువు/ హుజూర్నగర్నవంబర్ 30 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ ఇష్టకామేశ్వరి సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం నందుతేది:01-12-2024 నుండి 09-12-2024 వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము నిర్వహించ తలపెట్టిన “ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలు”లో భాగముగా శ్రీయుత కమీషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ వారి ఉత్తర్వుల మేరకు గ్రామం,

రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని రేపు ఉదయం 9:30 గంటలకు మన శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో అభిషేక పూజలు నిర్వహించుటకు నిర్ణయించడమైనది. .

## బెల్ట్ షాపులను తొలగిస్తాం

### శాయంపేట ఎస్సై



శాయంపేట,30 (వుదయం ప్రతినిధి) శాయంపేటమండలంలోని పత్తిపాక గ్రామంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రభావతి ఆధ్వర్యంలో హరిజనవాడలో ప్రతి నెల చివరి వారంలో జరిగే పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలు తెలుసుకొని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడంలో పౌరహక్కుల సదస్సు ముఖ్య ఉద్దేశమని ప్రభావతి అన్నారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేదని, వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా బెల్ట్ షాపులు, గుడుంబా వల్ల యువత బానిసలుగా మారి తమ కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని యువత సభ దృష్టి తీసుకురాగా ఎస్ఐ ప్రమోద్ కుమార్ బెల్ట్ షాపులను మూసి వేయిస్తామని, గుడుంబాను నిర్మూలిస్తామని స్పష్టం చేశారు.

డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్ల సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని ఎంపీడీవో ఫణీంద్ర తెలిపారు. అనంతరం అంబేద్కర్ సామాజిక సేవా సమితి అధ్యక్షులు గజ్జి సదయ్య ఎంపీడీవోను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బిక్షపతి, ఆర్ఐ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామగిరి మండలం లడ్నాపూర్ లో పౌర హక్కుల దినోత్సవం

మంథని, ,నవంబర్30(వుదయం ప్రతినిధి): రామగిరి మండలం లడ్నాపూర్ గ్రామపంచాయతీలో కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ యొక్క వినతులు విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సంఘం జిల్లా నాయకులు బూడిద సమ్మయ్య మాట్లాడుతూ వివక్ష, అంటరానితరం రూపుమాపాలంటే ముఖ్యంగా ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరడం జరిగింది.

# డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు



మెదక్, ( 2024 నవంబర్ 30 వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని శనివారం అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు సంబంధిత వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, మండల, గ్రామ ప్రత్యేక అధికారులతో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల నిర్వహణ కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహించే ప్రజాపాలన ,ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అన్ని మండల కార్యాలయాల్లో ప్రభుత్వ లోగో ఏర్పాటు చేసుకోవాలని, అన్ని కార్యాలయాలు పరిశుభ్రత పాటించాలని, విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ఆయా శాఖల వారీగా విజయ గాధలను ఇవ్వాలని సూచించారు. డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో గ్రామ స్థాయిలో, 10 నుంచి 11వ తేదీల మండల స్థాయిలో, 16-21 వరకు జిల్లా స్థాయిలో సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించాలని, ఆ తదుపరి నెగ్గిన ఆటగాళ్లను రాష్ట్ర స్థాయికి పంపించాలని, ఈ మేరకు పాఠశాలల పీఈటీల సహకారంతో ఈ పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా విద్యాధికారి రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా కిసాన్ మేళ

బెల్లంపల్లి, నవంబరు30 (వుదయం ప్రతినిధి)ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్ మరియు వ్యవసాయ సాంకేతిక అను ప్రయోగ పరిశోధన సంస్థ (అటారి) (జోన్-10) ఆధ్వర్యంలో ఘనంగా కిసాన్ మేలని నిర్వహించడం జరిగింది అని డా. శివకృష్ణ కోట, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కృష్ణ విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్తమ పద్ధతుల ద్వారా మంచిర్యాల మరియు కొమురం భీమ అసిఫాబాద్ జిల్లాలలో ముఖ్యంగా పత్తి ఉత్పాదికతను పెంచే అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు పైన మరియు ఆధునిక వ్యవసాయ సాంకేతికపైన రైతు స్థాయిలో అవగాహన పెంచాలని లక్ష్యంతో కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించమని తెలియజేశారు. తక్కువ సమయంలో కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి సాధించిన ప్రగతిని నివేదిస్తూ మరింత ప్రణాళికతో రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేలా ముందుకు సాగుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి డా. షేక్ ఎన్. మీరా, డైరెక్టర్ ఐ.సి.ఆర్.-అతారి, జోన్ -10, హైదరాబాద్ ముందుగా కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి నూతన భవనాన్ని సందర్శించి నూతన మట్టి పరీక్ష కేంద్రాన్ని, విజ్ఞాన కేంద్రాన్ని , నర్సరీ షేడ్ నెట్ మరియు వర్మీ కంపోస్ట్ యూనిట్ లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్ని స్టాల్స్ ను సందర్శించి వారికి తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడుతూ అధిక సాంద్రతలో పత్తి యాజమాన్యం ఉపయోగకరమని అంతేకాకుండా రైతులు డిజిటల్ విప్లవం వైపుగా నడవాలని, ప్రకృతి వ్యవసాయాన్ని పాటించే రైతులు ఎఫ్. పి.సి. లుగా ఏర్పడాలని, రైతులు కొత్త పంటలైనటువంటి అవకాడో వంటి పంటలను ప్రారంభించాలని, రైతులను కెవికె సైనికులుగా భావించాలని వారికి కొత్త సాగు విధానాలపై శిక్షణ కార్యక్రమాలు అందించే విధంగా కృషి చేస్తామని వివరించారు.

డా.జి. వీరన్న, పత్తి ప్రధాన శాస్త్రవేత్త, ఆర్.ఎ.ఆర్.ఎస్., వరంగల్ మాట్లాడుతూ అధిక సాంద్రతలో ప్రతి యాజమాన్యం పద్ధతులను తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.

ఈ కార్యక్రమానికి విశిష్టత అతిధి గా విచ్చేసిన డా. కే .మధుబాబు, ప్రొఫెసర్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్, ఈఈఐ, హైదరాబాద్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించాలని ప్రోత్సహించారు.

డా. సునీల్ మహాజన్, ప్రధాన శాస్త్రవేత్త, ఐ.సి.ఎ.ఆర్-సి.ఐ.సి.ఆర్, నాగపూర్ మాట్లాడుతూ అధిక సాంద్రతలో పత్తి సాగు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పూర్తిగా వివరించారు. శ్రీధర్ సిద్ది, శాస్త్రవేత్త మరియు అధిపతి ఎ.ఆర్.ఎస్ కునారం మాట్లాడుతూ ముఖ్య అంశం యాసంగిలో సాగు చేసే వరి రకాలు మరియు వరి పంట యాజమాన్యం మరియు చీడపీడల యాజమాన్యం గురించి వివరించారు.డాక్టర్ ఏ వెంకట్రా%శీ%,ఉద్యాన శాస్త్రవేత్త బి.జే.ఆర్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల మిరప మరియు మామిడిలో పూత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు చీడ పీడల నివారణ గురించి మాట్లాడారు.శ్రీమతి.జి. కల్పన, డి.ఎ.వో, మంచిర్యాల జిల్లా, మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న పత్తి మరియు వరి విస్తీర్ణం గురించి మరియు యాసంగిలో సాగుచేసే విస్తీర్ణం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ స్థాయి సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి శ్రీ. ప్రేమ్ కుమార్, మీడియా ప్రతినిధులు, వివిధ ప్రైవేట్ కంపెనీల ( రాసి, మాహికో, అంకూర్, వేద, నూజివీడు విత్తన కంపెనీలు, ఇఫోకో, జెన్ అగ్రిటెక్, జై కిసాన్ సోలార్ కంపనీల మరియు ఆర్గానిక్, మిల్లెట్ బిస్కెట్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, రావెప్ విద్యార్థుల వ్యవసాయ సాంకేతిక నమూనాలు స్టాల్) ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమం అనంతరం ఉత్తమ రైతులకు కండువా కప్పి సత్కారం నిర్వహించారు. శ్రీ. గోనే శ్యాంసుందర్ గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అన్ని పంటలు పండించే విధంగా రైతులు ముందుకు రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుండి ఉభయ జిల్లాల నుండి దాదాపుగా 620 మంది రైతులు పాల్గొన్నారు.

# రైతు పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసి చైర్మన్



నిజాంసాగర్, నవంబర్ 30 (వుదయం ప్రతినిధి): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో శనివారం జరిగిన రైతు పండుగ కార్యక్రమానికి పిట్లం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మహమ్మద్ నగర్ మండల అగ్రికల్చర్ ఆఫీసర్లు నవ్య, రేణుక,మధు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి గారు,మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్, డిసిసి డెలిగేట్ నాగభూషణం గౌడ్,సొసైటి వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు,జిల్లా %ూ% సెల్ ఉపాధ్యక్షులు లోక్య నాయక్,%ూ% సెల్ అధ్యక్షులు సవాయి సింగ్,%ూవీజ% డైరెక్టర్ కృష్ణ, సీనియర్ నాయకుడు గుర్రపు శ్రీనివాస్ తోట రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

# రైతు పండుగ కార్యక్రమలను ప్రత్యక్షంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకిస్తున్న రైతులు నాయకులు.

## మండల వ్యవసాయ శాఖ అధికారి భోగ శ్రీనివాస్.





ఖానాపురం నవంబర్ 30 వుదయం ప్రతినిధి.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులు అమిస్తాపూర్, మహబూబ్నగర్ జిల్లాలో నిర్వహిస్తున్న రైతు పండుగ ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమలను మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ప్రత్యక్ష%శీ%గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల రైతులు ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖ మంత్రి నిర్వహిస్తున్న రైతు పండుగ కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్షంగా మండల రైతులు నాయకులు తిలకించినట్లు వ్యవసాయ శాఖ అధికారి భోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్ రఘుపతి, మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వేములపల్లి వెంకటప్రసాదరావు, మాజీ సర్పంచ్ పరుచూరి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ బలుగూరి విజాకర్ రావు, మాజీ వార్డ్ సభ్యుడు కందుల సాంబయ్య, నాయకులు శాఖమూరి ముకేశ్ చౌదరి, దేవినేని వేణుగోపాల్ రావు, గండ్రాతి శ్రీనివాస్, ఎలగందుల దేవేందర్, ఏఈవోలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతుల పండుగ

## సీఎం రేవంత్,మంత్రి కోమటిరెడ్డి,ఎమ్మెల్యే వేముల చిత్రపటాలకు పాలాభిషేకం



చిట్యాల నవంబర్ 30(వుదయం ప్రతినిధి)బీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా విజయోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నకరికల్లు శాసనసభ్యులు వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన రైతులు. అనంతరము వెలిమినేడు పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘునారెడ్డి ఆధ్వర్యంలో రైతుల పండుగ ఘనంగా నిర్వహించడం జరిగింది తదనంతరం మాట్లాడుతూ ఎలిమినేడు పిఎసిఎస్ సంఘ సభ్యులైన అర్హులైన రైతులకు సుమారు రెండు కోట్ల రూపాయల రైతు రుణమాఫీ చేయడం జరిగిందని మిగిలిన రుణమాఫీ కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు సన్నాలకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని నష్టపోయిన పంటకు బీమా ద్వారా రైతుల ఖాతాలను 30 రోజుల్లో బీమా డబ్బులు బదిలీ చేయడం అలాగే ధాన్యం కొనుగోలు విషయంలో ఆటంకాలు లేకుండా స్థానిక శాసనసభ్యులు వీరేశం సహకారంతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ కొనుగోలు దిగుమతి రైతుల ఖాతాలో నగదు జమ కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొంతల అంజి రెడ్డి డైరెక్టర్లు మామిడి శ్రీరాములు,బోయపల్లి స్వామి,టేకుల కవిత అంజిరెడ్డి, నాయకులు మేడి స్వామి,మాజీ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ, సామిడి మోహన్ రెడ్డి,చీమల వీరేశం,అంతటి నరసింహ,మారగోని యాదయ్య,జనగాం సత్యనారాయణ,దేశబోయిన మల్లేష్,కాటం సుత్తయ్య,చింతకింది వెంకటేష్,కర్నూరి మల్లారెడ్డి, మేడగోని యాదయ్య,నుర?ంటి నర్సిరెడ్డి,అంశాల శ్రవణ్ కుమార్,దేవి రెడ్డి లింగారెడ్డి, సుర్కంటి శంకర్ రెడ్డి,చిరగొని శ్రీశైలం,బొంతల రాజిరెడ్డి,మేడ గోని దుర్గయ్య, ఉయ్యాల శీను,మేడి అర్జున్, బైకాని స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఖానాపూర్,నవంబర్ 30(వుదయం విలేకరి) ఖానాపూర్ నియోజకవర్గం,జన్నారం మండలం, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే బోజ్జు అన్నారు.శనివారం మధ్యాహ్నం జన్నారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పలు చెక్కులను అందజేశారు.ప్రజల సంక్షేమం కోసమే పథకాల అమలు చేస్తున్నామని, వాటిని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ముధోల్ లో ఘనంగా రైతు పండుగ





ముధోల్, నవంబర్ 30 ,(వుదయం ప్రతినిధి) ముధోల్ లో రైతు పండుగను కాంగ్రెస్ పార్టీ ముధోల్ మండల అధ్యక్షులు రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల గంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాది పాలనలో వ్యవసాయ రంగానికి అధిక మొత్తం నిధులు కేటాయించిందని తెలిపారు. రైతులకు ఓకే సారీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేసిందని అన్నారు. అలాగే సన్నదాన్యానికి గతం లో ఏ ప్రభుత్వం ఇవ్వని క్వింటాకు రూ. 500 బోనస్ కూడా ఇస్తుందని తెలిపారు. ఇంకా రైతు భరోసా వచ్చే జనవరి రెండవ వారం నుంచి ఇస్తుందని అన్నారు. ఇంకా రైతు భీమా, జీఎస్టీ లేని వ్యవసాయం, ఎరువులు, విత్తనాలు అందిస్తుందని తెలిపారు. రైతులు పంటల వ్యర్థాలు కాల్చకుండా తిరిగి ఎరువుగా మల్చుకొని పంట దిగుబడిని పెంచుకోవాలన్నారు. ఇవన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు వరాలుగా ఇస్తుందని అందుకే మండలంలో రైతుల ఆధ్వర్యంలో రైతు పండుగను జరుపుకున్నావని తెలిపారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంనాథ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, నాయకులు ప్రేమనాథ్ రెడ్డి, కిషన్ పతంగే, రావుల శ్రీనివాస్,మాజీ వార్డు మెంబర్ అజీజ్, వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో పర్యటించిన ఎంఐఎం అధ్యక్షులు మోహిద్ పటేల్

నారాయణఖేడ్,,నవంబర్30(వుదయం ప్రతినిధి): నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మోహిద్ పటేల్ శనివారం సానిటేషన్ ఇన్స్పెక్టర్, వార్డ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మోహిద్ పటేల్ వార్డులోని మురికి కాలువలు, విద్యుత్ స్తంభాలు మరియు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ప్రధాన కార్యదర్శి మజర్, అహద్ పటేల్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతినగర్ లో 7న గీతా జయంతి ఉత్సవాలు...




కుత్బుల్లాపూర్, నవంబర్ 30,(వుదయం ప్రతినిధి ),డిసెంబర్ 7వ తేదీ శనివారం రోజున గీతా పరివార్ ప్రణీత 5161వ గీతా జయంతి మహోత్సవం నిర్వహించబడుతుందని నిజాంపేట్ కార్పోరేషన్ ప్రగతినగర్ లోని శ్రీ పట్టాభి రామాంజనేయ దేవస్థాన ఆలయ కమిటీ సౌజన్యంతో ఆలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం 5.00 గంటల నుండి జరిగే గీతా జయంతి మహోత్సవంలో భగవద్గీతా పారాయణం, భజనలు, పిల్లలకు క్విజ్ రంగులు పూరించే (కలరింగ్) పోటీలు, భగవద్గీతాను కంఠస్థం చేసిన వారికి సన్మానం తదితర కార్యక్రమాలు ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు గీతా సేవీ డాక్టర్ ఎమ్ ఆర్ ఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో గీతా పారాయణం కార్యక్రమాల్లో పాల్గొనే వాళ్లు ముందుగా 93940 54876 నంబర్ కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

# నామమాత్రంగా పౌర హక్కుల దినోత్సవం



మెదక్, ( 2024 నవంబర్ 30 వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో పౌర హక్కుల దినోత్సవం నామమాత్రంగా జరిగింది. మండలంలోని ఉన్నత అధికారులు ఎవరు కూడా హాజరు కాకపోవడంతో సమావేశం నామమాత్రంగా జరిగిందని దళిత ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నారు. ఈ సమావేశానికి ఎమ్మార్వో, ఎంపీడీవో, మండల ప్రత్యేక అధికారి తదితరులు హాజరు కావాల్సి ఉంది. కానీ హాజరు కాలేదు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు స్పందించాల్సిన బాధ్యత ఉందని వారు విజ్ఞప్తి చేశారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పాత్రికేయులు



ఎండపల్లి,నవంబర్ 30(వుదయం విలేఖరి): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి చంద్రా రెడ్డి తండ్రి ఏలేటి రాజారాం రెడ్డి ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎండపల్లి మండల ప్రెస్ క్లబ్(ఐజేయూ) అధ్యక్షులు నల్లాల కుమార్ అధ్వర్యంలో పాత్రికేయులు శనివారం రాజారాంపల్లి లోని వారి స్వగృహంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు, ఆనంతరం మృతుని చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు బాలసాని శ్రావణ్ కుమార్, బొడ్డు రాజేశం, నాగ సముద్రాల శ్రీనివాస్,చిలుక సతీష్, బేత్తపు లక్ష్మీ రాజం, గుండ గంగయ్య, ఉప్పు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# అధికారులతో మేయర్ సమీక్షా సమావేశం...



కుత్బుల్లాపూర్, నవంబర్ 30,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సాబేర్ అలి, ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలో నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, విజయలక్ష్మి సుబ్బారావు, ఎస్.ఈ సత్యనారాయణ, మేనేజర్ పవన్ కుమార్, ఎన్ఎంసీ ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

### –తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి



వలిగొండ ,నవంబర్30(వుదయం ప్రతినిధి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని రానిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో శ్రీ చైతన్య పాఠశాలలో డైరెక్టర్లు శ్రీధర్, శ్రీవిద్య ఆదేశాల మేరకు నిర్వహించిన సోషల్ వి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పతి విద్యార్థి స్నేహభావం అలవర్చుకోవాలన్నారు. ఆపదలో ఉన్న వాళ్లకు తమ వంతు సాయం అందించాలని సూచించారు.
విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, న్యూస్ పేపర్ రీడింగ్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం సుధాకర్, ప్రిన్సిపల్ బాలరాజు, డీన్ శివ,ప్రైమరీ ఇన్చార్జి నీరజ, జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛను పంపిణీ.

- జోరు వానలో ఆగని పించన్ పంపిణీలు.
- సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు.



తిరుపతి జిల్లా,చంద్రగిరి, నవంబర్ 30 (వుదయం ప్రతినిది): గత ప్రభుత్వంలో ఒకటవ తేదీకి రావలసిన పింఛను ఎనిమిదో తారీకు ఆరో తారీకు వచ్చేది. కానీ ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పుడు ఒకరోజు ముందుగానే ఫించన్ అందిస్తున్నారు. దీనికి మేము వారికి లభిదారులు కృజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. డిసెంబర్ 1వ తేదీన ఇవ్వవలసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ ను ఒకరోజు ముందుగానే అవ్వ, తాతలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా పాకాల మండలం పాకాల పంచాయతీ గాంధీనగర్ లో కూటమి పార్టీ మండల నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ప్రభుత్వం ముందు రోజు నవంబర్ 30వ తేదీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ 100% పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. పెంచిన పెన్షన్ ను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. పెన్షన్ దారులు ఇంటి వద్దనే ఉండి పెన్షన్ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల కష్టాలను, సమస్యలు తెలిసినవారు కాబట్టే మా పెద్దాయన చంద్రబాబు నాయుడు గారు ఒక్క రోజు ముందు పెన్షన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కక్షపూరితమైన రాజకీయాలకు తావు లేకుండా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్

### జేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న



ముధోల్: 30నవంబర్(వుదయం ప్రతినిధి)కాంగ్రెస్ ప్రభుత్వం మరో మారు రైతుల ను రైతు పండుగ పేరుతో మోసం చే స్తుందని ముధోల్ మండల బీజేపీ అ ధ్యక్షులు కోరి పోతన్న అన్నారు. శని వారం మండల కేంద్రమైన ముధోల్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పడి ఏడాది గడుస్తున్న రైతులకు ఏ లాంటి సంక్షేమ పథకాలు అందించ లేదన్నారు. రైతులకు రైతు భరోసా ఎ గ్గొట్టి, రెండు లక్షల రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిందన్నారు. విజ యోత్సవాల పేరిట రైతులను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆడు తున్న నాటకమని పేర్కొన్నారు. ఎ న్నికల హాయంలో ఆరు గ్యారెంటీలో అని చెప్పి సామాన్య ప్రజలకు ఎగనా మం పెట్టి తప్పుదోవ పట్టించడానికి ఇది ఒక కొత్త రూపురేఖ అని మండి పడ్డారు. రైతులను మోసం చేసి విజ యోత్సవాల రైతు పండుగ జరుపు కోవడం సిగ్గు చేటన్నారు. రైతు బంధు పథకాన్ని రూపు మాపే ప్రయ త్నం కాం గ్రెస్ పార్టీ చేస్తుందని అన్నారు. కౌలు రై తులకు,ఉపాధి కూలీలకు రైతు భరో సా వస్తదని మాటలకి మాత్రమే పరి మితమైందని అన్నారు. ప్రజా పాలన, కుటుంబసర్వేల పేరిట సామా న్య ప్రజలకు తప్పుదోవ పట్టిస్తుందన్నారు.

## మంచి మనసు చాటుకున్న ఆటో యూనియన్ నాయకులు



జన్నారం,నవంబర్ 30(వుదయం విలేకరి) జన్నారం మండలంలోని కామనపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కామర దుర్గయ్య కుటుంబానికి కవ్వాల్ గ్రామ ఆటో యూనియన్ నాయకులు ఇక సహాయం అందించి మంచి మనసును చాటుకున్నారు. దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆటో యూనియన్ సభ్యులు శనివారం మధ్యాహ్నం దుర్గయ్య కుటుంబ సభ్యులను కలిసి పదిహేను వేల రూపాయలు ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులను
అందజేశారు. ఆటో యూనియన్ నాయకులను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కవ్వాల్ ఆటో యూనియన్ అధ్యక్షులు పి. నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తా ...

### : బిఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ



కుత్బుల్లాపూర్, నవంబర్ 30,(వుదయం ప్రతినిధి ),కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి సురక్ష గ్రీన్ మీడోస్ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గండిమైసమ్మ లోని పురపాలక కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులని శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలుపుతూ కాలనీల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తామని తెలిపారు. కాలనీలో ఏ సమస్యలున్నా తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేందర్ యాదవ్, కాలనీ నూతన ప్రెసిడెంట్ వేణు గౌడ్ వైస్ ప్రెసిడెంట్లు సుధాకర్ రెడ్డి, సుధాకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీరాములు, జాయింట్ సెక్రెటరీ మైసయ్య గౌడ్, ట్రెజరర్ సాంబ శివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అమర్నాథ్, అడిషనల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ నాయుడు, అడ్వైజర్ మల్యాద్రి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువుల వైద్య శిబిరం

- పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి
- పశువైద్యాదికారి డా. సౌమ్య రెడ్డి



పాపన్నపేట, ,నవంబర్30(వుదయం ప్రతినిధి): పాడి రైతులు తమ పశువుల పోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పాపన్నపేట మండల పశువైద్యాదికారి డాక్టర్ సౌమ్య రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి లో పశు సంవర్ధక గర్భస్త పరీక్షలు నిర్వహించి పాడి రైతులకు తగిన మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పశుపోషణపై అవగాహన కల్పిస్తూ పాడి పశువులు, పెయ్యలు సకాలంలో ఎదకు వచ్చేలా మరియు గర్భం పొందేలా చూడాలన్నారు. ప్రతీ పశువుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని దూడల పోషణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డా. నాగార్జున పాటిల్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సలావుద్దీన్, సతీష్ కుమార్, గోపాల్, శివాజీ, గోపాలమిత్ర సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, గోపాల మిత్రులు షర్ఫుద్దీన్, సాయిలు, బాలరాజ్, సిబ్బంది యాదయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడండి

**ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయండి....**
**పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో**
**మండల డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందించిన......**
**అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు...**







శంకరపట్నం ,నవంబర్30(వుదయం ప్రతినిధి): పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు మోర్ గణేష్ అన్నారు.
ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం ఒక్కోనేలలో ఒక్కో గ్రామంలో నిర్వహిస్తున్నట్లు శంకరపట్నం మండల డిప్యూటీ తాసిల్దార్ మల్లేశం తెలిపారు. శనివారం మొలంగూర్ ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంను రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, పోలీసు డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ..ఇట్టి కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ ప్రజలు తమ హక్కులను కాపాడుకోవడానికి వినియోగించుకోవాలని అన్నారు. ఇతరుల నుండి ఏవైనా హక్కులకు భంగం కలిగించిన, కుల వివక్ష చూయించిన తక్షణమే ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షుడు మోరే గణేష్ డిప్యూటీ తాసిల్దార్ మల్లేశం కు ఓ వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం మండలం మొలంగూర్ గ్రామంలో 703 సర్వేనెంబర్ లో 16 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు, కబ్జాకు, గురవుతుందని గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 703 సర్వే నెంబర్లు అప్పటి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఇందిరమ్మ గృహ పథకంలో ద్వారా ఇండ్లు మంజూరు చేసిందని ఇట్టి 703 సర్వేనెంబర్ లో కొంతమంది భూస్వాములు ఇట్టి భూమిని కబ్జా చేసి ఆక్రమించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తుందని ఇండ్లు లేని నిరుపేదలకు అట్టి భూమిలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణం చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి గొట్టే శ్రావణ్ కుమార్, ఎంఈఓ, ఏఎస్ఐ సుధాకర్, దళిత సంఘం సీనియర్ నాయకులు శంకరపట్నం మండలం పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ పులికోట రమేష్ సీనియర్ న్యాయవాది మాజీ సర్పంచ్ మోరే అనూష శ్రీనివాస్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మండల అధ్యక్షులు అంతడుపుల సతీష్ నాయకులు ఆకునూరి మహేందర్ కోరపల్లి మహేందర్ గాజుల స్వామి ఆశ వర్కర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మండలంలో రేషన్ షాపు డీలర్ల ఆవేదన.



యర్రావారిపాలెం, నవంబర్30(వుదయం ప్రతినిధి) :మండలం లో ప్రభుత్వ పౌర సరఫరా సరుకుల కు చెందిన 30 రేషన్ షాప్లు ఉన్నాయి ఇందులో 19 షాప్ లకు పాకాల గోడౌన్ నుంచి రేషన్ సరఫరా జరుగుతోంది అవి ప్రతినెలా 30 తారీకు లోపల సరఫరా అవుతున్నాయి పాకాల గోడౌన్ సంబంధించి డీలర్లకు సమస్య లేదు కానీ మిగిలిన 11రేషన్ షాప్ లకు చంద్రగిరి గోడౌన్ నుంచి సరఫరా అవుతున్నాయి ఇవి నాలుగు,ఐదు తేదీలకు కూడా రేషన్ షాప్లకు రేషన్ సరఫరా కావడంలేదు దీంతో ప్రజలు 11రేషన్ షాప్ వాళ్ళను మిగిలిన రేషన్ షాప్ లకు వచ్చే నిత్యావసర సరుకుల ఎలావచ్చాయి మీకుఎందుకు రాలేదని డీలర్లని ప్రశ్నిస్తున్నారు. ప్రజల కు సమాధానం చెప్పలేక గోడౌన్ నుంచి రేషన్ సమయానికి అందక డీలర్లు అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రేషన్ షాప్ డీలర్లు కోరుకుంటున్నారు.

## విద్యార్థులలో విద్యా అభివృద్ధి కొరకు పోషకుల అవగాహన సదస్సు





ముధోల్, నవంబర్30 (వుదయం ప్రతినిధి) ముధోల్ మండల కేంద్రములోని కోలిగల్లి లో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ (నర్సరి నుండి 2వ తరగతి వరకు) పోషకులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పోషకులు ఉత్సాహంగా 223 మంది పోషకులకు గాను 171 మంది పోషకులు పాల్గొన్నారు. పోషకులు మరియు ఆచార్యులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థుల కృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యా పీఠం నిర్మల్ జిల్లా కోశాధికారి ధర్మపురి సుదర్శన్, జిల్లా కార్యకారిణి సభ్యులు గోపాల్ కిషన్, పాఠశాల కార్యదర్శి కంది మానాజీ, పాల్గొని మార్గదర్శనం చేశారు.
ప్రధానాచార్యులు సారథి రాజు మాట్లాడుతూ పోషకులు ఇచ్చిన సలహాలు సూచనలు నమోదు చేసుకున్నామని వాటిని పాటించి పాఠశాల విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

## రైతు పండుగ సభాస్థలి ఏర్పాట్లలో దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆం

దేవరకద్ర, ,నవంబర్30(వుదయం ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్ వద్ద జరుగుతున్న రైతు పండుగ సభ యొక్క సభ స్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి శనివారం ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి రాకకు పురస్కరించుకొని భారీ బహిరంగ సభకు తరలివస్తున్న రైతులకు సౌకర్య ఏర్పాట్లు నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రైతు పండుగ సదస్సుకు వెళ్లిన రైతులు

జడ్చర్ల, ,నవంబర్30(వుదయం ప్రతినిధి): మహబూబ్ నగర్ పట్టణంలో శనివారం జరిగే రైతు పండుగ బహిరంగ సభకు దేవరకద్ర నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణం నుండి రైతులు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని నాయకులు తెలిపారు. బహిరంగ సభకు వెళు _న్న రైతులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు రైతులు పేర్కొన్నారు.

## ప్రథమ బహుమతి అందజేసిన మెదక్ ఎంపీ



మెదక్, ( 2024 నవంబర్ 30 వుదయం ప్రతినిధి : పాపన్నపేట మండలం ఉన్నత పాఠశాల విద్యార్థి శివ చైతన్య 9వ తరగతి అడ్వాన్స్ హైడ్రాలిక్ జెసిబి, మల్టీపర్పస్ విభాగంలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం ప్రథమ స్థానం అందుకున్నాడు. రాబోయే రాష్ట్రస్థాయిలో జరిగే వర్గ ప్రదర్శనలతో పాల్గొంటాడు. గైడ్ టీచర్ కిషన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నాడు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రథమ బహుమతి అందజేశారు.

## ఘనంగా కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు



లక్షెట్టిపేట నవంబర్ 30 :( వుదయం ప్రతినిధి):–మండల కాంగ్రెస్ ముఖ్య నాయకుడు,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం జన్మదిన వేడుకలను శనివారం తన నివాసంలో పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షాహిద్ అలి,రాందేని వెంకటేష్, నవాబు ఖాన్,చిన్న రమేష్,చిన్న వెంకటేష్,పడాల గౌతమ్,అబ్బు బాయి,సూరారం చంద్రమౌళి, తదితరులు తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని శుభాకాంక్షలతో తెలియజేశారు.




# బిజినెస్





## భారత జిడిపి మందగమనం

భారత ఆర్థిక వ్యవస్థ ఉరుకులు పెడుతోందన్న బిజెపి పాలకుల ఊకదంపుడు ఉపన్యాసాలు, రిపోర్టులు వాస్తవ రూపంలో కార్యరూపం దాల్చడం లేదు. స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రోజురోజుకూ మందగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో వృదిఆద ఏకంగా 5.4 శాతానికి పడిపోయి.. దాదాపు రెండేళ్ల కనిష్టానికి క్షీణించింది. ఆర్‌బిఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా క్షీణించడం గమనార్హం. కేంద్ర గణాంకాల శాఖ (ఎన్ఎస్ఒ) శుక్రవారం జిడిపి రిపోర్ట్‌ను వెల్లడించింది. మైనింగ్, గనుల రంగాలు అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపి ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమైంది. ఈ రెండింటితోనూ పోల్చినా జిడిపిలో భారీ తగ్గుదల నమోదుకావడం ఆందోళనకరం. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6 శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని చేసిన అంచనాల కంటే మరింతగా పడిపోవడం విశేషం. జిడిపి 7 శాతం పెరగనుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంతదాస్ అంచనా వేశారు. ఆర్‌బిఐ అంచనాలకు మించి జిడిపి పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒక ఏడాదిలో దేశంలో ఉత్పత్తి అయిన సరుకులు, సేవల మొత్తం విలువను జిడిపిగా పేర్కొంటారు. ఇది ఆర్థిక వ్యవస్థ పనితీరును తెలుపుతోంది. జిడిపి పడిపోతుందంటే దేశంలో ఆర్థిక కార్యకలాపాలు సన్న గిల్లుతున్నాయని అర్థం. ఇటీవల ప్రజల వినిమయం భారీగా దెబ్బతిందన్న రిపోర్టులు జిడిపిపై తీవ్ర ప్రభావం చూపి ఉంటుందని తెలుస్తోంది.

## తయారీ, గనుల రంగాలు డీలా



గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో వ్యవసాయ రంగం 3.5 శాతం వృద్ధితో మెరుగైన ప్రగతిని కనబర్చింది. ఈ రంగం ఇంతక్రితం త్రైమాసికంలో 2 శాతంగా, గతేడాది సెప్టెంబర్ త్రైమాసికంలో 1.7 శాతంగా నమోదైంది. గనుల రంగం గతేడాది రెండంకెల పెరుగుదలను సాధించగా.. ఈ ఏడాది ప్రతికూల వృద్ధిలోకి జారుకుంది. ఈ రంగం క్రితం క్యూ2లో మైనస్ 0.1 శాతంతో ప్రతికూల వృద్ధిని చవిచూసింది. ఏడాదిక్రితం ఈ రంగంలో 11.1 శాతం పెరుగుదల ఉంది. అదే సమయంలో తయారీ రంగం 14.3 శాతం వృద్ధిని సాధించగా.. గడిచిన క్యూ2లో ఏకంగా 2.2 శాతానికి పడిపోయింది. విద్యుత్ రంగం వృద్ధి 10.5 శాతం నుంచి 3.3 శాతానికి క్షీణించింది. క్రితం క్యూ2లో నిర్మాణ రంగం 7.7 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో 13.6 శాతం పెరుగుదలను సాధించింది. ఇదే సమయంలో వాణిజ్యం, హెూటళ్లు, రవాణా రంగాల జిడిపి 4.5 శాతంగా ఉండగా.. గడిచిన క్యూ2లో 5.7 శాతానికి పెరిగింది.

ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, నైపుణ్యాల సర్వీసులు ఏడాదికేడాదితో పోల్చితే 6.2 శాతం నుంచి 6.7 శాతానికి పెరిగాయి. ఊహించినదానికంటే బలహీనమైన వృద్ధి చోటుచేసుకోవడంతో భారత ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలను పెంచనుందని నిపుణులు పేర్కొంటున్నారు..

ముఖ్యంగా, తయారీ, మైనింగ్ లాంటి కీలక రంగాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని స్పష్టమవుతోందన్నారు. దేశ ఆర్థికవ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాలు డిమాండ్ లేక పడకేశాయి. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో కీలక రంగాల వృద్ధి 3.1 శాతానికి పరిమితమైంది. 2023 ఇదే మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు ఏకంగా 12.7 శాతం శాతం వృద్ధి సాధించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో ఈ రంగాలు 4.1 శాతం వృద్ధికే పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 8.8 శాతం శాతం వృద్ధిని కనబర్చాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రంగాల వృద్ధి పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

## మార్కెట్‌లో మోసాలకు చెక్ పెట్టండిలా..?




జీవితంలో ప్రతి నిత్యం మనకు అనేక వస్తువులు అవసరమవుతాయి. వివిధ దుకాణాల్లో వాటిని కొనుగోలు చేసుకుని వినియోగించుకుంటూ ఉంటాం, బియ్యం, పప్పులు, ఉప్పు, నూనె తదితర నిత్యావసరాలతో పాటు దుస్తులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు.. ఇలా చెప్పుకుంటే పోతే వీటి జాబితా చాలా పెద్దదిగా ఉంటుంది. వీటిని విక్రయించే దుకాణాలు అనేకం ఉంటాయి. ఈ వస్తువులను కొనుగోలు చేసినప్పుడు వాటి ధరలు చూసుకోవడం చాలా కీలకం. కొందరు దుకాణదారులు సామగ్రిని అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తారు. అలాంటి సమయంలో వారు చెప్పిన ధరకే వాటిని కొనుగోలు చేయాలా, డబ్బులు నష్టపోకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్రతి వస్తువుకు గరిష్ట రిటైల్ ధర (ఎంఆర్ పీ) నిర్ణయిస్తారు. ఈ ధరను ఆ వస్తువు లేబుల్ పై అందరికీ కనిపించేలా ముద్రిస్తారు. ఆ ధరకు మించి కొనుగోలుదారులు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే కొందరు దుకాణాదారులు ఎంఆర్ పీ కంటే ఎక్కువ ధరను వసూలు చేస్తారు. అదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారు. అలాగే చిల్లర ఇవ్వడానికి బదులు చాకెట్లు, మిఠాయిలను చేతిలో పెడతారు. చ్చాలామంది వినియోగదారులు ఇలాంటి మోసాల బారిన పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఎక్కువ ధరకు సరుకులను కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు చేసింది. వాటిని సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులను కూడా నియమించింది. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకుంటే మోసాల నుంచి బయటపడవచ్చు. ఆర్థికంగా నష్టపోకుండా ఉండే అవకాశం కలుగుతుంది. దుకాణ యజమాని ఒక వస్తువును ఎంఆర్ పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్టానికి ఫిర్యాదు చేయవచ్చు. వడోదరకు చెందిన న్యాయవాది విరాజ్ ఠక్కర్ ఇటీవల ఈ విషయంపై మాట్లాడారు. దుకాణదారులు ఎంఆర్ పీ కంటే ఎక్కువ వసూలు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. దుకాణదారులు ఇలా ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించినా, వస్తువు బరువు తక్కువగా ఉన్నా వెంటనే ఫిర్యాదు చేయవచ్చు. అయితే రెస్టారెంట్లు, కేఫ్ లలో మాత్రం బిల్లుకు అదనంగా సర్వీస్ చార్జీని వసూలు చేస్తారు. కొన్ని నిబంధనల ప్రకారం వారికి అనుమతి ఉంటుంది. అవి తప్ప బయట మార్కెట్ లో అదనపు చార్జీలు వసూలు చేయడం చట్టవిరుద్ధం. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం.. వ్యాపారులు వస్తువుల ఎంఆర్పీ కంటే అధిక వసూలు చేయడం నేరం. అది చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. దీనిపై వినియోగదారుల కోర్టు లేదా జిల్లా వినియోగదారుల ఫోరమ్ లో ఉచితంగా ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారులు తమకు జరిగిన నష్టాన్నితెలియజేయవచ్చు. అధికారులు ఆ ఫిర్యాదుపై వెంటనే విచారణ చేస్తారు. దుకాణదారుడు దోషిగా తేలితే జరిమానా విధిస్తారు. కొనుగోలుదారుడికి న్యాయం జరిగేలా చూస్తారు.

## తప్పుడు ప్రకటనల్లో రియాల్టీనే టాప్




ముంబయి : రియల్ ఎస్టేట్, ఆఫ్‌షోర్ బెట్టింగ్ రంగాలలో వినియోగదారులను తప్పుదోవ పట్టించే చట్టవిరుద్ధ ప్రకటనలు భారీగా పెరిగాయని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) వెల్లడించింది. 2024-25 తొలి అర్థవార్షిక ఫిర్యాదుల రిపోర్ట్‌ను ఎస్ఎస్‌సిఐ విడుదల చేసింది. ఏప్రిల్-సెప్టెంబర్ 2024 మధ్య కాలంలో మొత్తంగా 4016 ఫిర్యాదులను సమీక్షించినట్లు తెలిపింది. ఉల్లంఘనలకు పాల్పడిన మొత్తం ప్రకటనల్లో రియల్టీ 34 శాతం, చట్టవిరుద్ధమైన బెట్టింగ్ 29 శాతం, ఆరోగ్య సంరక్షణ 8 శాతం, వ్యక్తిగత సంరక్షణ 7 శాతం, ఆహారం, పానీయాలు 6 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయని తెలిపింది. 3031 ప్రకటనలకు కొంత సవరణలు అవసరమని గుర్తించినట్లు పేర్కొంది. 2087 ప్రకటనలు చట్టాన్ని ఉల్లంఘించినట్లు గుర్తించినట్లు పేర్కొంది. రియాల్టీకి సంబంధించి 1027 ప్రకటనలు, అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించే మరో 890 ప్రకటనల సమాచారాన్ని సమాచార, మంత్రిత్వ శాఖకు పంపించినట్లు వెల్లడించింది.

## రూ. 91 రీఛార్జ్‌తో 60 రోజుల వ్యాలిడిటీ



ప్రముఖ ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ అదిరిపోయే రీఛార్జ్ ప్లాన్స్ తో వినియోగదారులను ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మరో బెస్ట్ ప్లాన్ తో యూజర్ల ముందుకు వచ్చింది. ఈ ప్లాన్ తో కేవలం రూ. 91 రీఛార్జ్ తో 60 రోజులు వ్యాలిడిటీ పొందొచ్చు.

. ఒకప్పుడు ఇన్‌కమింగ్ ఉచితంగా ఉండేది. టెలికం కంపెనీలు లైఫ్ టైమ్ ఉచితంగా ఇన్‌కమింగ్ కాల్స్ సౌలభ్యాన్ని అందించాయి. అయితే కంపెనీల మధ్య నెలకొన్న పోటీ నేపథ్యంలో ఇన్‌కమింగ్స్ కాల్స్ రావాలంటే కచ్చితంగా యాక్టివ్ ప్లాన్ ఉండే విధానాన్ని అమలు చేస్తూ వస్తున్నాయి.

దీంతో రెండు సిమ్‌లు ఉన్న వారు, కేవలం ఇన్‌కమింగ్ కాల్స్ కోసం మాత్రమే ఫోన్ ఉపయోగిస్తున్న వారికి ఇబ్బందిగా మారింది. కచ్చితంగా కనీసం నెలకు రూ. 150 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు అన్ని ప్రైవేటు టెలికం సంస్థలు ఇదే విధానాన్ని అవలంబిస్తున్నాయి. అయితే ఇలాంటి తరుణంలో ప్రముఖ ప్రభుత్వ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ అదిరిపోయే రీఛార్జ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. రూ. 91 రీఛార్జ్‌తోనే ఏకంగా 60 రోజుల వ్యాలిడిటీతో కూడిన ప్లాన్‌ను అందించింది. ఈ ప్లాన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. రూ. 91తో రీఛార్జ్ చేసుకుంటే 60 రోజుల వ్యాలిడీ లభిస్తుంది. అయితే ఈ ప్లాన్‌తో ఎలాంటి టాక్‌టైమ్ రాదు.

ఇందుకోసం ప్రత్యేకంగా రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే అవుట్ గోయింగ్ కాల్స్‌కు నిమిషానికి 15 పైసలు పడుతుంది. ఒక్కో ఎస్ఎమ్ఎస్‌కు 25 పైసలు అవుతుంది.

ఎక్కువ రోజులు సిమ్ యాక్టివ్‌లో ఉండాలనుకునే వారికి ఈ ప్లాన్ బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు.

ప్రస్తుతం మరే ఇతర టెలికం సంస్థలో ఇలాంటి రీఛార్జ్ ప్లాన్ అందుబాటులో లేదని చెప్పాలి.

## ప్రయాణికుల సురక్షిత భద్రత కోసం మై ఆటో ఇజ్ సేఫ్...

- ప్రయాణికులకు ఆటోలో సురక్షితంగా ప్రయాణిస్తున్నామనే నమ్మకం కలిగించాలి...
- జగిత్యాల పట్టణంలోని 15 ఆటోలకి క్యూఆర్ కోడ్ తో అనుసంధానం...
- ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పరిమితి లోపు ప్రయాణికులను ఎక్కించుకోవాలి...
- జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్




కోరుట్ల నవంబర్ 30 (వుదయం ప్రతినిధి) ప్రయాణికుల సురక్షిత భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆటో రిక్షాల సర్వీసెస్ వాహన యజమాన్యం నుండి అవసరమైన డాక్యుమెంట్లు సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసిన తర్వాత క్రోడీకరించిన సమాచారంను మై ఆటో ఇజ్ సేఫ్ ఆప్ క్యూ ఆర్ కోడ్ ను జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ శనివారం జిల్లా పోలీస్ గ్రౌండ్ లో ప్రారంభించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో సుమారు 15 ఆటోలకు ఆటో ముందు వెనక డ్రైవర్ సీట్ వెనకాల ప్రయాణికులకు కనిపించే విధంగా స్టిక్కరింగ్ చేయడం జరిగిందని రాబోయే కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ఆటోకు కూడా ఈ స్టిక్కరింగ్ చేయడం జరుగుతుందన్నారు ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆ ఆటోకు మై ఆటో ఇజ్ సేఫ్ అనే స్టిక్కరింగ్ ఉందా అని గమనించాలన్నారు ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఆటో డ్రైవర్ మీతో అసభ్యకరంగా ప్రవర్తించిన దుడుచుగా మాట్లాడిన మరే ఇతర సమస్యలు ఎదుర్కొన్న మీరు ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్ సీట్ వెనకాల గల క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి వెంటనే అట్టి ఆటో డ్రైవర్ కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్ నందు కనిపిస్తుంది వాటితో పాటు ఎమర్జెన్సీ కాల్ ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది వారు వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందవేయడంతో వెంటనే స్పందించి వాహనం యొక్క లైవ్ లొకేషన్ కి చేరుకుంటారన్నారు ఇల్లు కడిగినప్పుడు మై ఆటో ఇజ్ సేఫ్ స్టిక్కరింగ్ పోస్టర్ను జిల్లా ఎస్పీ విడుదల చేశారు ఆటో డ్రైవర్ కు అందించారు ఎస్పీ స్వయంగా ఆటోలో కూర్చుని క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి అనంతరం వివరాలను తెలియజేశారు ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించిన రాష్ డ్రైవింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ హీట్ అండ్ రన్ చేసిన ఈ యాప్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చునన్నారు ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలని ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పరిమితికి మించి ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు మద్యం తాగి వాహనాలు నడపడం నేరమని డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో డిఎస్పి రఘు చందర్ ఆర్టీవో శ్రీనివాస్ టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ రూరల్ సిఐ కృష్ణారెడ్డి క్యూఆర్ కోడ్ ఆఫ్ రూపకర్త రమేష్ రెడ్డి ఆర్ఐ వేణు ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం పోలీస్ సిబ్బంది ఆటో డ్రైవర్లు ఓనర్లు తదితరులు పాల్గొన్నారు

# జాతీయం – అంతర్జాతీయం



## 6న ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్ విచారణ

న్యూఢిల్లీ : ఉపా చట్టం కింద అరెస్టయిన ఉమర్ ఖలీద్‌తో పాటు గుల్ఫిషా ఫాతిమా, ఖాలీద్ సైఫీల బెయిల్ పిటిషన్‌పై డిసెంబరు 6న విచారణ జరగనున్నది. న్యాయమూర్తులు జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ శైలిందర్ కౌర్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం దీనిని చేపట్టనున్నది. 2020లో ఢిల్లీ అల్లర్లకు సంబంధించి ఉపా కింద ఈ ముగ్గురూ కేసులను ఎదుర్కొంటున్నారు. తాము సుదీర్ఘ కాలం జైలులో ఉన్నామనీ, దానిని పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు ఈ పిటిషన్‌ను వేశారు. వాస్తవానికి ఉమర్ ఖాలీద్ బెయిల్ పిటిషన్‌ను ఈ ధర్మాసనం అక్టోబర్ 7న చేపట్టాల్సి ఉన్నది. కానీ, బెంచ్ సమావేశం విఫలం కావటంతో అది సాధ్యపడలేదు. ఆ తర్వాత పిటిషన్ విచారణ నవంబర్ 25కు జాబితా చేయబడింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14తో ఉమర్ ఖాలీద్ నాలుగేండ్లు జైలులో గడిపినట్టయ్యింది. బెయిల్ కోసం దిగువ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు పలుమార్లు ఉమర్ ఖాలీద్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది మే 28న దిగువ కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. నాలుగేళ్లలో సుప్రీంకోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ 14 సార్లు ఆలస్యమైంది. ఆ తర్వాత ఆయన ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉమర్ ఖాలీద్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్.. దిగువ న్యాయస్థానంలో దాఖలుచేసేందుకు సుప్రీంకోర్టు నుంచి పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు.

## భగ్గుమన్న పార్లమెంట్

న్యూఢిల్లీ: అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్ హింస, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో శాంతి భద్రతల ఉల్లంఘన అంశాలపై చర్చించాలని ప్రతిపక్షాల నినాదాల హోరుతో పార్లమెంట్ దద్దరిల్లింది. ఈ అంశాలపై ప్రభుత్వం చర్చకు నిరాకరించడంతో పార్లమెంట్ నిమిషాల్లోనే సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాల హోరెత్తించారు. అదానీ ముడుపులు, లంచం వ్యవహారంపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. కేంద్రం సమాధానం చెప్పాలంటూ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో పది నిమిషాలకే సభను మధ్యాహ్నం 12 గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ప్యానల్ స్పీకర్ దిలీప్ సైకియా అదానీ వ్యవహారం, మణిపూర్ హింస, సంభాల్ హింసపై ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ప్రతిపక్షాలు తమ ఆందోళనను ఉధృతం చేశాయి. మరోవైపు నేషనల్ ఏఆర్‌టీ అండ్ సరోగసీ బోర్డులో ఇద్దరు మహిళా సభ్యులను నియమించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీన్ని మూజువాణి ఓటుతో ఆమోదించారు.

పది నిమిషాల్లో సభను సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే కొనసాగింది. సభను చైర్మెన్ జగదీప్ ధన్కర్ ప్రారంభించగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 17 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. దీంతో ప్రతిపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. 13 నిమిషాల్లోనే సభను సోమవారానికి వాయిదా వేశారు.

## ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలి

న్యూఢిల్లీ: ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూఎఫ్‌ఎఫ్‌ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సీఐటీయూ అనుబంధ ఏడబ్ల్యూఎఫ్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వేలాది మంది ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లు 'ఆశా సంఘర్ష్ ర్యాలీ' నిర్వహించారు. సామాజిక భద్రత కల్పించాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మార్చ్‌లో సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత మాట్లాడుతూ కార్పొరేట్, మతతత్వ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను మార్చేందుకు ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మోడీ సర్కార్ కార్మికుల హక్కులను హననం చేస్తోందని, అందులో భాగంగానే లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందని విమర్శించారు.

కార్మికుల సామాజిక భద్రతను గాలికి వదిలేసిన మోడీ సర్కార్ మెడలు వంచాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన పోరాటాలు చేస్తున్న ఆశా వర్కర్లను ఆమె అభినందించారు. జాతీయ స్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. ఏడబ్ల్యూఎఫ్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ మాట్లాడుతూ చార్టర్ ఆఫ్ డిమాండ్లు, సమస్యలను వివరించారు. సంఘం ఇప్పటివరకు చేసిన పోరాటాలు, విజయాలను తెలిపారు.

## ఐరాస శాంతి పరిరక్షక కమిషన్‌కి తిరిగి ఎంపికైన భారత్

భారత్ 2025-26 సంవత్సరానికి ఐరాస శాంతి పరిరక్షక కమిషన్ (పిబిసి)కి తిరిగి ఎన్నికైంది. కమిషన్‌లో భారత దేశ ప్రస్తుత పదవీకాలం డిసెంబర్ 31తో ముగుస్తుంది. "భారత్ 2025-26 సంవత్సరానికి యుఎన్ శాంతి పరిరక్షక కమిషన్‌కు తిరిగి ఎంపికైంది. పిబిసి వ్యవస్థాపక సభ్యులిగా, ప్రధాన సహకారిగా, ప్రపంచ శాంతి మరియు స్థిరత్వం కోసం పనిచేయడానికి పిబిసితో తమ సహకారాన్ని కొనసాగించడానికి భారత్ కట్టుబడి ఉంది'' అని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత కమిషన్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. పిబిసి సాధారణ అసెంబ్లీ, భద్రతా మండలి మరియు ఆర్థిక, సామాజిక మండలి నుండి ఎన్నికైన 31 సభ్యదేశాలను కలిగి ఉంటుంది. ఐరాసలో ఆర్థికసహకారం అందించే దేశాలు, అగ్రదళం, సహకార దేశాలు కూడా సభ్యులుగా ఉంటాయి. యుఎన్ శాంతి పరిరక్షణకు అత్యధిక సిబ్బందిని అందించిన దేశాలలో భారత్ కూడా ఒకటి. ఇది ప్రస్తుతం అబ్బై, సెంట్రల్ అమెరికన్ రిపబ్లిక్, సైప్రస్, డెమోక్రటిక్ రిపబ్లికన ఆఫ్ కాంగో, లెబనాన్ మిడిల్ ఈస్ట్, సోమాలియా, సౌత్ సూడాన్, వెస్ట్రన్ సహారాలో యుఎన్ కార్యకలాపాలకు సుమారు ఆరువేల మంది సైనిక, పోలీస్ సిబ్బందిని మోహరించింది. సుమారు 180మంది శాంతి పరిరక్షకులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. పిబిసి సంఘర్షణ ప్రభావిత దేశాలలో శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇచ్చే అంతర ప్రభుత్వం సలహా సంస్థ. విస్తృత శాంతి అజెండాలో అంతర్జాతీయ సంఘం సామర్థ్యానికి కీలకంగా, అదనంగా పనిచేస్తుంది.

## జిడిపి వృద్ధి గణాంకాలు..

### ఊహించిన దానికంటే దారుణంగా ఉన్నాయి



న్యూఢిల్లీ : ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో జిడిపి వృద్ధి రేటు 5.4 శాతానికి పడిపోయిందని కేంద్ర గణాంకాల శాఖ శుక్రవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిడిపి వృద్ధిరేటు ఊహించిన దానికంటే దారుణంగా పడిపోయిందని శనివారం కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఇదేక్రమంలో వినియోగం 6 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తోందని ఆయన ఆరోపించారు. జిడిపి పడిపోవడానికి ప్రధాన కారణం.. కార్మికుల వేతనాల్లో పెరుగుదల లేకపోవడమేనని.. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం వాస్తవాలను గుర్తించడం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ ఎప్పుడూ కూడా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ప్రజల్లో హైప్‌ని సృష్టించారని ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, జిడిపి తగ్గడానికి గల కారణాలపై నరేంద్ర మోడీ, ఆయన చీర్‌లీడర్‌లు ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తున్నారు. అయితే ముంబైకి చెందిన ప్రముఖ ఆర్థిక సమాచార సేవల సంస్థ నవంబర్ 26వ తేదీన విడుదలన చేసిన ' లేబర్ డైనమిక్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్' తాజా నివేదిక జిడిపి పడిపోవడానికి గల అసలు కారణాన్ని వెల్లడిస్తోంది. ఆ నివేదికలో కార్మికుల వేతనాల్లో పెరుగుదల లోపించిందని స్పష్టంగా తెలియజేస్తోందని రమేష్ అన్నారు. మొత్తంగా నిజవేతనం వృద్ధి గత ఐదేళ్లలో జాతీయ స్థాయిలో 0.01 శాతం పడిపోయిందని తాజా నివేదిక తెలిపింది.

ఈ ఐదేళ్లలో హర్యానా, అస్సాం, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని కార్మికుల నిజ వేతనాలు తగ్గాయి. ప్రతి భారతీయుడు గత పదేళ్ల క్రితం కంటే.. ఇప్పుడు తక్కువగా కొనుగోలు చేసే పరిస్థితిలో ఉన్నాడు. ఇదే జిడిపి మందగమనానికి కారణం అని ఆయన స్పష్టం చేశారు.

## అది అమెరికా న్యాయ శాఖ, ప్రైవేట్ సంస్థల లీగల్ సమస్య




న్యూఢిల్లీ : అదానీ ముడుపుల వ్యవహారం పార్లమెంటును పట్టి కుదిపేస్తుంటే అది అమెరికా న్యాయశాఖ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన లీగల్ సమస్యగా భారత్ కొట్టి పారేసింది. దీనిపై మాకు ఎవరినుంచి ఎలాంటి అభ్యర్థనలు రాలేదని చెప్పింది. మోడీ అత్యంత సన్నిహితుడైన వివాదాస్పద వ్యాపార వేత్త గౌతమ్ అదానీపై అమెరికా న్యాయశాఖ అభియోగాలను మోపిన వారం రోజులకు తీరికగా స్పందించిన విదేశాంగ శాఖ ఆకుకు అందని పోకకు పొందని రీతిలో ఈ వ్యాఖ్యలు చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వీక్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అదానీపై అభియోగాలకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం రాలేదని సమాధానం దాటవేసే యత్నం చేశారు. ఈ విషయంలో అమెరికాతో ఎలాంటి సంభాషణలు కానీ, సంప్రదింపులు కానీ భారత్ జరపలేదని చెప్పారు. అదానీ, ఆయన ఆరుగురి అధికారులకు సమన్లు, అరెస్టు వారెంట్లు అమెరికా కోర్టు జారీ చేసిందా అని విలేకరులు అడగ్గా, ఎలాంటి విజ్ఞప్తులు మాకు అందలేదని జైస్వాల్ ముక్త సరిగా సమాధానమిచ్చారు. అటువంటి అభ్యర్థన ఏదైనా వస్తే, దానిలో మెరిట్‌ను బట్టి చట్టపరమైన పరస్పర సహకార విషయం పరిశీలిస్తామని అన్నారు.

## దూసుకొస్తున్న ఫెంగల్ తుఫాను తమిళనాడులో భారీ వర్షాలు

చెన్నై: శనివారం మధ్యాహ్నానికి ఫెంగల్ తుఫాను పుదుచ్చేరికి దగ్గరగా రానుందని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం(ఆర్.ఎం.సి) ప్రకటించింది. తీరం దాటే సమయంలో గంటకు 90కిమీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం ఏడు తీరప్రాంత జిల్లాల్లో అత్యంత భారీ వర్షపాతాన్ని సూచించే రెడ్ వాతావరణ హెచ్చరికను ఆర్.ఎం.సి జారీ చేశారు. ఇతర జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఫెంగల్ తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో మొత్తం 2,229 శిబిరాలు ప్రారంభించారు. నాగపట్నం, తిరువారూర్ జిల్లాలకు చెందిన 470 మందికి పైగా ప్రజలను ఆరు సహాయ శిబిరాలకు తరలించారు. ఫెంగల్ తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో మొత్తం 2,229 శిబిరాలు తెరవబడ్డాయి. సముద్ర తీర ప్రాంత జిల్లాల్లో అధికారులు జారీ చేసిన సలహా మేరకు 4,100కు పైగా మత్స్యకార పడవలు తిరిగొచ్చాయి. కురిసిన వర్షానికి నేలకూలే చెట్లను తొలగించడానికి హైడ్రాలి, టెలిస్కోపిక్ పరికరాలతో సహా 489 ప్రత్యేక యంత్రాలను సిద్ధం చేశారు. రైల్వే వంతెన పనుల కోసం తాత్కాలికంగా మూసివేయబడిన గణేశపురం మినహా మిగిలిన 22 సబ్‌వేలు పని చేస్తున్నాయి. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 329 సహాయ కేంద్రాలను సిద్ధం చేసింది. వాటిలో ఆహారం, నీరు మరియు పారిశుద్ధ్య సౌకర్యాలు ఉన్నాయి. 103 బోట్ల ద్వారా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అక్టోబర్ 15 నుంచి ఇప్పటి వరకు 2,615 వైద్య శిబిరాల ద్వారా 1.39 లక్షల మంది లబ్ధి పొందారు.



## ముప్పు నీడన ట్రంప్

అస్తానా : అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికీ ముప్పు నీడనే ఉన్నారని రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్, ఆయన కుటుంబం అత్యంత అనాగరికమైన పద్ధతుల్లో దాడులను ఎదుర్కొనాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. కలెక్టివ్ సెక్యూరిటీ ట్రియటీ ఆర్గనైజేషన్ (సిఎస్‌టిఓ) సదస్సు ముగింపు సందర్భంగా కజకస్తాన్ రాజధాని అస్తానాలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పుతిన్ మాట్లాడారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయెంలో పదే పదే ట్రంప్‌పై హత్యా యత్నాలు చోటుచేసుకున్నాయని, చిన్నారులతో సహా ట్రంప్ కుటుంబాన్ని ఇలా రాజకీయ ప్రత్యర్థులు లక్ష్యంగా చేసుకున్నాయని, అయితే ట్రంప్ ఇప్పటికీ ముప్పు నీడనే ఉన్నారని పుతిన్ వ్యాఖ్యానించారు. ఇప్పటికీ ఆయనకు రక్షణ లేదన్నది తన ప్రగాఢ అభిప్రాయమని చెప్పారు. అనుభవజ్ఞుడు, మేధావి అయిన ట్రంప్ ఇలాంటి దాడలను జాగ్రత్తగా ఎదుర్కొగలరని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గత జులై 13న పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచార సందర్భంగా ట్రంప్‌పై హత్యా యత్నం జరిగిన సంగతి తెలిసిందే.

## కాల్పుల విరమణ ఉల్లంఘనలు ఆపండి



బీరుట్ : హిజ్బుల్లాతో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయిల్ తాజాగా వైమానిక దాడికి పాల్పడిన నేపథ్యంలో ఇటువంటి ఉల్లంఘనలను ఆపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాతి కోరారు. ఫ్రెంచి అధ్యక్షులు మాక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ మికాతి ఈ విజ్ఞప్తి చేశారు. బుధవారం తెల్లవారు జాము నుండి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన లెబనాన్‌లో తాజా పరిస్థితుల గురించి వారు మాట్లాడుకున్నారు. ఒప్పందం కుదిరేలా సహకరించినందుకు ఆయన మాక్రాన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. ఒప్పందాన్ని ఉల్లంఘించి గురువారం జరిగిన దాడిలో గణనీయంగా నష్టం జరిగిందని, పలువురు గాయపడ్డారని మికాతి తెలిపారు. కాగా హిజ్బుల్లానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లో పలు ప్రాంతాల్లోకి వాహనాలు వచ్చాయని తెలిపింది. అందుకే తాము హెచ్చరికగా కాల్పులు జరిపామని వెల్లడించింది. అయితే తైబే గ్రామంపై ఇజ్రాయిల్ డ్రోన్‌తో జరిపినదాడిలో నలుగురు గాయపడ్డారని లెబనాన్ మిలటరీ తెలిపింది.

## చెన్నైఎయిర్‌పోర్టు మూసివేత



చెన్నై : ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురుస్తోన్న భారీ వర్షాల కారణంగా.. చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. బలమైన ఈదురుగాలులు,

భారీ వర్షాల నేపథ్యంలో శనివారం సాయంత్రం 5 గంటల వరకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే శుక్రవారం నుంచి విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు పలు ఎయిర్‌లైన్లు ప్రకటించాయి. కొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. తాజాగా ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను ఆపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం నాటికి ఈ తుపాను తీరం దాటుతూ ఉధృతంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే సహాయక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. తుపానును ఎదుర్కొనేందుకు సంసిద్ధత చర్యలను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అటు పుదుచ్చేరిలోనూ భారీ వర్షాల కారణంగా సముద్రం ఉవ్వెత్తున ఎగసిపడుతోంది. అక్కడి ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రభుత్వం సూచించింది.

## తటస్థంగా వ్యవహరించాలి

న్యూఢిల్లీ: హింస, ప్రాణ నష్టం, అరెస్టులు, మతోన్మాద ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పూర్తిగా తటస్థంగా వుంటూ శాంతి సామరస్యతలను కాపాడాల్సిందిగా ఉత్తరప్రదేశ్ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం కోర్టు శుక్రవారం కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. 16వ శతాబ్దంలో ఆలయాన్ని ధ్వంసం చేసి దానిపై మసీదును నిర్మించారనే వాదనలను నిర్ధారించేందుకు సర్వే చేపట్టాల్సిందిగా సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన తరుణంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. కాగా, తమ ముందున్న కార్యకలాపాలను నిలిపివేయాల్సిందిగా సివిల్ కోర్టును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజరు కుమార్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది. సివిల్ కోర్టు అడ్వకేట్ కమిషనర్ రూపొందించిన మసీదు సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లో వుంచాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పిటిషనర్, మసీదును నిర్వహించే సంభాల్ షాహి జామా మసీద్ కమిటీపై సుప్రీం కోర్టు పలు చట్టపరమైన చర్యలు తీసుకుంది. సర్వే నిర్వహించాలని లేదా ఆదేశాలు సవరించాలని లేదా అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని కోరుతూ నవంబరు 19న సివిల్ కోర్టు పరోక్షంగా ఇచ్చిన ఆదేశాలను తోసిపుచ్చేందుకు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 13వ నిబంధనలోని 9వ ఆదేశాల కింద కమిటీ పిటిషన్ దాఖలు చేయవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా చెప్పారు. కమిటీ దాఖలు చేసే పిటిషన్‌పై హైకోర్టు విచారించేవరకు ఎలాంటి కార్యకలాపాలను విచారణా కోర్టు చేపట్టరాదని బెంచ్ స్పష్టం చేసింది. సివిల్ కోర్టు ఆదేశాలపై పిటిషన్ దాఖలైతే మూడు రోజుల్లోగా దానిని విచారణాంశాల జాబితాలో చేర్చాలని కోరింది. ఈలోగా ఈ కేసులో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయో సుప్రీం కోర్టు పర్యవేక్షిస్తూ వుంటుందని అధికారులు తెలుసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6తో ప్రారంభమయ్యే వారంలో కమిటీ పిటిషన్‌ను విచారణకు చేర్చాలని సీజేఐ ఆదేశించారు.

## తప్పుడు వార్తలపై కేరళ సిపిఎం లీగల్ నోటీసు

తిరువనంతపురం : ఎస్‌డిపిఐ మద్దతుతో రాష్ట్రంలోని నాలుగు స్థానిక ప్రభుత్వ సంస్థల్లో ఎల్‌డిఎఫ్ అధికారంలో ఉందని తప్పుడు వార్తను ప్రచురించిన మలయాళ మనోరమ దినపత్రికకు కేరళ సిపిఎం లీగల్ నోటీసు పంపింది. మలయాళ మనోరమ కంపెనీ, ప్రింటర్ అండ్ పబ్లిషర్ జాకబ్ మాథ్యూ, చీఫ్ ఎడిటర్ మమ్మన్ మాథ్యూ, ఎడిటర్ ఫిలిప్ మాథ్యూ, మేనేజింగ్ ఎడిటర్ జాకబ్ మాథ్యూ, ఎడిటోరియల్ డైరెక్టర్ జోస్ పనచిప్పురంపై కేరళ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ లీగల్ నోటీసు పంపారు. తిరువనంతపురం నగరూర్ గ్రామ పంచాయతీ, పతనంతిట్ట మున్సిపాలిటీ, కొట్టంగల్ గ్రామ పంచాయతీ, నగరూర్‌లోని పాలక్కాడ్ ఒంగళ్లూరు గ్రామ పంచాయతీలలో సీపీఐ(ఎం) అధికారంలో ఉందని నవంబర్ 26న వార్తలు వచ్చాయి. నగరూరు, ఒంగళ్లూరులో ఎల్‌డీఎఫ్‌కు మెజారిటీ ఉంది. పతనంతిట్ట మున్సిపాలిటీలో ఇండిపెండెంట్లు ఎల్‌డిఎఫ్‌కు మద్దతు పలికారు. ఈ వాస్తవాలు, వివరాలపై స్పష్టత ఇవ్వకుండా మనోరమ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వార్తలు ఇచ్చిందని పేర్కొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## నరాల బలహీనతకు చెక్ పెట్టాలంటే జామ తినండి...



నరాల బలహీనత ఏర్పడటానికి చాలా రకాల కారణాలు ఉంటాయి.నరాలు పట్టుత్వం కోల్పోయి ఏ పని చేయలేరు నరాలు బలహీనంగా అయినప్పుడు శరీరం అంతా శక్తి విహీనంగా మారుతుంది. అలాగే ఏ పని చేయలేక చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. మానసికంగా కృంగిపోతూ ఉంటారు. ఇలాంటి నరాల బలహీనతకు చెక్ పెట్టాలంటే జామ పండు చాలా అద్భుతంగా పనిచేస్తుంది జామ పండు అంటే చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకూ చాలా ఇష్టంగా తింటారు. రోజుకి ఒక జామకాయ లేదా జామకాయ జ్యూస్ తాగితే వాటిలో ఉండే పోష కాలు నరాల బలహీనత కండరాల బలహీనత రెండింటిని దూరం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు కాబట్టి నరాల బలహీనత రోజుకు ఒక జామ పండు తింటే మంచిది అలాగే జామ పండు తింటే చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి డయాబెటిస్ ఉన్నవారు దోరగా ఉన్న జామ పండు తింటే రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటాయి. నిమ్మ కంటే జామ పండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది ఈ విషయం చాలా మందికి తెలియదు విటమిన్ సి కావాలి అంటే నిమ్మకాయల వెంట పరిగెడుతూ ఉంటారు కానీ జామపండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది ఈ విటమిన్ సి శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచడానికి సహాయపడుతుంది అంతే కాకుండా బరువు తగ్గటానికి సహాయం చేస్తుంది. చాలామంది పచ్చిగా ఉన్న జామకాయలు తింటూ ఉంటారు. అలా తినకూడదు దోరగా ఉన్న జామ కాయలు లేదా బాగా పండిన జామ కాయలు మాత్రమే తినాలి. పచ్చి జామకాయ తింటే వాటిలో ఉండే ఫాస్పరస్, ఆక్సాలిక్ ఆమ్లం కడుపునొప్పి ఇతర అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది కాబట్టి పచ్చి జామకాయ తినడం ఆరోగ్యానికి ప్రమాదమే.

## ప్లాస్టిక్ కప్‌లో టీ తాగుతున్నారా?



ఇప్పుడు ప్రపంచం మొత్తం ప్లాస్టిక్ మీద ఆధారపడి ఉంటుంది..ఎటువంటి వాటికి కొనాలన్నా , తీసుకోవాలని అన్నా కూడా ప్లాస్టిక్ బ్యాగులను వాడటం మామూలు అయిపోయింది. హోటల్ యాజమాన్యాలు అయితే తాగే నీళ్ళ నుంచి తినే వాటి వరకు అన్నిటినీ ప్లాస్టిక్ కవర్లలో సప్లై చేస్తుంటారు..కానీ ఇపుడు కాఫీని , టీ ను ప్లాస్టిక్ కప్ లలో తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా హాని కలుగుతుందని నిపుణులు అంటున్నారు .

. అయితే ప్లాస్టిక్ వాటిలో ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఎటువంటి హానీ కలుగుతుందో ఇప్పుడు చూద్దాం.. ఈ కప్స్ లోపల ఒక లైనింగ్ ఉంటుంది, ఈ లైనింగ్ ఈ కప్ ని వాటర్ ప్రూఫ్ చేస్తుంది. ఇది ఆరోగ్యానికి హాని చేయడమే కాదు, ఎన్విరాన్మెంట్ కి కూడా హాని చేస్తుంది, శరీరంలో కొన్ని రకాల హానికారక కెమికల్స్ ను కూడా విడుదల చేస్తాయి..ఈ కప్పులలో వేడి వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రయోజనాలు ఉన్నాయో పరిశోధనలు చేసి నిరూపించారు. 100 మిల్లీ లీటర్ల కప్పులలో వేడి నీరు పోసి పదిహేను నిమిషాలు ఉంచారు. ఆ తరువాత ఈ వేడి నీటిని ఒక స్ట్రాంగ్ మైక్రో స్కోప్ కింద పరీక్ష చేశారు. అప్పుడు ఒక్కొక్క కప్ లో సుమారుగా ఇరవై ఐదు వేల మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నట్లుగా కనుగొన్నారు. ఈ నీటిలో హాని కారక లోహాలైన జింక్, లెడ్, క్రోమియం కూడా ఉన్నట్లు కనుగొన్నారు. ఈ పరిశోధన చేసిన వారు చెప్పిన దాని ప్రకారం ఈ విషపదార్థాలు కప్ లోపల ఉన్న పొర విడిపోయినట్లు నిరిపించారు.. పార్టికిల్స్ ఒక మైక్రాన్ అంత పెద్దగా ఉన్నాయి. ఒక వ్యక్తి సుమారుగా రోజుకి మూడు సార్లు ఇలాంటి కప్ లో నుండి టీ, లేదా కాఫీ తాగితే ఆ వ్యక్తి ఒక రోజులో డెబ్బై ఐదు వేల చిన్న మైక్రో ప్లాస్టిక్ పార్టికల్స్ ని తీసుకున్నట్లు అవుతుంది.మైక్రో ప్లాస్టిక్స్ హాని కారక లోహాలైన పెలాడియం, క్రోమియం, కాడ్మియం వంటివి కలుస్తాయి. ఇవి రెగ్యులర్ గా లోపలికి వెళ్తుంటే కొంత కాలం తరువాత సీరియస్ హెల్త్ కాంప్లికేషన్స్ వస్తాయట..అందుకే ప్లాస్టిక్స్ కు చాలా దూరం ఉండాలని నిపుణులు అంటున్నారు.. ఇకమీద నుంచైనా ప్లాస్టిక్ ను దూరంగా ఉండటం మేలు..

## మంచి ఆహారం తినకపోతే...



మీరు తినే ఆహారంలో కూరగాయలు, ఆకు కూరలతో పాటూ ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్, పప్పులు, గింజల వంటివి కూడా ఉంటాయా? అలా ఉంటే మీకు బైపోలార్ డిజార్డర్ రాదు. అలాకాకుండా... ఎక్కువగా జంక్ ఫుడ్ తింటూ బ్యాలెన్సింగ్ డైట్ తినకపోతే అలాంటి వారికి ఈ మానసిక సమస్య వస్తోంది. బైపోలార్ డిజార్డర్‌ను ఇదివరకు మానిక్ డిప్రెషన్ అనేవారు. ఇది పని ఒత్తిడి ఎక్కువగా ఉండే వారికి వస్తూ ఉంటుంది. లేదంటే... ప్రేమించిన వాళ్లు దూరమైన, అయిన వాళ్లు చనిపోయినా, ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్నా, మత్తు పదార్థా లకు బానిసైనా అలాంటి వాళ్లు బైపోలార్ డిజార్డర్ లోకి జారుకుంటారు. ఓవైపు ఒత్తిడి, మరో వైపు కుంగుబాటు తనం రెండూ ఒకే సమయం లో వచ్చే వారికి ఈ బైపోలార్ డిజార్డర్ వస్తుంది. ఇది వచ్చినవాళ్లు తాము ఒంటరైపోయినట్టు ఫీలవుతారు. తమకు ఈ ప్రపంచంతో సంబంధం లేదన్నట్టు భావిస్తారు. చీకట్లో కూర్చొని కుమిలిపోతారు. ఒక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటారు. చేసుకుంటున్నవాళ్లూ ఉన్నారు. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ డిజార్డర్ వచ్చి ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఈ సమస్య ఉన్న వాళ్లు దీన్ని పోగొట్టుకోవాలి. అలాగే లేనివాళ్లు ఇది రాకుండా చేసుకోవాలి. ఇందుకు మంచి ఆహారం తినడమే సరైన మందు అంటున్నారు డాక్టర్లు. మంచి ఆహారం తీసుకునే వారికి ఈ మానసిక సమస్య రాదని తేల్చారు. ఈ సమస్య ఉన్న వారికి ప్రస్తుతం న్యూట్రాస్యూటికల్ ట్రీట్‌మెంట్ అనేది చేస్తున్నారు. అధిక బరువు ఉన్న వారు కూడా జాగ్రత్త పడాలి. ఎందుకంటే... ఈ సమస్య వచ్చిన వారిలో చాలా మంది అధిక బరువు కలిగివుంటున్నారంట. మన శరీరానికి ఏ గాయమో అయితే వెంటనే తగ్గించగలరు గానీ... మానసిక సమస్యలు, డిజార్డర్ల వంటివి ఉంటే మాత్రం వెంటనే తగ్గించలేరు. ముఖ్యంగా బైపోలార్ డిజార్డర్ ఉన్నవారు ఒంటరితనాన్ని వదిలేయాలి. ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వాళ్లతో మాట్లాడాలి. ఏదేదో అనుకుంటూ అదే పనిగా ఫీలవ్వడం మానేసి తమకు ఇష్టమైన ఇతర పనుల్లోకి జారుకోవాలి. ఇలా చేయడం వల్ల ఒంటరి ఆలోచనలకు దూరం కావొచ్చు. రోజూ వ్యాయామం, వాకింగ్ వంటివి చెయ్యాలి. అదే సమయంలో మంచి ఆహారం తీసుకుంటే... మెదడు, శరీరం అన్నీ చక్కగా చురుగ్గా ఉంటూ బైపోలార్ డిజార్డర్‌ను దూరం చేస్తాయి.

## రోజూ గుప్పెడు వాల్‌నట్స్‌తో గుండె సమస్యలు దూరం

వాల్‌నట్స్ నిజానికి ఇతర నట్స్ లా అంత రుచికరంగా ఉండవు. అందువల్ల వీటిని చాలా మంది తినేందుకు ఇష్టపడరు. కానీ సైంటిస్టులు చెబుతున్న ఓ విషయం తెలిస్తే మీరు రోజూ వాల్ నట్స్ ను కచ్చితంగా తింటారు. అదేమిటంటే.. నిత్యం గుప్పెడు వాల్ నట్స్ ను తినడం వల్ల గుండె జబ్బులు రావని వారు తెలిపారు. ఈ మేరకు వారు తాజాగా ఓ పరిశోధన చేపట్టారు. హాస్పిటల్ క్లినిక్ ఆఫ్ బార్సిలోనా, లోమా లిండా యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు 600 మందిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూపు వారికి నిత్యం 30 నుంచి 60 గ్రాముల వరకు వాల్‌నట్స్ ను తినమని చెప్పారు. మరొక గ్రూప్ వారికి వాల్ నట్స్‌ను తినవద్దని సూచించారు. 2 ఏళ్ల పాటు సుదీర్ఘంగా వారిని పరిశీలించారు. ఈ క్రమంలో సైంటిస్టులు గుర్తించిందేమిటంటే.. నిత్యం వాల్ నట్స్ ను తిన్నవారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని తేల్చారు. వాల్‌నట్స్‌లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఆల్ఫా లినోలినిక్ యాసిడ్ తదితర పోషక పదార్థాలు గుండె జబ్బులు రాకుండా చూస్తాయని నిర్ధారించారు. అందువల్ల నిత్యం గుప్పెడు వాల్ నట్స్ ను తినడం వల్ల గుండె జబ్బులు రావని సైంటిస్టులు చెబుతున్నారు.

## చేపలు ఆరోగ్యానికి ఎంత మంచివో తెలుసుకోండి..!

### -గుండె జబ్బులు మటు మాయం...!!

చేపల కూర గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చేప కూర వాసన కె నోట్లో నీళ్లూరుతాయి. అంతలా గుమ గుమ లాడిపోతుంది చేప కూర.చేపలు కూర అంటే చాలు.. మాంసాహారులు లొట్టలేసుకుని మరి ఫుల్ గా లాగించేస్తారు. చాలామంది మాంసం తినడం కంటే చేపలను తినడానికే ఎక్కువ ఇష్టపడతారు. మరి,

చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదేనా? దీనిపై తాజా పరిశోధనలో తేలిన ఈ ఆసక్తికర విషయాలు గురించి తెలిస్తే.. మీరు తప్పకుండా ఆశ్చర్యపోతారు. మరి ఆ ఆసక్తికరమైన విషయాలు ఏంటో ఇండియా హెరాల్డ్ అందిస్తున్న ఈ ఆర్టికల్ లో చదవండి... చేపలు గుండె జబ్బు వున్న వాళ్ళు తింటే వాళ్ళ ఆరోగ్యానికి చాలా మంచిదని పరిశోధనలో వెల్లడయింది. చేపలు తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ నిర్వహించిన ఓ అధ్యయంలో తేలింది.



మాలిక్యులార్ న్యూట్రిషన్ అండ్ ఫుడ్ రిసెర్చ్, న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ జర్నల్స్‌లోనూ ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించడం జరిగింది. చేపలను తినడం వల్ల గుండె జబ్బులు దూరమవుతాయని ఆయా కథనాల్లో స్పష్టంగా పేర్కొనటం జరిగింది...

చేపల్లో చాలా రకాలు ఉంటాయి. అయితే, మీరు ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే మాకరెల్, సాల్మన్, హెర్రింగ్, లేక్ ట్రౌట్, సార్డిన్స్, అల్బాకోర్ ట్యూనా రకానికి చెందిన చేపలను తీసుకుంటే మంచిదని నిపుణులు తెలుపుతున్నారు.

అలాగే.. వారంలో కనీసం రెండుసార్లు చేపలను తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందట.

లేదా వారానికి కనీసం 100 గ్రాముల వరకు ఉడకబెట్టిన, లేదా వేయించిన చేపలను తినడం ఉత్తమం.శరీరంలోని చెడు కొవ్వులను బయటకు పంపేసే ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు చేపల్లో సమృద్ధిగా ఉంటాయట. దీని వల్ల శరీరంలో కొవ్వు అతిగా పేరుకుపోదు. దీంతో రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే పరిస్థితులు తగ్గుముఖం పడతాయి. ఫలితంగా గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉండదు.

## భుక్తిముక్తులనిచ్చే అపూర్వ ధామం కాళేశ్వరం

కార్తీకమాసంలో ప్రతిరోజూ పర్వదినమే. అయితే ఈ మాసం నెలరోజులు చేసే పూజలన్నింటి కంటే కార్తీక పౌర్ణమి నాటి పూజకు ఫలితం అధికమంటారు. అగ్నితత్త్వ మాసమైన కార్తీకంలో వచ్చే పౌర్ణమికి చంద్రుని విశేషంగా ఆరాధించాలని మన పూర్వులు చెబుతారు. చంద్రుని కొలవడంలో మానసిక చైతన్యం, కుటుంబ శ్రేయస్సు, భార్యాభర్తల మధ్య సఖ్యత, సంతాన సౌభాగ్యం కలిగి ప్రశాంతత ఏర్పడుతుంది. ఈ మాసంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. భక్తి శ్రద్ధలతో భక్తులు పలు శైవ క్షేత్రాలను దర్శించుకుంటారు. కాళేశ్వర మహాక్షేత్రం ముక్తీశ్వర సమన్వితం కాళేశ్వరో మహాదేవో భుక్తిం ముక్తిం ప్రదాస్యతి!! అంటూ భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పిలుచుకునే దేవుడు పరమ శివుడు. బోళా శంకరుడిగా, ఆదియోగిగా పూజలందు కుంటున్న ఈ స్వామి కాళేశ్వర ముక్తీశ్వర నామధేయంతో కొలువుదీరిన అపురూప ధామం కాళేశ్వరం. కరీంనగర్ జిల్లా మహదేవ్ పూర్ మండలంలో గోదావరి, ప్రాణహిత నదులు అంతర్వాహినిగా సరస్వతీ నది ప్రవహిస్తున్న త్రివేణీ సంగమ ప్రదేశంలో స్వయంభువుగా వెలసిన స్వామి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి సోయగాల మధ్య అలరారుతున్న అతి పురాతనమైన ఈ ఆలయం ఒకప్పుడు అరణ్యంలో ఉండటం వల్ల రవాణా సౌకర్యం ఉండేదికాదు. అయితే 1976?82 సంవత్సరాల మధ్య కాలం లో ఆలయ జీర్ణోద్ధరణ పనులు జరగడంతో రవాణా వసతి సౌకర్యాలు మెరుగుపడ్డాయి. విశాలమైన ప్రాంగణంలో అలరారుతున్న ఈ దివ్యాలయం నాలుగు వైపుల నాలుగు నంది మూర్తులు దర్శనమిస్తాయి. ఇతర ఆలయాలకు మల్లే కాకుండా ఇక్కడ గర్భాలయంలో ఒకే పానమట్టం మీద రెండు లింగాలు ఉండటమే కాక ముక్తీశ్వర స్వామికి రెండు నాసికా రంధ్రాలుంటాయి. ఈ రంధ్రాలలో అభిషేక జలం ఎంత పోసినప్పటికీ ఒక్కచుక్క కూడా బయటకు రాకుండా భూమార్గం గుండా ప్రవహించి, సరస్వతీ నది రూపంలో గోదావరి ప్రాణహిత నదుల సంగమంలో కలుస్తుందని ఆలయ చరిత్ర చెబుతోంది.

గర్భాలయంలో ఉన్న రెండు లింగాలలో ఒకటి కాళేశ్వర లింగం కాగా, రెండవది ముక్తీశ్వర లింగంగా చెబుతారు. కాళేశ్వర లింగాన్ని యమధర్మరాజు ప్రతిష్టించాడు. మహాశివుడు యమధర్మరాజుకిచ్చిన వరం కారణంగా, ఈ ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కాళేశ్వరలింగాన్ని దర్శించి అనంతరం ముక్తీశ్వర లింగాన్ని దర్శించాలన్న నియమం ఉంది. ఈ ఆలయం ఏటా మహాశివ రాత్రి ఉత్సవాలతో సహా పండుగలు, పర్వదినాలు, కార్తీక మాసాలలో భక్తులతో పోటెత్తుతుంది. ఆయా రోజుల్లో స్వామి వార్లకు మహాన్యాసక రుద్రాభిషేకాలు, అర్చనాది అభిషేకాలు ఘనంగా నిర్వహిస్తారు.



ఇక్కడ పార్వతీమాత శుభానంద దేవిగా కొలుపులందుకుంటోంది. ఇదే ఆలయ ప్రాంగణంలో మరో పక్క మహాసరస్వతి ఆలయం ఉంది. ఇక్కడ అమ్మవారు ప్రౌఢసరస్వతిగా నీరాజనాలందుకుంటోంది.ఆలయంలో మరో పక్క ప్రధాన ద్వారానికి ముందు భాగంలో సూర్య దేవాలయం ఉంది. ఇంకోపక్క విజయ గణపతి కొలువుదీరాడు. విశాలమైన ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఆలయానికి ముందు భాగంలో కోనేరు ఒకటి ఉంది. ఈ కోనేరులో స్నానమాచరించిన వారికి కాశీలోని మణికర్ణికా ఘాట్‌లో స్నానమాడిన ఫలితం దక్కుతుందంటారు. ప్రధానాలయ ఆవరణలో యమకోణం ఉంది. ఈ ప్రాంగణంలోనే యముడు తపస్సు చేసినట్లు చెబుతారు. ఈ యమకోణ ప్రవేశం చేసే వారికి యమ బాధలుండవని, ముక్తికలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్ల ఆలయానికి ఒక కిలోమీటరు దూరంలో ఆది ముక్తీశ్వర స్వామి ఆలయం ఉంది. ఆది ముక్తీశ్వర స్వామి దర్శనం సర్వపాపహరణం. కాశీలో మరణిస్తే కైలాసప్రాప్తి కలుగుతుందని చెబుతారు. కాని ఈ క్షేత్రంలో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరుని దర్శిస్తేనే కైలాస ప్రాప్తి కలుగుతుందన్నది స్థలపురాణం.

## పాత వాటిని పదిలపరచుకోండిలా...

కరోనా వైరస్‌కు చలికాలంలో ఆటలు ఆడటమంటే సరదా! ఎండాకాలంలో ఎండకు కరిగిపోతాననే భయం ఉంటేనే అంత మందిని బలి తీసుకున్నది. మరి ఇప్పుడు దానికి అనుకూలమైన కాలం. చలిలో చక్కగా మనుగడ సాగించగలదు. కాబట్టి మనం ఇంతకు ముందుకన్నా జాగ్రత్తగా ఉండాలి. చాపకింద నీరులా, నివురు గప్పిన నిప్పులా సమయం కోసం వేచి చూస్తున్నది కరోనా వైరస్. సెకండ్ వేవ్‌తో కొన్ని దేశాలు ఇప్పటికే విలవిల లాడుతున్నాయి. మళ్ళీ లాక్‌డౌన్‌కు వెళ్ళాల్సి వచ్చేలా ఉందని ఆలోచిస్తున్నాయి. మన దేశానికి కూడా ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే స్వీయ సంరక్షణా చర్యలు పాటించాలి. గత నెలలో వైరస్ ప్రభావం తగ్గుముఖం పట్టిందనే వార్తలు వచ్చిన నేపథ్యంలో చాలామంది మాస్కులు, భౌతిక దూరాలను తుంగలో తొక్కేశారు. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో కరోనా ప్రభావం ఎక్కువగా ఉంటుందనీ, తద్వారా మరణాల శాతం పెరగవచ్చని శాస్త్రవేత్తల అంచనా. అగ్రదేశాలు పడుతున్న సమస్యల్ని చూసైనా మనం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. అప్రమత్తతగా వ్యవహరించకపోతే ప్రమాదం వైపు పరుగులు పెట్టినట్టే అవుతుంది. కాబట్టి మాస్కుల ధారణ, శానిటైజర్, భౌతిక దూరం వంటికి కచ్చితంగా పాటించాలి.ఇపుడు అందరూ ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు కదా! అమెజాన్, ఫ్లిప్‌కార్డులలో వస్తువులు నేరుగా ఇంటికే వస్తున్నాయి. ఆ వస్తువులను పగిలిపోకుండా, డ్యామేజీ కాకుండా తగు జాగ్రత్తలతో అట్టల ప్యాకింగులతో సులభంగా ఇంటికి చేరవేస్తున్నారు. ఆ అట్టలు గట్టిగా చక్కగా ఉంటాయి. అలాంటి అట్టల్ని బొమ్మలకు వాడుకోవచ్చు. ప్రస్తుతం నేను తయారు చేసింది మాత్రం గట్టిగా ఉన్న పెండ్లి శుభలేఖను. ఈ అట్టను మౌస్ ప్యాడ్‌గా వాడుతున్నాను. అలాంటి గట్టి అట్టమీద ఒక రంగు పేపర్ అతికించాలి. నేను ఒక పాప బొమ్మను వేసుకున్నాను. దానికి రంగులు వేశాను. ఈ పాప బొమ్మను గట్టి అట్టపై అతికించాను. మౌస్‌ప్యాడ్ అందంగా తయారైంది. ఇలా మన చేతితో వేసిన రంగుల చిత్రంతో మౌస్ ప్యాడ్ అందంగా తయారైంది. మరి వెరైటీగా మౌస్‌ప్యాడ్ ఎంత అందంగా ఉందో చూశారా!మొదటగా రంగు రంగుల పాత గుండీలను సేకరించాను. ఈ కాలంలో ప్రతి ఇంట్లోనూ ఎన్నో రకాల డ్రెస్సులు మూలబడి ఉంటు న్నాయి. అలాంటి పాత బట్టలకున్న రంగు రంగుల, చిన్నా పెద్దా గుండీలను కత్తిరించి దాచుకుంటే అవసరానికి బొమ్మలకు పని కొస్తాయి. నేను కరోనా కాలంలో ఐదవ విడత లాక్‌డౌన్ విధించి నపుడు ఈ బొమ్మను తయారు చేశాను. నేను మొదటగా గుండీలతో ఒక ఇల్లు ఆకారాన్ని అమర్చాను. ఫెవికాల్‌తో గుండీలను అట్టమీద ఇంటి ఆకారంలో అతికించాను. ఇంటి మధ్యలో ఒక తాళాన్ని పెట్టాను. లాక్‌డౌన్ అంటే ఇంట్లో ఉండాలనే కదా అర్థం. అందుకే ఇంటికి తాళం వేశాను. తర్వాత పక్కనే ఐదు అని రాశాను. రాయడమంటే గుండీలతో 5 అకారంలో అతికించటం. ఈ ఇంటి చుట్టూ పూలను పెట్టాను. ఇల్లంటే కొన్ని పూల మొక్కలుండాలి కదా! అందుకే పూలను పెట్టాను. మొత్తంగా లాక్‌డౌన్ చిత్రం తయారైంది.మొదట రాఖీల బాక్సులు అవసరం పడలేదు నాకు. నేను వాటర్ యాంపుల్స్‌తోనే బొమ్మలు చెయ్యాలనుకున్నాను. ఎందుకంటే అప్పుడు నేను బాటిల్స్ మీద ఆర్ట్ వేస్తున్నాను. మంచి నీళ్ళు, మంచి నూనెల సీసాలతో పాటు సెలైన్ సీసాలూ ఆర్ట్ కోసం ఉపయోగించాను. ఇంకా ఇంజక్షన్ బుడ్లు కూడా అలంకారంలో భాగంగా వినియోగించాను. ఇంకా చిన్నవి ఏవైనా ఉన్నాయా అని వెతుక్కుంటున్నపుడు ఈ వాటర్ యాంపుల్స్ నా దృష్టికొచ్చాయి. వాటర్ యాంపుల్ అంటే ఇంజక్షన్ చేయాల్సిన మందుపొడిలోకి నీళ్ళను కలపటానికి వాడే చిన్న ప్లాస్టిక్ బాటిల్ లాంటిది. నేను దీనికి బాటిల్ హౌదానిచ్చి అలంకారం చేశాను. బాటిల్ ఆర్ట్‌లో భాగంగా వీటన్నింటినీ పెయింట్ చేశాను. ఇప్పుడు ఈ బుజ్జి బాటిళ్ళను ఎలా సేఫ్టీగా పెట్టాలా అని ఆలోచించినపుడు మాత్రమే నాకీ రాఖీల బాక్సులు కనిపించాయి. నేను ఈ బాక్సుల్ని తీసుకొని ఒక్కొక్క బాక్సులో రెండు రెండు బాటిళ్ళను పెట్టాను. అలా చూస్తే ఫ్రిజ్‌లో పెట్టిన బాటిల్స్‌కు మినియేచర్ రూపాల్లా అనిపించాయి. గ్లాస్‌డోర్లలో ఉన్న అందమైన బాటిల్స్ ముద్దుగా కనిపిస్తున్నాయి. ఇంకా ఎలా కనిపించాయంటే – రిలయన్స్, డి–మార్ట్ లాంటి ప్రొవిజనల్ స్టోర్స్‌లో కూల్‌డ్రింగ్ బాటిల్స్ అన్నీ ఒక బీరువాలాంటి షెల్ఫ్‌లో ఉంటాయి. అలా కనిపించింది దీన్ని చూస్తున్నపుడు.

బైక్ ఏదో చిన్న రిపేర్ వచ్చిందని మా అబ్బాయి రిపేరు షాపుకు వెళ్ళాడు. అక్కడ అతను రిపేరు చేస్తుండగా చిన్న కాఫీ గ్లాసులాంటి ఇనుప ఆకారం ఒకటి అక్కడ పడి ఉండటం చూశాడు. షాపు అతన్ని అడగగా పనికి రానిదని చెప్పగానే దాన్ని ఇంటికి తెచ్చాడు. లోతుగా గుంటలా ఉన్నది. పైనున్న భాగం కోసుకునేలా లేకుండా నున్నగా ఉన్నది. కింది వైపు కొద్దిగా స్టాండువలె ఉన్నది. కాబట్టి ఎక్కడ నిలబెట్టినా నిలబడేలా ఉన్నది. వెంటనే దానికి నల్ల రంగును వేశాను. దాని తర్వాత బంగారు రంగుతో బార్డర్లు వేశాను. అడుగున ఉండే బేస్‌కూ బంగారు రంగు వేశాను. మధ్యలో భాగానికి ఎరుపు రంగును వేసి దానిపై తెలుపు రంగు చుక్కల్ని పెట్టాను. ఇదంతా చేసే సరికి చాలా చక్కగా కనిపించింది. ఇంత చక్కగా ఉన్న దీనిలో ఏం పెట్టుకోవచ్చా అని ఆలోచించగా టూత్‌పిక్స్ పెట్టుకోవడానికి బాగుంటుందనిపించింది. చక్కని అలంకారం ఉన్న టూత్‌పిక్ హౌల్డర్ తయారయింది.డెయిరీ మిల్క్ చాక్లెట్లు, జెమ్స్ అన్నీ కలిపి ఒక బాక్సులో ప్యాక్ అయి వస్తాయి. ఇంకా అమెరికా, లండన్‌ల నుంచి వచ్చే చుట్టాలు ఇండియాలో ఉన్న బంధువుల కోసం గిఫ్ట్‌లుగా చాక్లెట్లే తెస్తుంటారు. చాక్లెట్ల రుచి ఏమోగానీ నాకు చాక్లెట్ ప్యాక్‌లే నోరూరిస్తుంటాయి. బంగారు రంగు, కాఫీ రంగులతో చాక్లెట్లు పెట్టే గుంటలతో రకరకాల ఆకారాలతో ఆకర్షణీయంగా ఉంటాయి. త్వరగా చాక్లెట్లు ఎవరికో ఒకరికి ఇచ్చేసి మిగిలిన ట్రేలు దాచుకుంటాను. ఈ ట్రేలతో చాలా బొమ్మలు చేశాను. మీకూ్కడా చూపించాను. ఈ సారి కొద్ది వెరైటీగా చేద్దాం. ఇది చాలా చిన్న చాక్లెట్ బాక్స్. నాలుగు అరలు మాత్రమే ఉన్నాయి. ఇందులో నాలుగు జెమ్స్ ప్యాకెట్లే వచ్చాయి. ఈ బాక్స్‌లోని నాలుగు అరల్లో నలుగురు మనుషుల్ని నిలబెట్టాను. గది కొకరిని కాపలాగా పెట్టాను. మనుషులు ఎలా వచ్చారు? గుండె జబ్బులకు వాడే టాబ్లెట్ల డబ్బాలలో ఇలాంటి ప్లాస్టిక్ మూతలుంటాయి. అవి పింక్ రంగులో చాలా ముచ్చటగా ఉంటాయి. వాటికి కండ్లు, ముక్కు, నోరు పెట్టి మనుషులుగా ప్రాణ ప్రతిష్ట చేశాను. మరి ఈ ప్లాస్టిక్ మనుషులు చాక్లెట్ అరల్లో చాక్లెట్లు దొంగిలించ కుండా కాపలా ఉన్నారు.



# సినిమా






## రాంచరణ్ గేమ్ ఛేంజర్ ప్లాన్ అదిరింది

స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్ బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనుండగా.. ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది శంకర్ టీం. గేమ్‌ఛేంజర్ నుంచి తాజాగా లాంచ్ చేసిన మూడో సాంగ్ నానా హైరానా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ కలర్‌ఫుల్‌గా సాగుతూ విజువల్ ట్రీట్ పక్కా అని చెబుతోంది. మరోవైపు ఇప్పటికే రిలీజ్ చేసిన రా మచ్చ, జరగండి జరగండి సాంగ్‌కు నెట్టింట మంచి స్పందన వస్తోంది. అప్పుడే నాలుగో పాట విడుదలతోపాటు ట్రైలర్ అప్‌డేట్‌కు సంబంధించిన వార్త అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం నాలుగో సింగిల్ డిసెంబర్ రెండోవారంలో రాబోతుంది. జనవరి మొదటివారంలో ట్రైలర్‌ను లాంచ్ చేయబోతున్నారు. నాలుగో పాట రాంచరణ్, అంజలి కాంబినేషన్‌లో వచ్చే మెలోడీ సాంగ్ అని తెలుస్తుండగా.. ఇది ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో రాబోతుందట. అయితే మేకర్స్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తుండగా..ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



## వరల్డ్ వైడ్‌గా 12000 వేల స్క్రీన్స్

### బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ మూవీగా 'పుష్ప-2'

మరో 06 రోజుల్లో పుష్ప 2 సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఎప్పుడెప్పుడా అని బన్నీ అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్‌లో అదరగొడుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే అన్ని భాషల్లో కలిపి ప్రీ రిలీజ్ బిజినెస్ రూ.1000 కోట్లకు పైగా జరిగినట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం విడుదల పరంగా మరో రికార్డును నమోదు చేయబోతుంది. ఈ సినిమా విడుదలకు సంబంధించి వరల్డ్ వైడ్‌గా మొత్తం ఆరు భాషల్లో కలిపి 12000 వేలకు పైగా స్క్రీన్స్‌లో విడుదల కాబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. దీంతో ఇప్పటివరకు రాజమౌళి ఆర్‌ఆర్‌ఆర్ పేరిటా ఉన్న ఈ రికార్డు బద్దలవ్వనుంది. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం 10200 లకు పైగా స్క్రీన్స్‌లో విడుదల అయ్యింది. ఇప్పటివరకు ఇండియన్ సినిమాలలో బిగ్గెస్ట్ రిలీజ్ అయిన చిత్రం ఇదే. అయితే ఈ రికార్డును పుష్ప అధిగమించబోతుంది. ఓవర్సీస్‌లో 5500 వేల స్క్రీన్స్, ఇండియాలో 6500 స్క్రీన్స్‌లో కలిపి మొత్తం 12000 స్క్రీన్స్‌లో పుష్ప 2 విడుదల కాబోతున్నట్లు సమాచారం.

## గెట్ రెడీ.. డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్న త్రిష

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న స్టార్ హీరోయిన్లలో టాప్‌లో ఉంటుంది చెన్నై సోయగం త్రిష ఈ భామ ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో లీడింగ్ హీరోలతో సినిమాలు చేస్తోంది. త్రిష ఖాతాలో అజిత్ కుమార్ నటిస్తోన్న విదాముయార్చి, చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర సినిమాలున్నాయి. దీంతోపాటు మాలీవుడ్ యాక్టర్ టొవినో థామస్ నటిస్తోన్న ప్రాజెక్ట్ కూడా ఉంది. కాగా 2025 జనవరిలో త్రిష అభిమానులు, ఫాలోవర్లకు డబుల్ ట్రీట్ ఇవ్వబోతుందన్న వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. విదాముయార్చి 2025 పొంగళ్ కానుకగా రాబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు టొవినో థామస్ సినిమా కూడా జనవరిలోనే రాబోతుంది. టొవినో థామస్‌తో చేస్తున్న ఐడెంటిటీ మలయాళంలో త్రిష రెండో ప్రాజెక్ట్. ఈ రెండు సినిమాల విడుదల తేదీలపై క్లారిటీ రావాల్సి ఉండగా.. తాజా వార్తల ప్రకారం ఒకేసారి త్రిష డబుల్ ట్రీట్ ఇవ్వబోతుండటం ఖాయమైనట్టే. ఈ లెక్కన త్రిష అభిమానులకు మాత్రం పండగే అని చెప్పాలి. మరోవైపు మోహన్ లాల్‌తో రామ్, అజిత్ కుమార్-అధిక్ రవిచంద్రన్ గుడ్ బ్యాడ్ అగ్లీ ప్రాజెక్ట్, మణిరత్నం-కమల్ హాసన్ థగ్ లైఫ్ సినిమాలు కూడా త్రిష లైన్‌లో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన విదాముయార్చి టీజర్‌కు మంచి స్పందన వస్తోంది.



## ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ టైటిల్ అనౌన్స్‌మెంట్‌కి ముహూర్తం ఫిక్స్..!

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది దేవర సినిమాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్నాడు తారక్. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా వరల్డ్ వైడ్‌గా రూ.500 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా అనంతరం కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో తారక్ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. NTRNeel గా రానున్న ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం డిసెంబర్‌లో షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి తారక్ ఈ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను సంక్రాంతి కానుకగా 2025 జనవరిలో రాబోతోందని తెలుస్తోంది. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ ని అనుకుంటున్నారని టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. మరి మేకర్స్ ప్రచారం జరుగుతున్నట్టుగా ఇదే టైటిల్ ను ఫిక్స్ చేశారా? లేదంటే మరేదైనా కొత్త టైటిల్ ని పెట్టబోతున్నారా? అనే విషయం తెలియాలంటే సంక్రాంతి వరకు ఆగాల్సిందే. మరోవైపు ఈ మూవీలో 'సప్త సాగరాలు దాటి' చిత్రం హీరోయిన్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే ఈ మూవీని ఒకటే పార్ట్‌లో ఫినిష్ చేయనున్నట్లు తెలుస్తుంది.





## రెడీ ఫర్ యాక్షన్

### ట్రెండింగ్‌లో నందమూరి మోక్షజ్ఞ నయా లుక్

టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ ను గ్రాండ్‌గా లాంచ్ చేస్తున్నాడని తెలిసిందే. SimbaisComing అంటూ ఇప్పటికే మోక్షజ్ఞ జీన్స్ అండ్ బ్లాక్ హుడీ వేసుకొని సూపర్ చామింగ్ లుక్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రీ లుక్ షేర్ చేయగా.. మోక్షజ్ఞను ప్రశాంత్ వర్మ ఎలా చూపించబోతున్నాడో హింట్ ఇచ్చేస్తూ.. రిలీజ్ చేసిన స్టైలిష్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. చాలా రోజుల తర్వాత మరో క్రేజీ లుక్‌ను షేర్ చేశారు మేకర్స్. థిక్ హెయిర్ గెటప్‌లో మ్యాచింగ్ మీసం, గడ్డంతో సూపర్ కూల్‌గా కనిపిస్తూ యాక్షన్‌కు రెడీ అంటూ చెప్పకనే చెబుతున్నాడు మోక్షజ్ఞ. ఈ స్టిల్ నెట్టింట హల్ చల్ చేస్తూ అభిమానులు, నందమూరి ఫాలోవర్లలో సూపర్ హైప్ క్రియేట్ చేస్తుంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రాబోతున్న ఈ సినిమాలో..డైరెక్టర్ ఇంతకీ మోక్షజ్ఞ కోసం ఎలాంటి సీన్లు రెడీ చేశాడు.. సిల్వర్ స్క్రీన్‌పై ఈ అప్‌కమింగ్ యాక్టర్‌తో ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడోనంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు సినీ జనాలు. మైథలాజికల్ కాన్సెప్ట్‌తో సినిమా రాబోతుందని వార్తలు వస్తుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నట్టు సమాచారం. ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై మేకర్స్ త్వరలోనే క్లారిటీ ఇవ్వబోతున్నారట.

# బంగ్లాలో హిందువులపై ఆగని దాడులు

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆ దేశంలో హిందువుల పై దాడులు కొనసాగుతున్నాయి. షేక్ హసీనాపై నిరసనలో భాగంగా అక్కడి హిందువులపై దుండగులు దాడిచేశారు. షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత కూడా దాడులు కొనసాగాయి. ఇక ఇప్పుడు ఇస్కార్‌పై నిసేధం విధించే కుట్ర జరుగుతోంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆగడం లేదు. ప్రజాస్వామ్య ప్రభుత్వం కూలిన తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వ పాలనలో హిందువులకు రక్షణ కరువైంది. తరచూ దుండగులు మైనారిటీలు అయిన హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. తాజాగా బంగాదేశ్‌లో ఇస్కాన్‌కు చెందిన చిన్మయ కృష్ణదాస్‌ను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్ జెండాను అవమానించారనే ఆరోపణలతో ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేశారు. దీనిపై హిందువులు భారీగా నిరసన తెలిపారు. ఈ క్రమంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్కాన్‌ను నిషేధించాలని బంగ్లాదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇస్కాన్ అసాంఘిక చర్యలకు పాల్పడుతోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ జరిపిన కోర్టు శాంతిభద్రతలపై నివేదిక ఇవ్వాలని కోరింది. ఉద్రిక్తతలు పెరగకుండా చూడాలని ఆదేశించింది. నెల క్రితం చిన్మయ్ కృష్ణదాస్ ఓ ర్యాలీలో బంగ్లాదేశ్ జెండాను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదులు కూడా అందాయి. దీంతో కృష్ణదాస్‌ను ఢాకా విమానాశ్రయంలోనే పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఆ దేశంలో మైనారిటీలపై దాడులు ఆగడం లేదు. తాజాగా ఇస్కార్ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. చిన్మయ్ కృష్ణదాస్ బంగాలదేశ్‌లోని ఇస్కాన్‌తోపాటు హిందువులకు ముఖ్యమైన వ్యక్తిగా మారారు.




ఆదేశంలో ఇస్కాన్ సంస్థ గురించి ప్రచారం చేశాడు. బంగ్లాదేశ్‌లో హిందువుల జనాభా తగ్గుతున్న సమయంలో హిందువుల గురించి హిందూ ధర్మం గురించి అవగాహన కల్పించేలా ఇస్కాన్ కృషి చేస్తోంది. ఇవీ తాత్కాలిక ప్రధాని మహ్మద్ యూనిస్‌కు నచ్చడం లేదు. దీంతో ఆయన ఇస్కాన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. దీనిని నిషేధించాలని భావిస్తున్నారు. ఇస్కాన్ అనేది శ్రీకృష్ణుడి గురించి ప్రజలకు అవగాహన కల్పించే సంస్థ. భగవద్గీత సందేశాన్ని ఇంటింటికీ తీసుకెళ్లేందుకు కృషి చేస్తోంది. స్వామి శ్రీల ప్రభుపాద ఈ ఇస్కాన్ సంస్థను 1966 జూలై 11న స్థాపించారు. ఈ ఇస్కాన్‌ను ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇది హరేకృష్ణ హరేరామ ఆలయంగా సాధారణ ప్రజల్లో గుర్తింపు పొందింది. ఇస్కాన్ ఆలయాలో భారత్‌తోపాటు అమెరికా, రష్యా, బ్రిటన్, పాకిస్తాన్‌లో కూడా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 108 ఆలయాలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లోని ఢాకా, రాజ్‌షాహి, చిట్టగాంగ్, సిల్మెట్, రంగ్‌పూర్, ఖుల్నా, బరిషల్, మైమెన్‌సింగ్‌లలో ఇస్కాన్ ఆలయాలు ఉన్నాయి.

## చేతులారా చేసుకున్న ఉద్ధవ్ థాక్రే

# పనిచేయని సెంటిమెంట్

**సిద్ధాంతాలు గాలికి వదిలేసిన శివసేనాని**

**ముంబై :** ఉద్ధవ్ ఠాక్రేకు అసెంబ్లీ ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బ నిస్సందేహంగా జీర్ణించుకోవడం కష్టమే. అయితే నిలబడి కలబడుతూ భవిష్యత్తులో అధికారానికి తిరిగొస్తారా అన్నదే ఇప్పుడు క్లిష్టమైన మారింది. ముఖ్యమంత్రి పదవిపై వ్యామోహం ఉద్ధవ్ ఠాక్రే వర్తమానాన్ని అగ్యమగోచరంగా మార్చింది. ఉద్ధవ్ రాజకీయ గమనంలో ఎన్ని ఒడిదుడుకులు, తిరుగుబాట్లను ఎదుర్కొన్నా మళ్లీ నిలదొక్కుకున్నారు. కానీ 2019లో సైద్ధాంతికంగా బద్ధశత్రువులైన కాంగ్రెస్, ఎన్సీపీలతో జట్టు కట్టడం ఉద్ధవ్‌ను మెజారిటీ హిందువులకు దూరం చేసింది. హిందూ హృదయ సామ్రాట్‌గా జనం చేత పిలిపించుకున్న బాలా సాహెబ్ ఠాక్రే (బాల్ ఠాక్రే) నెలకొల్పిన శివసేన' అతివాద హిందూ రాజకీయ పార్టీ అనడంలో సందేహం లేదు. హిందూత్వ భావజాలంతో రాజకీయాలు చేస్తున్న భారతీయ జనతా పార్టీ ని మించి హిందూత్వ వాదాన్ని శివసేన ప్రదర్శించేది. భావసారూప్యత కారణంగా ఈ రెండు పార్టీలు కలిసి అనేక సంవత్సరాలుగా ప్రయాణం సాగించగలిగాయి. కానీ ఉద్ధవ్ ఠాక్రే సెక్యులర్ ముగుసు తొడిగి మైనారిటీ మెప్పు పొందే రాజకీయ వైఖరిని ప్రదర్శించే కాంగ్రెస్, ఎన్సీపీలతో జట్టుకట్టడం తన రాజకీయ ప్రయాణానికి చరమగీతం పాడినట్టయింది. బాల్ ఠాక్రే హయాంలో మిలిటెంట్ హిందూత్వ పోరాట వైఖరి నుంచి సెక్యులర్ జోన్లోకి అడుగుపెట్టడం ఆ పార్టీ శ్రేణుల్ని జీర్ణించుకోలేకుండా చేసింది. అదే ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటుకు పూర్తి మద్ధతు లభించేలా చేసింది. నిజానికి 2019లోనే ప్రజాతీర్పు భారతీయ జనతా పార్టీ , శివసేనకూటమికి విజయాన్ని అందించింది. ఈ ఎన్నికల్లో 152 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 105 గెలుచుకుంది. 124 స్థానాల్లో పోటీ చేసిన శివసేన కేవలం 56 సీట్లను మాత్రమే గెలుచుకోగలింది. ఎక్కడైనా ఎక్కువ సీట్లు గెలుచుకున్న పార్టీకే ముఖ్యమంత్రి పదవి వరిస్తుంది. కానీ అందుకు భిన్నంగా నాటి శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే సీఎం పదవి తనకే ఇవ్వాలని పేచీ పెట్టారు. ఈ పేచీని కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ లు తమకు అనుకూలంగా మార్చుకుని, ఆ సీఎం పదవి తామే ఇస్తామని, తమతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఉద్ధవ్ ఠాక్రేకు ఆశజూపాయి. తనకు



ముఖ్యమంత్రి పదవే ముఖ్యం తప్ప పార్టీ సిద్ధాంతంతో పనేముంది అన్న చందంగా.. సైద్ధాంతికంగా పూర్తి భిన్న ధృవాలుగా ఉన్న పార్టీలతో ఉద్ధవ్ ఠాక్రే కలిసి 'మహా వికాస్ అఘాడీ' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మిత్రద్రోహానికి పాల్పడ్డ శివసేనకు బుద్ధి చెప్పాలనుకున్నారో.. లేక ఆర్థిక రాజధాని ముంబైపై పట్టుకోసమో.. మొత్తానికి బీజేపీ చేపట్టిన ఆపరేషన్‌తో శివసేన నిట్టనిలువుగా చీలిపోయింది. ఏకంగా 40 మంది ఎమ్మెల్యేలను చీల్చుకుని బయటికొచ్చిన ఏక్‌నాథ్ షిండేకు ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టిన కమలనాథులు.. ఆ తర్వాత ఎన్సీపీని సైతం చీల్చి అజిత్ పవార్‌కు ఉప ముఖ్యమంత్రి పదవినిచ్చి తమ సంకీర్ణ సర్కారును పటిష్టం చేసుకున్నారు. ఇదంతా అందరికీ తెలిసిన కథే. ఈ కథలో అసెంబ్లీ ఎన్నికలు ఊహించని మలుపులు తీసుకొచ్చాయి. ఎన్నికల ఫలితాల ముందు వరకు, మహా వికాస్ అఘాడి మెజారిటీ సాధిస్తే ముఖ్యమంత్రి పదవి తమకే దక్కాలంటూ శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం), కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా చర్చించుకున్నారు. వారొకటి తలిస్తే విధి మరొకటి తలచింది అన్నట్టుగా.. ముఖ్యమంత్రి పదవి కాదుకదా.. కనీసం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా సైతం దక్కని స్థితి నెలకొంది. ప్రతిపక్ష హోదాకు అవసరమైన కనీస సంఖ్య 29కి అఘాఢీ కూటమిలో ఏ ఒక్క పార్టీ చేరుకోలేకపోయింది. గుడ్డిలో మెల్ల నయం అన్న చందంగా ఆ కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తుందనుకున్న కాంగ్రెస్ కంటే శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) వర్గమే 20 స్థానాలు సాధించి పెద్ద పార్టీగా నిలిచింది. ఉద్ధవ్ రాజకీయ ప్రయాణం 2003లో శివసేన నాయకత్వాన్ని స్వీకరించినప్పటి నుంచి సంక్షోభాలను, సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగింది. ఆయన నాయకత్వాన్ని సవాల్ చేస్తూ తిరుగుబాట్లను సైతం ఎదుర్కొన్నారు. 2009లో రాజ్ ఠాక్రే విబేధించి 'మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన' పేరుతో వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆ పార్టీ శివసేనకు ముప్పుగా మారి 'కొత్త శివసేన'గా చలామణి అయింది. ఆ తర్వాత నారాయణ్ రాణే కూడా తిరుగుబాటు చేశారు. అయినా సరే నిలదొక్కుకున్న ఉద్ధవ్ ఠాక్రే.. 2022లో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన తిరుగుబాటుతో పార్టీ అసలు పేరు, ఎన్నికల గుర్తును కోల్పోవాల్సి వచ్చింది. అయినా సరే.. లోక్‌సభ ఎన్నికల్లో మంచి పనితీరు కనబర్చిన ఉద్ధవ్ ఠాక్రేకు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం పార్టీ ఉనికికే ప్రమాదం తెచ్చిపెట్టింది. ఏక్‌నాథ్ షిండే పార్టీని చీల్చి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని తనకు జరిగిన వెన్నుపోటుగా పేర్కొన్న ఉద్ధవ్ ఠాక్రే.. అదే అంశాన్ని పదే పదే ప్రస్తావిస్తూ ప్రజల్లో సానుభూతి పొందే ప్రయత్నం చేశారు. అలాగే తనకు ద్రోహం చేసిన ఏక్‌నాథ్ షిండేను, ఆయన వర్గం నేతలను దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సానుభూతి అస్త్రం కొంతమేర పనిచేసినా.. పదే పదే అదే అంశం ఆధారంగా ఓట్లు పొందడం సాధ్యం కాదని అసెంబ్లీ ఎన్నికలు నిరూపించాయి. షిండే సర్కారు మహారాష్ట్ర కంటే గుజరాత్‌కే (మోదీ–షా) ఎక్కువ అనుకూలం అంటూ చేసిన విమర్శల్ని సైతం ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. తాజా ఎన్నికల్లో ఓటమి తర్వాత తన విధేయులను నిలబెట్టుకోవడం ఉద్ధవ్‌కు మరో సవాలుగా మారింది. రాజకీయ నాయకులు సహజంగానే మంచి అవకాశాలు ఉన్న వర్గాల వైపు ఆకర్షితులవుతారు. పైగా వారు ఏ భావజాలాన్ని ఇష్టపడి వచ్చారో ఆ భావజాలం పార్టీలో కొరవడినప్పుడు, తమకు నచ్చిన భావజాలం కల్గిన ఇతర పార్టీల్లోకి ఫిరాయించేందుకే ఆసక్తి చూపుతారు. ఇప్పుడు శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) పార్టీ తరపున గెలిచిన 20 మందిని కాపాడుకోవడంతో పాటు పార్టీ శ్రేణుల్లో ఈ పరాజయభారాన్ని మర్చిపోయేలా రాజకీయ పోరాటాలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

## అరేబియా సముద్ర జలాల్లో 500 కిలోల డ్రగ్స్ స్వాధీనం

అరేబియా సముద్ర జలాల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. భారత్ – శ్రీలంక నౌకాదళాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రెండు పడవల్లో అక్రమంగా తరలిస్తున్న 500 కిలోల డ్రగ్స్‌ను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక జెండాతో కూడిన రెండు ఫిషింగ్ బోట్లలో అక్రమంగా తరలిస్తున్న డ్రగ్స్‌ను సీజ్ చేసినట్లు ఇండియన్ నేవీ తెలిపింది. నవంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించిన ఆపరేషన్‌లో 500 కిలోల క్రిస్టల్ మెత్ ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ బోట్లను గుర్తించేందుకు విస్తృత ఏరియల్ సెర్చ్ నిర్వహించినట్లు పేర్కొంది. డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న రెండు బోట్లను, అందులోని సిబ్బందితో పాటు సీజ్ చేసిన డ్రగ్స్‌ను శ్రీలంకకు అప్పగించినట్లు వెల్లడించింది.

## ప్రభుత్వ ఏర్పాటుపై సానుకూల చర్చలు..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడై వారం రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకూ సీఎం ఎవరన్న సందిగ్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఒకటి లేదా రెండు రోజుల్లో దీనిపై ప్రకటన వస్తుందని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తాజాగా వెల్లడించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన (ఏక్ నాథ్ షిండే), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లతో కూడిన మహాయుతి కూటమికి మెజారిటీ వచ్చినా సీఎం ఎవరన్న సంగతి తేలలేదు. సీఎం అభ్యర్థి ఖరారు విషయమై గురువారం దేశ రాజధానిలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ మిత్రపక్షాల భేటీ జరిగింది. ఈ భేటీ అనంతరం షిండే మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డాతో సానుకూల చర్చలు జరిగినట్లు తెలిపారు. సీఎం పదవిపై ఒకటి లేదా రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై ముంబైలో మరోసారి చర్చించిన అనంతరం నిర్ణయం ప్రకటించనున్నట్లు తెలిపారు. మిత్రపక్షాల మధ్య మంచి సమన్వయం ఉందన్నారు. త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కూటమిలోని బీజేపీకి 132 సీట్లు, షిండే సేనకు 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో అత్యధిక సీట్లు సాధించిన బీజేపీనే ఈసారి సీఎం పదవి చేపట్టబోతున్నట్లు



ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీసే మహా తదుపరి ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయమైనట్లు సమాచారం. ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం ఈ మేరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పాటు ఎన్డీఏ పక్షాలకు స్పష్టతనిచ్చినట్టు తెలుస్తున్నది. ఇక ముఖ్యమంత్రితోపాటు సగానికిపైగా మంత్రి పదవులను బీజేపీ తన వద్దే ఉంచుకోనున్నట్లు తెలిసింది. మహారాష్ట్రలో సీఎంతో సహా అత్యధికంగా 43 మంది మంత్రులను నియమించుకునే వీలుంటుంది. ఇందులో షిండే నేతృత్వంలోని శివసేనకు 12, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 9 మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇందులో షిండే వర్గానికి మూడు కీలక మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పట్టణాభివృద్ధి, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, జలవనరులు లభించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది.

## శబరిమల అయ్యప్ప మెట్లపై ఫోటో దిగిన 23 మంది పోలీసులకు శిక్ష ఏంటో తెలుసా?



**తిరువనంతపురం:** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న పవిత్రమైన 18 మెట్లపై 23 మంది పోలీసులు గ్రూప్ ఫోటో దిగిన ఘటనలో ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకున్నది. ఆ పోలీసులు తక్షణమే సత్ప్రవర్తన కోసం కఠినమైన శిక్షణ తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఏపీ క్యాంప్‌కు చెందిన పోలీసు ఆఫీసర్లు.. ఇప్పుడు కన్నూర్‌లోని కేఏపీ–4 క్యాంపునకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆ క్యాంపులో సత్ప్రవర్తన పొందేలా పోలీసులకు కఠిన శిక్షణ ఇవ్వనున్నారు. ఏడీజీపీ ఎస్ శ్రీజిత్ ఆదేశాల మేరకు శిక్షణ కొనసాగనున్నది. క్రమశిక్షణ చర్యల గురించి హైకోర్టుకు తెలియజేశారు. అయ్యప్ప సన్నిధానంలో మెట్లపై నిలుచుని ఫోటో దిగిన పోలీసులు తమ వెనుక భాగాన్ని దేవుడి వైపు ఉంచారు. దీని పట్ల వివాదం చెలరేగింది. సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో.. 23 మంది ఆఫీసర్లను శిక్షణ కోసం వెనక్కి రప్పించారు. సన్నిధానం స్పెషల్ ఆఫీసర్ నుంచి కూడాఏడీజీపీ రిపోర్టును కోరారు. 18 మెట్లపై పోలీసులు ఫోటోషూట్ చేయడాన్ని విశ్వ హిందూ పరిషత్ విమర్శించింది. అయ్యప్ప భక్తులు ఎవ్వరూ దేవుడికి వెన్ను చూపించరని పేర్కొన్నది. ఆలయ పవిత్రతను పోలీసులు దెబ్బతీసినట్లు వీహెచ్‌పీ ఆరోపించింది.

## ఎన్నికల ఫలితాలు ఓ సవాల్




**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినప్పటికీ ఆ తర్వాత జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో 'ఇండియా' కూటమి ఫలితాలు సాధించలేకపోవడం, భవిష్యత్ కార్యాచరణపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమీక్షించింది. నాలుగు రాష్ట్రాల్లో రెండు రాష్ట్రాల్లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడం పార్టీకి ఒక సవాలని శుక్రవారంనాడిక్కడ జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఎన్నికల ఫలితాల నుంచి తక్షణమే గుణపాఠం నేర్చుకోవాలని, పార్టీ బలహీనతలను సరిదిద్దుకోవాలని దిశానిర్దేశం చేశారు. వయనాడ్ లోక్‌సభ నుంచి విజయం సాధించిన ప్రియాంక గాంధీ, నాందేడు ఎంపీ రవీంద్ర వసంతరావు చహన్‌కు సీడబ్ల్యూసీ అభినందలు తెలిపింది. ఎన్నికల్లో ఐక్యంగా ఉంటేనే పార్టీ విజయాలను సాధిస్తుందని, పార్టీ బలంగా ఉంటేనే వ్యక్తులు బలంగా ఉంటారని ఖర్గే ఈ సందర్భంగా అన్నారు. సంస్థాగతంగా కింది స్థాయి నుంచి పార్టీని బలపోతంచేయాలని ఆయన అన్నారు. జాతీయ సమస్యలే కాకుండా, రాష్ట్ర స్థాయి సమస్యలను కూడా ఎజెండా తీసుకుని పార్టీ పోరాటం సాగించాలని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు అనే సమస్యలు ఉన్నాయని, కులగణన కూడా ఒక ముఖ్యమైన అంశమని అన్నారు. ఎన్నికలకు ఏడాదికి ముందే సన్నాహాలు చేసుకోవాలని, విజయాలకు నూతన పద్ధతులను అవలభించాయని ఖర్గే దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగాన్ని అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. సామాన్య ప్రజలకు రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించినది కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. ఎన్నికల ప్రక్రియల ఈవీఎంల తీరు అనుమానాస్పదంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పి.చిదంబరం, అభిషేక్ మను సింఘ్వి, దిగ్విజయ్ సింగ్, సచిన్ పైలట్, డీకే శివకుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## 'ఆప్'తో పొత్తుకు నో



**న్యూఢిల్లీ:** త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని, ఆమ్ ఆద్మీ పార్టీతో ఎలాంటి పొత్తు ఉండదని కాంగ్రెస్ పార్టీ శుక్రవారంనాడు ప్రకటించింది. రాష్ట్రంలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఒంటరిగానే పోటీ చేస్తామని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ తెలిపారు. ఏ పార్టీతోనూ పొత్తులుండవని స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరమే ముఖ్యమంత్రి ఎవరనే దానిపై కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

**ఇది ధర్మయుద్ధం: కేజ్రీవాల్**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను 'ధర్మయుద్ధం'గా ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల అభివర్ణించారు. చాందినీ చౌక్‌లో పార్టీ జిల్లా స్థాయి ఆఫీసుబేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "కౌరవుల్లాగానే వారికి (ప్రత్యర్థులు) డబ్బులు, అధికారం ఉన్నాయి. కానీ పాండవుల తరహాలోనే భగవంతుడు, ప్రజలు కూడా మనవైపే ఉన్నారు" అని అన్నారు.

**43 కమిటీలను ఏర్పాటు చేసిన బీజేపీ**

మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల్లో చేయాల్సిన పనులు, అనుసరించాల్సిన వ్యూహాలకు సంబంధించి 43 కమిటీలను ఢిల్లీ బీజేపీ గురువారంనాడు ప్రకటించింది. మహిళలు, యువకులు, ఎస్సీలు, ఓబీసీల లక్ష్యంగా ప్రచారం సాగించడం, కేంద్ర లబ్దిదారులను నేరుగా కలుసుకోవడం వంటి పనులను ఈ కమిటీలు చేపడతాయి. కాగా, ఢిల్లీ 7వ అసెంబ్లీ గడువు 2025 ఫిబ్రవరితో ముగియనుంది. దీంతో ఈలోపు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. చివరిసారిగా 2020 అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహించారు. 'ఆప్' ఘనవిజయం సాధించడంతో కేజ్రీవాల్ వరుసగా మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. మద్యం పాలసీ స్కాములో మనీలాండరింగ్ ఆరోపణలతో కేజ్రీవాల్ ఇటీవల రాజీనామా చేయడంతో ఆప్ సీనియర్ నేత అతిషి సీఎం పగ్గాలు చేపట్టారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : **SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702.** E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.